24-09Pg1exHMNWJQE 1 GNT_24-09Pg1exHMNWJQE.qxd 9/24/2025 12:14 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

గుంటూరు
: fb.com/vaartha Digital


Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-9-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 234 పేజీలు: 12 వెల: 6.50

భరణం కోసం గొంతెమ్మ కోరికలు అనుచితం: సుప్రీం 9లో

చుక్కల్లో పసిడి
10 గ్రా. రూ. 1,14, 380

# పేదలకు వైద్యం ఉచితమే



## పిపిపి విధానంతో మెడికల్ కాలేజీలు

## కన్వీనర్ కోటాలో అదనంగా 110 సీట్లు

## ఆరోగ్యాంధ్ర సాధనకు సంజీవిని ప్రాజెక్టు

## వైఎస్సార్సీ అసత్య ప్రచారాలను అసెంబ్లీలో ఖండించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం రెండేళ్లల్లో పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం వైద్యారోగ్య శాఖపై చర్చ సందర్భంగా పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం అంశాన్ని సిఎం ప్రస్తావించారు. పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంలోని వాస్తవాలను సభ ముందు ఉంచారు. వైఎస్సార్సీ అసత్య ప్రచారాలను అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎండగట్టారు. కాలేజీల నిర్మాణం, సీట్ల సంఖ్య, పేదలకు వైద్య సదుపాయాలు వంటి అంశాలను లెక్కలతో సహా వివరించారు. పిపిపి మెడికల్ కాలేజీల నిర్మాణంపై సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."చరిత్ర తెలియని వారు రాజకీయం కోసం మెడికల్ కాలేజీల నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరగాలంటే పిపిపి విధానం అవసరం. 1996లో నేను తొలిసారి సిఎం అయినప్పుడు ఆరు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఉంది. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలనే విధానాన్ని అప్పట్లోనే మేం అమలు చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తంగా 38 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో 18, ప్రైవేట్ రంగంలో 18, ఎయిమ్స్ మెడికల్ కాలేజీ, గీతమ్స్ యూనివర్శిటీలో మరో మెడికల్ కాలేజీ ఉంది. ఫేక్ న్యూస్ ఫేక్ ప్రచారంతో మెడికల్ కాలేజీలపై ప్రజలను కొందరు మభ్యపెడుతున్నారు." అని సిఎం అన్నారు. రాష్ట్రంలో 1,15,499 మంది డాక్టర్లు, 70,243 మంది నర్సులు ఉన్నారు. మన దేశంలో సగటు జీవిత కాలం 70 ఏళ్లుగా ఉంది. 78 శాతం డిజిటల్ హెల్త్ రికార్డులుచేశాం.. త్వరలో హెల్త్ రికార్డులను 100 శాతం డిజిటలైజ్ చేస్తాం. ఇటీవలకాలంలో డాక్టర్లు సీజేరియన్ కాన్పులు ఎక్కువగా చేస్తున్నారు. 90 శాతం సీజేరియన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతు >>2



మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి నుంచి అవార్డులు అందుకుంటున్న మోహన్‌లాల్, రాణిముఖర్జీ, షారుఖ్, అనిల్

## మోహన్‌లాల్‌కు ఫాల్కే ప్రదానం 2లో

**ఉత్తమ నటుడుగా షారుఖ్, నటిగా రాణిముఖర్జీ, ఉత్తమ తెలుగు చిత్రం భగవంత్ కేసరికి అవార్డులు**

**ఢిల్లీలో జరిగిన వేడుకలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందించిన రాష్ట్రపతి ముర్ము**



# ఏడు యుద్ధాలు ఆపింది నేనే

### ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్, చైనానుంచే రష్యాకు నిధులు

### ఐరాస పనితీరు అంతంతే: యుఎన్ సర్వసభ్య సమావేశంలో ట్రంప్

**న్యూయార్క్, సెప్టెంబరు 23:** ప్రపంచవ్యాప్తంగా తాను అధికారంలోకి వచ్చాక ఏడు యుద్ధాలను విరమింపచేసానని వాటిలో పాకిస్తాన్- భారత్‌ల మధ్య జరిగిన దాడి కూడా ఒకటని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. తాను అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే సమీపంలో ముగింపు కనిపించని యుద్ధాలను విరమింపచేసానని ట్రంప్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఐక్యరాజ్య సమితి చేపట్టాల్సిన బాధ్యతలను తాను నెరవేర్చానని,యుద్ధాలను విరమింపచేయడంలో సమితి ఘోరంగా విఫలం అయిందంటూ ట్రంప్ ఐక్య రాజ్యసమితిపై తీవ్ర విమర్శలుచేసారు. సమితి ప్రస్తుతం నిస్తేజంగా ఉందన్నారు. అంతే కాకుండా రష్యా ఉక్రెయిన్‌పై దాడులకు >>2

# గిరిజన ప్రాంతాల్లో 90 వైద్య పోస్టుల భర్తీ

### అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడారు. "ఉద్యోగ, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ లవల్ల వైద్యుల కొరత ఏర్పడుతుండగా వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజారోగ్యమే లక్ష్యంగా వాక్ఇన్ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తున్నాం. వయోన్నతులు కూడా చేబడుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారం లోకొచ్చిన అనంతరం గిరిజన ప్రాంతాల్లోని 153 పిహెచ్సీలకు కలిపి 306 సివిల్ అసిస్టెంటు సర్జన్ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో ఖాళీగా ఉన్న 138కు 131 పోస్టుల (90 )ను గత 5 నెలల్లో భర్తీ చేశాం. ప్రస్తుతం 31 పోస్టులు (10 ) ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకికూడా చర్యలు తీసుకుంటున్నాం. ప్రకాశంజిల్లా మార్కాపురం జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చేందుకు గత వైఎస్సార్సీ ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో గందరగోళం నెలకొన్నందున వైద్యులు, మౌలిక సదుపాయాలకు కొరత ఏర్పడింది. నిర్మాణాలకు రూ.47 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టింది. 625 పడకలతో మార్కాపురం వైద్య కళాశాలను పిపిపి విధానంలో నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్ సర్వీస్ కోటా పిజి చేసేందుకు వెళ్లిన సుమారు 250 మంది వైద్యులు నవంబరులో రానున్నారు. వీరిని అవసరమైన ఆసుపత్రుల్లో నియమిస్తాం. కనిగిరి, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెంలోని ఆసుపత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గుండె పోటుతో బాధపడేవారికి స్పెషలిస్టు వైద్యులద్వారా స్టెమీ విధానంలో రూ.45 >>2



## భవిష్యత్ విద్యుత్ అవసరాల కోసం కొత్తగా 14 సబ్ స్టేషన్లు

### ఓల్టేజ్ సమస్యలు ఇకరావు: శాసనమండలిలో మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** గృహ, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల భవిష్యత్ డిమాండ్ తీర్చడానికి ట్రాన్స్‌కో పరిధిలోని 68 ప్రాంతాల్లో రూ.5,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లకు సంబంధించి ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర యాదవ్, పేరాబత్తుల రాజశేఖర్, బిటి నాయుడులు అడిగిన ప్రశ్నకు మంగళవారం నాడు శాసన మండలిలో మంత్రి గొట్టిపాటి సమధానం చెప్పారు. ట్రాన్స్ కో చేపట్టే వివిధ పనులతో నెట్ వర్క్ ఓవర్ లోడ్ తగ్గడంతో పాటులో ఓల్టేజ్ సమస్యలను తగ్గించడానికి అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 6 నుంచి 8 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా, అవసరాలకోసం 14 ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాలను చేపడుతున్నామని స్పష్టం చేశారు. పనులన్నీ పూర్తయితే లో ఓల్టేజ్ సమస్య కూడా తగ్గుతుందని మంత్రి వెల్లడించారు.ప్రస్తుతం రాష్ట్రంలో 400 కేవీ సబ్ స్టేషన్లు 18, 220 కేవీ సబ్ స్టేషన్లు 113తో పాటు 132 కెవి సబ్ స్టేషన్లు 244 ఉన్నాయని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ అందుకోగలుగుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, ఇండస్ట్రియల్ పాలసీలతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఎంఒయులు చేసుకుంటున్నాయన్నారు. పరిశ్రమల విద్యుత్ వినియోగానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఐటీ, పరిశ్రమలు, విద్యుత్ శాఖ సంయుక్త కార్యాచరణతో పని చేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్ అవసరాల కోసం అవసరమైన చోట సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. 63 ప్రాంతాల్లో 33 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నం వంటి పట్టణాలలో వర్షాలు పడేప్పుడు, ఇతర సమయాల్లోనూ విద్యుత్ అంతరాయాల సమస్యలను పరిష్కరించడానికి స్కాడా సెంటర్‌ను ఏర్పాటు చేశామని మంత్రి గొట్టిపాటి గౌరవ సభ్యులకు వివరించారు. స్కాడా సెంటర్ వేదికగా విశాఖ నగర పరిధిలోని సుమారు 110 సబ్ స్టేషన్ పనితీరు పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. స్కాడా సెంటర్ వేదికగా ఎక్కడ సమస్య ఉందో వెంటనే >>2




MN 2_24-09pg2exHMNWJQER.qxd 9/24/2025 12:07 AM Page 1





మంగళవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో స్టార్టప్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం

## - శాసనమండలిలో మంత్రి లోకేష్

**సచివాలయం,సెప్టెంబరు 23,ప్రభాతవార్త :** రాష్ట్రంలో పరిశ్రమలు,పెట్టుబడులు,ఉపాధి,విశాఖ ఉక్కు కర్మాగార స్థితిపై శాసనమండలి లఘు చర్చలో ఐటి,మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ వివరణ ఇచ్చారు.మంగళవారం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై వైఎస్సార్సీ సభ్యులు పలు సందేహాలు వ్యక్తంచేయగా మంత్రి స్పందిస్తూ మా ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్సీ ప్రకటనవిడుదలచేసి, భర్తీ ప్రక్రియన చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ,రాష్ట్రాభివృద్ధికి నిరంతర కృషి చేస్తుందని సభాముఖంగాతెలిపారు. ఐటి రంగంలో 5లక్షల ఉద్యోగ, ఉపాధి విశాఖలో కల్పించడానికి ప్రణాళికలు రూపొందించామని ఆంధ్రలో డబుల్ ఇంజన్ గ్రోత్ ఉంటుందని మంత్రి లోకేష్ అన్నారు.విశాఖ ఉక్కు పరిశ్రమ పునరుజ్జీవానికి రూ.11,440కోట్ల నిధులు మంజూరుచేసిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ఆర్థిక కష్టాలను అధిగమించి, నిర్వహణను మెరుగుపర్చడానికి సహాయ సహకారాలు అందించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ,కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్,కేంద్ర ఉక్కు శాఖమంత్రి హెచ్‌డి కుమారస్వామిలను అభినందిస్తూ మంత్రి లోకేష్ తీర్మానం ప్రవేశపెట్టారు,విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటీకరణ జరగదని స్పష్టం చేశారు.



మంగళవారం మొరాకోలో టిఎఎస్ఎల్‌ను ప్రారంభించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్, మొరాకో రక్షణమంత్రి అబ్దెలతీఫ్

# పేదలకు వైద్యం ఉచితమే

>> న్నాయి. సాధారణ కాన్పులు జరిగేలా డాక్టర్లు శ్రద్ధ తీసుకోవాలి. గత ప్రభుత్వ విధానం ప్రకారం కన్వీనర్ కోటాలో ప్రతి కాలేజ్ 64 సీట్లు మాత్రమే ఉంటే... కూటమి ప్రభుత్వం 75 సీట్లు ఇస్తోంది. మా విధానం వల్ల కన్వీనర్ కోటా సీట్లు పెరిగాయి. యూపీ, ఒడిషా, ఝార్ఖండ్ రాష్ట్రాలు పిపిపి పద్ధతిలోనే మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నాయి. ఇవే కాకుండా ఐఐటీ చెన్నై, ఉదయ్‌పూర్, నాగపూర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు పిపిపిలోనే కొన్ని ప్రాజెక్టులు చేపట్టాయి. అంత మాత్రాన అవి ప్రైవేటీకరణ కాదు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా పిపిపి విధానం ప్రాచుర్యంలోకి వచ్చింది." అని ముఖ్యమంత్రి చెప్పారు. ఇలాంటి వాస్తవాలను దాచిపెట్టి ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. ప్రజారోగ్యం విషయంలో... వైద్యపరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఓ ప్రణాళిక ప్రకారం కూటమి ప్రభుత్వం వెళ్తోంది. మెడికల్ కాలేజీల విషయంలో కొందరు దుష్ప్రచారం చేస్తూ రచ్చ చేస్తున్నారు. ట్రైబల్ యూనివర్శిటీని సాలూరుకు మార్చినప్పుడు మేమేమీ అభ్యంతరం పెట్టలేదు. అక్కడే ఆ యూనివర్శిటీ నిర్మాణం పూర్తి చేస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీలో గుండె జబ్బులు, డయాబెటిస్, శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. హైపర్ టెన్షన్, షుగర్ వ్యాధి ఉన్న వాళ్ల సంఖ్య 24.52 లక్షలుగా ఉంది. అంటు వ్యాధులు, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధులు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తంగా 10 రకాల వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. ఏయే జిల్లాల్లో ఏయే రకమైన వ్యాధులు ఉన్నాయో గుర్తించాం. ఆ మేరకు జిల్లాల వారీగా ప్రణాళికలు వేసుకుని... ఆ దిశగా నివారణకు చర్యలు తీసుకుంటాం. దీని నిమిత్తం ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తాం." అని సీఎం చెప్పారు.

ప్రస్తుతం కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు విజయవంతంగా నడుస్తోంది. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా.. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తాం. 2027 నాటికి సంజీవని ప్రాజెక్టును తెస్తాం. టెక్నాలజీతో ప్రజారోగ్యాన్ని కాపాడేలా బిల్ గేట్స్, టాటా సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టు చేపట్టాం. ఈ పథకంలో హెల్త్ రికార్డులను డిజటలైజ్ చేయడంతో పాటు... టెక్నాలజీతో వైద్య సేవలు అందించేలా చూస్తాం. 41 రకాల టెస్టులను నిర్వహించి.. రియల్ టైములో పర్యవేక్షిస్తాం. ప్రజలు అనారోగ్యం బారిన పడక ముందే వారిలో అవగాహన కల్పిస్తాం. ఆస్పత్రికి వెళ్తే వైద్య చికిత్స కంటే రూమ్ రెంట్లే ఎక్కువగా ఉన్నాయి. అందుకే టెక్నాలజీ ద్వారా అనుసంధానించి.. అవసరమైనప్పుడే ఆస్పత్రికి వెళ్లేలా చూస్తాం. పేద వాడి ఇంటికి ఆధునిక వైద్యం చేరేలా సంజీవని ప్రాజెక్టును రూపొందించాం. దీని కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడతాం. హెల్త్ టెక్నాలజీతో మెడ్ టెక్నాలజీని అనుసంధానిస్తాం. రాబోయే ఐదేళ్లల్లో వైద్యారోగ్య రంగంలో గణనీయమైన మార్పులు చూస్తారు. ఉత్తమ వైద్య విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తాం. ప్రతి పౌరుడి ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రణాళికలు రూపొందిస్తాం. ప్రతి పౌరుడీ ఆరోగ్యం కాపాడాలన్నదే ప్రభుత్వం లక్ష్యం." అని చంద్రబాబు వివరించారు.

**హెల్త్ పాలసీ పరిధిలోకి 1.63 కోట్ల కుటుంబాలు..**

యూనివర్సల్ హెల్త్ పాలసీ ఓ విప్లవాత్మకమైన నిర్ణయం. దేశంలో మరే ఇతర రాష్ట్రం ఈ తరహా పాలసీని తీసుకురాలేదు. ఈ తరహా పాలసీ తెచ్చిన తొలి రాష్ట్రంగా ఎపి నిలిచింది. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ. 2.5 లక్షల విలువైన ఆరోగ్య బీమాను ఉచితంగా అందిస్తుంది. పేదలకు రూ. 2.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు అయ్యే వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ భరిస్తుంది. ఇందులో 3257 వైద్య చికిత్సలు నెట్ వర్క్ ఆస్పత్రుల ద్వారా అందరికీ అందుతాయి. ఆరు గంటల్లోనే ప్రీఆథరైజేషన్ చేస్తాం... చికిత్స అందించేలా చూస్తాం. నిధుల కొరత రాదు. నగదు రహిత వైద్య సేవలను అందించేలా యూనివర్సల్ హెల్త్ పాలసీని తెచ్చాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

## డిసెంబర్‌నెల కోటా ఎస్ఇడి, శ్రీవాణి బ్రేక్ దర్శనాలు విడుదల వాయిదా

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** డిసెంబర్ నెలకు సంబంధించిన దర్శనాల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదలచేసే మూడు రోజుల కోటాను టిటిడి నిలుపుదలచేసింది. పరిపాలన కారణాలతో ఆ మూడురోజులకు సంబంధించిన 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు, 10,500 రూపాయలు శ్రీవాణి బ్రేక్ దర్శనాల టిక్కెట్లు మాత్రం విడుదల చేయడం వాయిదావేసినట్లు టిటిడి తెలిపింది.

## వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతున్న డి సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత రెండు రోజు టలుగా జ్వరంతో డిప్యూటీ సిఎం ఇబ్బంది పడుతున్నారు. జ్వరంతోనే నిన్న (సోమ వారం) ఎపి అసెంబ్లీ సమావేశాలు, కీలక సమీక్షల్లో పవన్ కల్యాణ్‌పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం .. పవన్ కల్యాణ్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు. తనశాఖలకు సంబంధించి అధికారులతో పవన్ కల్యాణ్ టెలి కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# నేడు తిరుమలేశునికి సిఎం చంద్రబాబు పట్టువస్త్ర సమర్పణ

**తిరుమల,సెప్టెంబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ఇష్ట దైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి 15సార్లు పట్టువస్త్రాలు సమర్పించి రికార్డు సృష్టించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏడుకొండలవానికి రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకువచ్చి భక్తితో సమర్పించడం ఆనవాయితీ. ప్రస్తుతం నేటినుండి మొదలవుతున్న తిరుమలేశుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తొలిరోజే బుధవారం సాయంత్రం చంద్రబాబు దంపతులు కులదైవమ్ చెంతకు విచ్చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు రాత్రి గరుడసేవకు అలంకరించే పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు చేరుకుంటున్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున తిరుమల వెంకన్నకు బ్రహ్మోత్సవాల సమయంలో పట్టువస్త్రాలు సమర్పించడం సంప్రదాయం. తిరుపతి జిల్లాపర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం 5.35 గంటలకు తిరుపతి-తిరుచానూరు మార్గంలోని తాజ్‌హోటల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గాన తిరుమలకు 6.20గంటలకు గాయత్రి అతిధిగృహంవిచ్చేస్తారు. రాత్రి 7.40గంటలకు తిరుమలలోని బేడిఆంజనేయస్వామి గుడివద్దకు చేరుకుని సాంప్రదాయంగా భక్తితో స్వామివారికి పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకెళతారు. శ్రీవారి ఆలయంలోపలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకుని పెద్దశేషవాహనసేవలో పాల్గొని తిరిగి గాయత్రి అతిధిగృహంలో రాత్రికి బసచేస్తారు. 25వతేదీ గురువారం ఉదయం 9.10గంటలకు పిఎసిఎ 5 వెంకటాద్రినిలయం ప్రారంభిస్తారు. ఇక్కడే ట్విన్‌కమాండ్ సెంటర్, ఇంటెలిజెంట్ క్రౌడ్, సైబర్‌కంట్రోల్, విజన్‌టెస్ట్‌సార్టింగ్ యంత్రాలను ప్రారంభిస్తారు. ఇక్కడ నుండి బయలుదేరి 10.35గంటలకు తిరుపతి హెలిప్యాడ్‌కు చేరుకుని అమరావతికి బయలుదేరుతారు. ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తుండటంతో జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం, టిటిడి గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. తిరుమలలో స్వయంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ స్వయంగా సిఎం పర్యటన, భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. తిరుమలలో గాయత్రి అతిధిగృహం వద్ద ప్రముఖులకు తప్ప మిగిలిన వారికి ఎవరికీ అనుమతివుండదు. భద్రతా పరంగా గట్టి చర్యలు తీసుకుంటున్నారు.

# 90 వైద్య పోస్టుల భర్తీ

>> వేలు విలువచేసే ఉచిత ఇంజెక్షన్ చికిత్స అందిస్తున్నాం. స్టెమీ విధానంలో సుమారు 4వేల మంది రోగులు ప్రాణాపాయ పరిస్థితుల నుంచి కోలుకున్నారు. పీహెచ్సీ స్థాయిలో స్టెమీ విధానం అమలుకు స్పెషలిస్టు వైద్యుల అవసర ముంది. పిహెచ్సీల్లో వీరులేనందున అక్కడ స్టెమీ సౌకర్యాన్ని అందుబాటులోనికి తీసుకురావడం కష్టమవుతుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల మాతృత్వ మరణాలు 38.8నుంచి 30కుతగ్గాయి" అని మంత్రి వివరించారు. జీఎస్టీ సంస్కరణలతో క్యాన్సర్ సహా వివిధ వ్యాధులకు సంబంధించిన అనేక ఔషధాల ధరలు తగ్గుతాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బిజెపి ఎంఎల్ఎలు,ఎంఎల్‌సిలు మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. 'గతంలో ఉన్న నాలుగు శ్లాబుల్ని రెండు చేయడం వల్ల నిత్యావసర వస్తువుల మీద జీఎస్టీ బాగా తగ్గుతుంది. పేద,మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుంది. ఈ సారి ప్రజలకు దసరా,దీపావళి ముందే వచ్చాయి అని సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశానికి ఇది పండుగదినం అని బిజెపి శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. నిత్యావసర ధరల తగ్గింపుతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ఆదోని ఎంఎల్ఎ పార్థసారథి పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి ఎంఎల్ఏలు ఆదినారాయణరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఈశ్వరరావు,శాసనమండలి డిప్యూటీ స్పీకర్ జకీయా ఖానం,ఎంఎల్‌సీలు సోము వీర్రాజు,పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

## 14 సబ్ స్టేషన్లు

>> గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ సమస్య అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి గొట్టిపాటి శాసనమండలి సాక్షిగా గౌరవ సభ్యులకు హామీ ఇచ్చారు.

# ఏడు యుద్ధాలు ఆపింది నేనే

>> భారత్,చైనాలు నిధులు సమకూరుస్తున్నాయంటూ మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి 80వ వార్షిక సమావేశాల్లో ప్రసంగించిన ట్రంప్ ఆసాంతం తన ప్రసంగంలో భారత్‌పైనా, చైనాలపైనే ఎక్కుపెట్టారు. తను విరమింపచేసిన యుద్ధాల్లో కొన్ని 31 ఏళ్లుగా కొనసాగాయని, ఒకటయితే 36 ఏళ్లుగా సాగిందని అధికారంలోకి వచ్చినవెంటనే తాను వీటన్నింటినీ విరమింపచేసానన్నారు. నోబెల్ శాంతి పురస్కారానికి తాను అన్నివిధాలా అన్నిఅర్హతలు ఉన్నవాడినని చెప్పారు. కాబోడియా థాయిలాండ్, సెర్బియా, కాంగో, రువాండా, పాకిస్తాన్ ఇండియా, ఇజ్రాయెల్ ఇరాన్, ఈజిప్టు ఇథియోపియా, అర్మేనియా అజర్‌బైజాన్‌లమధ్య జరిగిన యుద్ధాలను తానే నివారించానని చెప్పారు. ఇన్నేళ్లుగాసాగిన ఈ యుద్ధాల్లో లెక్కలేనంతమంది పౌరులు మరణించారని, తాను బాధ్యతలు చేపట్టినవెంటనే విరమింపచేసినట్లు చెప్పుకొచ్చారు. ఐక్యరాజ్య సమితి కనీసం ఈ దేశాల్లో ఎలాంటి సహాయ కార్యక్రమాలుకాని, దౌత్యపరంగా కార్యాచరణలు కాని అమలుచేయలేకపోయిందని, ఉత్తమాటలు సమస్యలు పరిష్కరించలేవని ఆయన అన్నారు. ప్రపంచదేశాలకు పెద్దన్నలా ఉండే ఐక్యరాజ్యసమితి తాను ఊహించిన స్థాయిలో పనిచేయడంలేదని విమర్శలు గుప్పించారు. పౌరుషపదాలతో లేఖలు రాయడం తప్ప సమితి చేసిందేమీలేదని, ఉత్తమాటలతో యుద్ధాలు ఆగవని, సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ఐక్యరాజ్యసమితి స్థాపించిన అసలు ఉద్దేశ్యాన్ని చేరుకోలేకపోతోందని, అన్నివనరులు, అత్యంత శక్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ సమితి ఆమేరకు సాధించలేకపోతోందని విమర్శించారు. అమెరికాకు ఇపుడు స్వర్ణయుగం వచ్చిందని, తాను చేపట్టిన హెచ్‌వన్‌బీవీసా ప్రక్షాళన, అక్రమ వలసదారులను పంపించిన చర్యలతో సర్వత్రా ఆందోళనతగ్గిందని, అమెరికా ఖజానాకు ఆర్థికపరిపుష్టి చేకూరిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇక ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మంచిది కాదని, రష్యాధోరణి సక్రమంగా లేదన్నారు. ఉక్రెయిన్ వివాదం రష్యా ప్రతిష్టను దిగజారుస్తోందని, భారత్ చైనాలు ఈయుద్ధంలో రష్యాకు నిధులు ఇస్తున్నాయని, నాటో కూడా రష్యా ఇంధనాన్ని కట్టడిచేయలేకపోతోందని దుయ్యబట్టారు. హమాస్ నేతల చేతుల్లో బందీలుగా ఉన్నవారిని వెంటనే విడుదలచేయాలని, కాల్పుల విరమణ పాటించాలని హెచ్చరించారు. కాల్పుల విరమణకు రష్యాకూడా సిద్ధంగాలేదని, అందుకే అమెరికా ఇపుడు మరింత శక్తివంతమైన సుంకాలు ఆంక్షలు విధిస్తుందని ట్రంప్ హెచ్చరించారు. యూరోపియన్ దేశాలు కూడా అమెరికాకు కలిసివస్తే రష్యా దిగివస్తుందని రష్యానుంచి చేసే అన్ని ఇంధన కొనుగోళ్లను నిలిపివేయాలని పిలుపునిచ్చారు.

## నేడు అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ అభయప్రదానం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో మూడవరోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తారు. సకలజీవకోటికి ఆహారమందించే శ్రీ అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మను దర్శించుకుంటే ఆకలి దప్పుల బాధలుండవని భక్తుల నమ్మకం. శ్రీ అమ్మవారు అన్నపానీయాలతో పాటు జ్ఞాన, వైరాగ్యాలను కటాక్షిస్తారు.

## రేపు బంగాళా ఖాతంలో అల్పపీడనం

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర ఒడిశా, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని, దీని అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటున 7.6 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నది రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఉపరితల ఆవర్తనం నుండి మరొక ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. గురువారంనాటికి తూర్పుమధ్య, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ శుక్రవారందక్షిణ ఒడిశాఉత్తరాంధ్ర తీరాల్లో వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది శనివారం దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు.వీటి ప్రభావంతో ఆదివారం వరకు అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు, విస్తృతంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో కోస్తాలో పలుచోట్ల అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. పిడుగులతో కూడిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటి నుంచే రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం నుంచి ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు.

## పారిపోయిన ముద్దాయి బత్తుల ప్రభాకర్ ఆచూకీ కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

**విజయవాడ,సెప్టెంబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** పారిపోయిన ముద్దాయి బత్తుల ప్రభాకర్ ఆచూకీ కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలిపారు.ఎస్కార్ట్ విధులు నిర్వహించడంలో నిరక్ష్యం వహించి రిమాండ్ ముద్దాయి తప్పించుకోవడానికి కారణం అయిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఇప్పటికే సస్పెండ్ చేసారు.ఈ పరిణామాలన్ని నిన్న చోటు చేసుకున్నాయి.ఈ నేపధ్యంలో నగర పోలీసు కమిషనర్ గారు సదరు ముద్దాయిని పట్టుకోవడానికి ఏఆర్ఏడిసిపి. కుంబా కోటేశ్వరరావు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది.సదరు ప్రత్యేక బృంధాలను చుట్టుపక్కల జిల్లాలు అయిన కృష్ణా, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి బృంధాలతోటి సమన్వయం చేసుకుంటూ ఎట్టి పరిస్థితులలో సదరు ముద్దాయిని పట్టుకోవాలని పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

## యువత నిరుద్యోగానికి ఓటు చోరీనే కారణం

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** భారతీయ జనతా పార్టీ 'ఓటు చోరీ'కి పాల్పడుతోందంటూ పదేపదే విమర్శలుగుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ తాజాగా దేశంలోని యువత నిరుద్యోగానికీ, ఓటు చోరీకి ముడిపెట్టి విమర్శలు చేశారు. బిజెపి చేస్తున్న ఓటు చోరీ ఫలితంగానే దేశంలోని యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని అన్నారు. ప్రజల సమస్యలను కేంద్రం పట్టించుకోవడంలేదని, కేవలం సంస్థలను తమగుప్పిట్లో పెట్టుకుని అధికారంలో కొనసాగుతోందని ఆరోపించారు. 'ఈదేశంలోని యువత ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య నిరుద్యోగం. దీనికి ఓటు చోరీలో నేరుగా ప్రమేయం ఉంది. ఏ ప్రభుత్వమైనా ప్రజావిశ్వాసం పొంది గెలిచినట్లయితే యువతకు ఉపాధి,అవకాశాలుకల్పించేందుకు తొలిప్రాధాన్యత ఇస్తుంది. కానీ బిజెపి నిజాయితీగా ఎన్నికల్లో గెలవదు. ఓట్లు చోరీ చేసి, సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికారం సాగిస్తోంది'అని 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.

# మోహన్‌లాల్‌కు ఫాల్కే ప్రదానం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** జాతీయ స్థాయిలో 71వ ఉత్తమ చిత్రాలు, వివిధ విభాగాల్లో ప్రతిభచూపిన కళాకారులకు పురస్కారాల ప్రధానోత్సవం విజ్ఞాన్‌భవన్‌లో వైభవోపేతంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచేతులమీదుగా ఉత్తమ నటులు, నటీమణులు, దర్శకులు, వివిధ విభాగాల అధిపతులు ఈ పురస్కారాలు అందుకున్నారు. తెలుగులో ఉత్తమ చిత్రంగా భగవంత్‌కేసరి ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటిలు పురస్కారాన్ని అందుకున్నారు. హిందీలో ఉత్తమ చిత్రంగా కథల్ ఎ జాక్‌ఫ్రూట్ మిస్టరీ చిత్రాన్ని ఎంపికచేసారు. బాలివుడ్‌నటి రాణిముఖర్జీ ఉత్తమ నటిగా ఎంపిక కాగా ఉత్తమ నటులుగా జవాన్ చిత్రంలో నటించిన షారూక్ ఖాన్, 12త్‌ఫెయిల్ చిత్రంలో నటించిన విక్రమాంత్ మాసేకు లభించాయి. ఇదే చిత్రానికి ఉత్తమ ఫీచర్‌ఫిలిం అవార్డుకూడా లభించింది. వివిధ అవార్డులు అందుకున్న వారి వివరాలు వారి విభాగాలు ఇలా ఉన్నాయి.

**ఉత్తమ చిత్రం:** కథల్ ఎ జాక్‌ఫ్రూట్ మిస్టరీ
**ఉత్తమ ఫీచర్‌ఫిలిం:** 12త్ ఫెయిల్
**ఉత్తమ నటుడు:** జవాన్ షారూక్‌ఖాన్
**ఉత్తమ నటి:** రాణిముఖర్జీ మిసెస్ ఛటర్జీ వెర్సస్ నార్వే
**దాదాసాహెబ్ పాల్కే అవార్డు:** మళయాళనటుడు మోహన్‌లాల్
**ఉత్తమ చిత్ర విమర్శకులు:** ఉత్పల్‌దతా చిత్రం అస్సాం
**ఉత్తమ యాక్షన్ డైరెక్షన్:** హనుమాన్, ప్రశాంత్ వర్మ
**ఉత్తమ గేయరచియత:** బలగం కాసర్ల శ్యాం ఊరు పల్లెటూరు గీతం
**ఉత్తమ ప్రాచుర్యంలోకి వచ్చిన చిత్రం:** రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ
**ఉత్తమ తెలుగుచిత్రం:** భగవంత్‌కేసరి,
**ఉత్తమ గుజరాతి చిత్రం:** వాష్
**ఉత్తమ తమిళ చిత్రం:** పార్కింగ్
**ఉత్తమ కన్నడ చిత్రం:** ది రే ఆఫ్ హోప్
ఉత్తమ నేపథ్య గాయని శిల్పారావు (ఛలియా...జవాన్)
**ఉత్తమ నేపథ్య గాయకుడు:** ప్రేమిస్తున్నా... పివిఎన్ఎస్ రోహిత్ (బేబి తెలుగు)
**ఉత్తమ సినిమాటోగ్రఫీ:** ది కేరళ స్టోరీ
**ఉత్తమ నృత్యదర్శకత్వం:** రాకీ లండ్‌రాని లవ్‌స్టోరీ ధిన్‌దోడా బాజేరే
**ఉత్తమ మేకప్ కాస్ట్యూమ్ డిజైనర్ :** శాంబహాదూర్ చిత్రం
**స్పెషల్ మెన్షన్ :** యానిమల్ చిత్రం రిరికార్డింగ్‌మిక్సర్ ఎంఆర్ రాధాకృష్ణన్
**ఉత్తమ సౌండ్ డిజైన్:** యానిమల్ హిందీ చిత్రం
**ఉత్తమ బాలనటిగా:** సుక్రుతి వేణి గాంధీతాత చెట్టు చిత్రం
**ఉత్తమ నేపథ్య సంగీతం:** హర్షవర్థన్ రామేశ్వర్ యానిమల్
**ఉత్తమ యానిమేషన్ ఎఫెక్ట్స్:** హనుమాన్: ప్రశాంత్ వర్మ
**ఉత్తమ స్క్రీన్‌ప్లే:** బేబీ సాయిరాజేష్

**నాన్‌ఫీచర్‌ఫిలిం కేటగిరీ**

**ఉత్తమ సంగీత దర్శకత్వం:** ద ఫస్ట్ ఫిలిం హిందీ
**ఉత్తమ క్రిటిక్:** ఉత్పల్ దత్తా
**ఉత్తమ డాక్యుమెంటరీ:** గాడ్ వల్చర్ హ్యూమన్ ద సీ లయద సెవెన్ విలేజెస్ (ఒరియా)
**బెస్ట్ స్క్రిప్ట్:** సన్‌ఫ్లవర్ వెర్ ద ఫస్ట్‌వన్‌టు నో (కన్నడ)
**బెస్ట్ ఫిలిం:** నేకాల్ క్రానికల్ ఆఫ్ దిప్యాడీమాన్( మళయాళం)
**బెస్ట్ ఎడిటింగ్ మూవీ :** మూవీఫోకస్ ఇంగ్లీష్

## వారం - వర్జ్యం

24-09-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
తదియ పూర్తి
చిత్త సా.4.18
వర్జ్యం : రా.10.34-12.21
దు.ఉ.11.36-12.24
శుభసమయం: ఉ.7.30-8.30, సా.6.45-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**వృషభం:** గృహం కొనుగోలు యత్నాలు ఆవరణలో పెడతారు. ఉద్యోగులకు స్థాన మార్పులు వుంటాయి.

**మిథునం:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**సింహం:** సభలు, సమావేశాలలో పాల్గొంటారు. సంతాన పురోగతి బాగుంటుంది.

**కన్య :** నిర్మొహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ప్రయాణాలు,

**తుల :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**ధనుస్సు:** కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

**మకరం:** తల్లిదండ్రుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను వహిస్తారు. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు.

**కుంభం:** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. వాహనసౌఖ్యం,

**మీనం :** అవసరమైన సమాచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం నాబాధ్యతను మరింత పెంచింది: మోహన్‌లాల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** కేంద్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న దాదాసాహెబ్ పాల్కే అవార్డును మళయాళనటుడు మోహన్‌లాల్ అందుకున్నారు. తనకు దాదాసాహెబ్ పాల్కే అవార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఈసందర్భంగా మోహన్‌లాల్‌పేర్కొన్నారు. అంతా మ్యాజిక్ లాగే ఉందని, ఈ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందని, ఈపురస్కారం నా ఒక్కడికి కాదని, ఇది మళయాళ చిత్రపరిశ్రమకు చెందుతుందని,మరింత భాధ్యతగా పనిచేస్తానని మోహన్ లాల్ అన్నారు. 1980లో సినిమాల్లోకి వచ్చిన మోహన్‌లాల్ ఉమారు 350కిపైగా సినిమాల్లో నటించారు. మంజిల్ విరింజ పూక్కళ్ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చి 45 ఏళ్ల తన కెరీర్‌లో అనేక మళయాళ, తెలుగు, కన్నడ, తమిళ, హిందీభాషల్లో నటించారు.

# పోక్సోకేసులో నిందితుడికి 20 యేళ్ల జైలు శిక్ష



నిందితుడు యుగంధర్

**చిత్తూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** మైనర్ బాలికలకు మాయ మాటలు చెప్పి శారీరకంగా అనుభవించిన ఓ నిందితుడికి చిత్తూరు ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.శంకర్‌రావు బుధవారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 6,500 రూపాయలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.1 లక్ష ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. సూళ్లూరుపేట మండలం వట్రపాళెంకు చెందిన యుగంధర్ (27) 19 నవంబరు 2021వ తేదీ రాత్రి 11 గంటలకు సమయంలో తనకు దూరపు బంధువు అయిన ఒక మైనర్ బాలిక తన తండ్రి రాకకోసం ఇంటి వద్ద ఎదురు చూస్తుండగా యుగంధర్ వచ్చి తన తల్లి ఆరోగ్యం బాగలేదని శ్రీకాళహస్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ఆమె నిన్న చూడాలని అని చెప్తోందని చెప్పడంతో ఆ మైనర్ బాలిక నమ్మి తనతో వచ్చింది. యుగంధర్ ఆ మైనర్ బాలికను మోటర్ బైక్‌లో ఎక్కించుకుని బిఎన్ కండ్రిగ మండలం కల్లివేటు గ్రామం నుండి తీసుకుని శ్రీకాళహస్తి శివాలయం గుడి వద్దకు తీసుకెళ్లడంతో ఆ మైనర్ బాలిక తనను తన తల్లి వద్దకు తీసుకెళ్లాల్సిందిగా కోరింది. అయితే యుగంధర్ తాను అబద్ధం చెప్పానని, నువ్వంటే ఇష్టమని, పెళ్లి చేసుకుంటానని, లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఆ మైనర్‌బాలికను 21వ తేదీ శివాలయంకు సమీపంలోని వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లి ఆ మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఆ మైనర్‌బాలికను శ్రీకాళహస్తిలో ఓ ఇంటికి తీసుకెళ్లి శారీరకంగా అనుభవించాడు. అనంతరం 23వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఆ మైనర్ బాలికను కలివెట్టు గ్రామం వద్ద వదలిపెట్టి యుగంధర్ వెళ్లిపోయాడు. మైనర్ బాలిక తన ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పడంతో 27వ తేదీ తల్లితో కలిసి బిఎన్ కండ్రిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బిఎన్ కండ్రిగ పోలీసులు యుగంధర్‌పై కేసు నమోదు చేసి నిందితుడు యుగంధర్‌ను అరెస్టు చేసి చిత్తూరు ఫోక్సో కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలుచేశారు. ఫోక్సోకోర్టు ఈ కేసుకు సంబంధించి పూర్వపరాలను విచారించి నిందితుడు యుగంధర్ నేరం రుజువు కావడంతో ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.శంకర్‌రావు నిందితుడు యుగంధర్‌కు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 6,500 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే ప్రభుత్వం బాధితురాలైన మైనర్ బాలికకు ఒక లక్ష రూపాయలు నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవ మరింత బలోపేతం

### భగవత్సేవకులకు త్వరలో విఐపి బ్రేక్ దర్శనం

### శ్రీవారిసేవకులతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని దర్శనానికి ప్రపంచం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు ఇతోధికంగా అమూల్యమైన సేవలందిస్తున్న శ్రీవారిసేవకులు భగవత్సేవకులని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రశంసించారు. శ్రీవారిసేవను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పలు రకాలుగా తిరుమలలో భక్తులకు సేవచేస్తున్న శ్రీవారిసేవ కులకు త్వరలో వారిస్లాట్ ముగిసిన చివరిరోజు విఐపి బ్రేక్ దర్శనం కల్పించే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు.శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభమ వుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుమల లోని ఆస్థానమండపంలో శ్రీవారిసేవ కులతో ఆయన ఆత్మీయంగా మాట్లాడారు. వారందిస్తున్న సేవలు, బ్రహ్మోత్సవాల్లో మరింత రెట్టింపు సేవలు గురించి వివరించారు. తాను ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుని కలసిన ప్రతిసం దర్భంలోనూ శ్రీవారిసేవకులు గురించే ప్రస్తావి స్తానని నాయుడు తెలిపారు. శ్రీవారిసేవ కులు భగవద్బంధువులని ఆయన పేర్కొన్నారు. తిరుమలకు విచ్చేసే భక్తుల్లోనే భగవంతుడు ఉన్నాడని, వారికి సేవచేస్తే భగవంతునికి సేవచేసినట్లేనని ఛైర్మన్ విశ్వాసం వ్యక్తం చేశారు. తిరుమలలో శ్రీవారిసేవకుల సేవాకాలం ముగి సిన తరువాత వారందించిన విశేష సేవలకు మరింత మెరుగైన స్వామివారి దర్శనానికి ఏర్పాట్లుచేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై బోర్డు సమావేశం లోనూ చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, డిఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ,వివిధ రాష్ట్రాలకు చెందిన శ్రీవారిసేవకులు పాల్గొన్నారు.



## వెంకన్నకు అష్టలక్ష్మీచంద్రవంక కంఠి విరాళం

### తెలంగాణ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి బహూకరణ

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** వేం కటేశ్వరస్వామికి తెలంగాణ ఎంపి కొండా విశ్వే శ్వర్‌రెడ్డి 60లక్షలు రూపాయలు విలువైన అష్ట లక్ష్మీచంద్రవంకకంఠిని విరాళంగా అందించారు. 535 గ్రాముల బంగారుతో తయారుచేసిన ఈ చంద్రవంకకంఠిని మంగళవారం ఉదయం ఆలయంలోపల రంగనాయకుల మండపంలో దాత,ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెం కయ్యచౌదరిని కలసి ఆభరణాన్ని అందజేశారు. ఈ ఆభరణం తయారుచేయించి అందజేయడం ఆనందంగా ఉందన్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అంతా శుభమే

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** పెరటాసిమాసంలో ,బ్రహ్మోత్సవాల ఆరంభానికి ముందు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శిం చుకుని ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. తెలుగురాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంగళవారం ఉద యం నైవేద్య విరామసమయంలో ఏసిఏ మాజీ ఛైర్మన్ చాముండేశ్వరినాథ్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, మధ్యప్రదేశ్ హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ కుటుంబంతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరకు న్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సామాజిక మాధ్యమాల్లో అస్యతప్రచారాలపై ఉక్కుపాదం

### టిటిడి కీలక నిర్ణయం

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదే వస్థానం ప్రతిష్టను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో అసత్యప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా టిటిడి విజిలెన్స్, పోలీసుశాఖలు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'సామాజిక మాధ్యమిక బృందం'ఏర్పాటు చేశారు. ఈ బృందం 24 గంటలూ సామాజిక మాధ్యమాలను పర్య వేక్షిస్తుంది. నకిలీ వార్తలను,అసత్యప్రచారాలను గుర్తించి, వాటిని వ్యాప్తి చేసేవారిపై దృష్టి సారి




స్తుంది. ఈ విషయంగా టిటిడి ఈఓ అనిల్ కుమార్‌సింఘాల్ కూడా ఇప్పటికే తొలిసారిగా హెచ్చరించారు. ప్రస్తుతం తిరుమలేశుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతున్న సమయంలో ఈ కీలక నిర్ణయం తీసుకోవడం టిటిడిపై అసత్యప్రచారాలకు అడ్డుకట్ట వేయడ మేనని స్పష్టమవుతోంది. అంతేగాక కేసులు నమోదుకు కూడా సిద్ధమయ్యారు.

## బ్రహ్మోత్సవాలకు పుష్పాలంకరణలు

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభమవుతోంది. తిరుమలను కలియుగవైకుం ఠంగా కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా తీర్చిది ద్దారు. ఆలయం పైభాగాన, పరిసరాల్లో, కల్యాణవేదిక ఉద్యానవనం ప్రాంతాల్లో పలు రకాల కళాకృతులు, ఫల,పుష్ప కళాకృతులు తీర్చిదిద్దారు.



## తిరుపతిలో జిఎస్‌టి ఏసిపై వేటు

**తిరుపతి,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి పోస్టులో ఉన్న ఓ అధికారి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమ రావతిపై ఫేస్‌బుక్‌లో చేసిన అసత్యపోస్ట్ చివ రకు ఆయన ఉద్యోగంపై వేటుపడింది. ఈ సం ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరు పతిలో జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ సుభాష్ తన ఫేస్‌బుక్ ఖాతాలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వరదల్లో మునిగిపోయిందంటూ పోస్ట్ పెట్టారు.

దీంతోప్రభుత్వం వెంటనే అతనిపై సస్పెన్షన్ వేటువేసింది. దీనికి అమరావతిమునిగి పోయిం దని క్యాప్షన్ జోడించాడు. ఈ పోస్ట్ కొంతసేప టికే వివాదాస్పదంగా మారింది. సుభాష్ తన వ్యక్తిగత అభిప్రాయమని వివరణ ఇవ్వడం మరో కొసమెరుపు.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు 'అంకురార్పణ'

## నేడు ధ్వజారోహణం, ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు





ఆలయంనుండి సర్వసేనాధిపతి శ్రీవిశ్వక్సేనులు ఊరేగింపు, వసంతమండపంలో పుట్టమన్ను సేకరణ

**తిరుమల,సెప్టెంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తొలి ఘట్టం ఆరంభమైంది. మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు 'అంకురార్పణ' చేపట్టారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తయిన తరువాత రాత్రి 7గంటలకు శ్రీనివాసుడి సర్వసేనాధిపతి విశ్వక్సే నులవారు ఆలయం నుండి వెలుపలకు వచ్చి మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి నైరు తివైపు ఉన్న వసంతోత్సవమండపంకు చేరుకు న్నారు. అక్కడ సర్వసేనాధిపతి పర్యవేక్షణలో నాలుగుమాడవీధుల్లో ఊరేగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఖానస ఆగమంలోని క్రతు వుల్లో అంకురార్పణం,బీజావాహనం అత్యంత ముఖ్యమైంది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణ నిర్వహిస్తారు. రాత్రి 7గంటల నుంచి 9గంటల వరకు సేనాధిపతి వసంతమండపంలో మృత్సం గ్రహణం,ఆస్థానం నిర్వహించారు. ఆ తరువాత పవిత్రమండపంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్ను సేకరించి నవధాన్యాలను నాటారు. నవధాన్యాలకు మొలక లొచ్చేవరకు నీరుపోస్తారు.సాక్షాత్తు బ్రహ్మదేవుడే దేవలోకం నుండి విచ్చేసి ఈ ఉత్సవాలను నిర్వహిస్తారని ఆర్యోక్తి. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోక నాథం, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపా లదీక్షితులు, విఎస్ ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర,ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్ , అర్చకులు పాల్గొన్నారు.

**నేటి సాయంత్రం ధ్వజారోహణం:** బుధవారం సాయంత్రం 5.43-6.15గంటల మధ్య మీనల గ్నంలో జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామికి నేటి ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తదితరాలు తిరుచ్చిలో నాలుగుమాఢవీధులప్రదక్షిణగా ఆల యానికి వేంచేపుచేస్తారు. ఆలయంలోనికి వేం చేపుచేసి ధ్వజస్తంభంపైకి గరుడపటాన్ని అధిరో హిస్తారు.ఈ గరుడపటం ధ్వజారోహణంతో గోవిందుని బ్రహ్మోత్సవ వాహనసేవలు మొదల వుతాయి. ఈ సందర్భంగా ఆలయంలో తొమ్మిది రోజులు అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు.పూర్తిగా సర్వదర్శనంలో మాత్రమే భక్తులకు దర్శనం కల్పిస్తారు. ముందస్తు గదుల బుకింగ్ రద్దుచేశారు. భక్తుల కోసం 8లక్షల లడ్డూలు తయారుచేసినిల్వవుంచారు. బ్రహ్మోత్స వాలకు విచ్చేసే సామాన్యభక్తులకు వాహనసేవల తోబాటు మూలవిరాట్టు దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేశారు.

## జిఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి ఊతం

### వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు, ప్రభు కిశోర్ జీవిత చరిత్ర బుక్ ఆవిష్కరించిన సిఎం



ప్రభు కిశోర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 23, నప్రభాతవార్త:** జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం మరింతగా అభివృద్ధి చెందడానికి ఉపకరిస్తుందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకలు గత రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. వరుణ్ గ్రూప్ ఏర్పడి 75 ఏళ్ల పూర్తైన సందర్భంగా ఆ సంస్థ అధినేత ప్రభు కిశోర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటోమొబైల్ రంగం సహా ఏపీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సం దర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్దం చేశాం. భవిష్యత్ లో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ఏపీ నుంచే పెద్ద ఎత్తున ఉత్పత్తులు ఎగుమతి చేసేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం. ఆటోమొబైల్ రంగంలో వరుణ్ గ్రూప్ ఎంతో ప్రగతి సాధిం చింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్క రణలు తెచ్చింది.. ఈ సంస్కరణలు ఆటో మొబైల్ రంగ అభివృద్ధికి తోడ్పడతాయి. కొన్ని సంస్థలు మొదటి జనరేషన్‌లో మరికొన్ని రెండో జనరేషన్‌లో దెబ్బతిన్నాయి. చాలా తక్కువ సంస్థలే దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగా యన్నారు. అలాంటి వాటిలో ఒకటి వరుణ్ గ్రూప్. నేటి పోటీ ప్రపంచంలో ఒక సంస్థ 75 ఏళ్ల ప్రస్థానమంటే అంత తేలికైన విషయం కాదు. ఆ ఘనత సాధించిన వరుణ్ గ్రూప్ ను అభినందిస్తున్నాను అని సీఎం అన్నారు. "75 ఏళ్ల క్రితం వరుణ్ గ్రూప్ ఇదే విజయవాడ నుంచి విజయయాత్ర మొదలుపెట్టి దేశవ్యా ప్తంగా గుర్తింపు పొందారు. ఈ ప్రాంతం వాళ్ల అత్యంత తెలివైన వాళ్లు, సమర్థులు. ఇప్పుడు అమరావతి రాజధాని అయింది కాబట్టి విదేశాలు వెళ్లిన ఈ జిల్లావాసులు మళ్లీ వస్తారు. విశాఖ, విజయవాడల్లో అత్యుత్తమ హోటల్ కట్టిన ప్రభు కిషోర్ అమరావతిలోకూడా నోవాటెల్ హోటల్‌కు శంకుస్థాపన చేయడం శుభ పరిణామం. వేలాది మంది యువతకు వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు అనిసీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమా నికి పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు,డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి సహా పలువురు పారిశ్రామికవేత్తలు, వరుణ్ గ్రూప్ సిబ్బంది హాజరయ్యారు.

## రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యత: మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో టెక్స్ టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితతో టెక్స్ టైల్స్ పరిశ్రమ యజమానులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇన్సెంటివ్ లు, విద్యుత్ సరఫరాలో రాయితీలు, నూతన టెక్స్ టైల్స్ విధానంలో మార్పుల గురించి వివరించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల పరిశ్రమల నిర్వహణ భారంగా మారిందన్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ,



రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతా వరణం నెలకొందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ వేస్తోందన్నారు. ముఖ్యంగా టెక్స్ టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకోసం నూతన టెక్స్ టైల్స్ విధానం తీసుకొచ్చా మన్నారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై ఫైనాన్స్, ఇండస్ట్రీస్, చేనేత, జౌళి శాఖ కార్యదర్శితో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ తామన్నారు. టెక్స్ టైల్స్ ఇండస్ట్రీస్ యజమా నుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ విచారణ ప్రకారం చర్యలు: మంత్రి పార్థసారథి

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆవ భూముల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏపీ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలి పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ళ నిర్మాణంపై శాసనసభ ప్రశ్నోత్తరాల్లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాన మిచ్చారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మిం చాలని రాజానగరం ఎంఎల్‌ఏ బత్తుల బలరా మకృష్ణ కోరారు. చాలా చోట్ల గత ప్రభుత్వం సెంటు భూమిలో ఇళ్ళ నిర్మాణం కోసం కేటా యించిన స్థలాలు ఖాళీగా ఉన్నాయని ప్రత్తిపాడు ఎంఎల్‌ఏ బూరగడ్డ రామాం జనేయులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి పార్థసారథి సమాధాన మిచ్చారు. అర్బన్ ప్రాంతాల్లోని ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు కేటాయించడంతో కొన్ని అభ్యంతరాలు వచ్చాయని మంత్రి చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళను వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయకుండా బిల్లులను నిలిపివేసిందని, రూ.900 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. కొత్తగా ఇళ్ళు నిర్మించుకునేవారికి యూనిట్ ధర పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. జగనన్న కాలనీల ఇళ్ళ కోసం చేపట్టిన భూసేకరణలో



అక్రమాలు జరిగాయని చెప్పారు. వైకాపా ప్రభు త్వంలో కేటాయించిన ఇళ్ళను ఆపకుండా నిర్మా ణం పూర్తి చేసేందుకు తోడ్పాటు అందిస్తున్నా మన్నారు. ఇదే అంశంపై మంత్రి మీడియాతో మాట్లాడారు.

## బ్రాహ్మణుల సంక్షేమానికి పాటుపడతా

### కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కే. బుచ్చి రామ్ ప్రసాద్ తెలిపారు. గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ లో మంగళవారం రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సమక్షంలో చైర్మన్ గా కె. బుచ్చి రామ్ ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. బుచ్చి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేశారని ఆలా నిర్వీర్యం చేసినా బ్రాహ్మణ కార్పొరేషన్ ను తిరిగి అన్ని పథకాలతో పునరుద్ధరిస్తాం. గతంలో ఎవరూ బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకున్నవారు లేరని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు బ్రాహ్మణుల సంక్షేమం కోసం దేశంలోనే మొదటిసారిగా బ్రాహ్మణుల సంక్షేమాన్ని మానిఫెస్టోలో పెట్టారని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్య మంత్రికే దక్కుతుందని అన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తా నన్నారు. దేవాలయాల్లో ఆగమ శాస్త్రం ప్రకారం కమిటీలు వేశామని అన్నారు. హిందువుల



బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్ ఆశీర్వదిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

దేవాలయాలపై జరుగుతున్న దాడులపై కూడా కమిటీ వేయాలని చూస్తున్నామన్నారు. వెను కబడిన తరగతుల కాలనీల్లో 1,000 హిందూ దేవాలయాలు కట్టించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీర్వదిం చబ డిన బుచ్చిరామ్ ప్రసాద్ చైర్మన్‌గా బాధ్య తల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనడం సం తోషంగా ఉందన్నారు. బ్రాహ్మణుల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కు దేవదాయ శాఖ కూడా తన సహాయ సహ కారాలను అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణుల పట్ల ఎంతో చేయూతను అందిస్తున్నదని, దేవాలయాల పాలకవ ర్గంలో బ్రాహ్మణులకు డైరెక్టర్‌లుగా అవకాశం కల్పించేందుకు నిబంధనలు కూడా మార్చామని తెలిపారు. వేద పం డితుల ఆర్థిక ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు సంభావనను అందించా మన్నారు. అర్చక వృత్తిలో ఉన్న బ్రాహ్మ ణులకు గౌరవ వేతనం రూ. 10 వేల నుండి 15 వేలకు పెంచి అందిస్తున్నాం. ధూప దీప నైవైద్యం క్రింద రూ. 5 వేల నుండి 10 వేల వరకూ దేవాలయాలకు అందిస్తున్నామం. ధూప దీప నైవైద్యం పథకం క్రింద గతంలో కన్నా కొత్తగా 380 ఆలయాలు నిర్మించేందుకు మంజూరు చేశామని తెలిపారు. దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్ర మాలపట్ల ముఖ్యమంత్రికి చిత్త శుద్ధి ఉం దన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిర్వహణకు అవస రమైన నిధులు ఇంకా కావాలన్నా కేటాయిం చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలియజేశారు.

చైర్మన్‌ను అభినందించిన వారిలో శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, ఏపి ఎన్‌ఆర్‌ఐ చైర్మన్ వేమూరి రవి, ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండి ఎం. చిన్నబాబు, సీఈవో నాగ సాయి, సీనియర్ మేనేజర్ హెచ్. ఆర్. ఎల్.శ్రీనివాస్, తదితర సిబ్బంది ఉన్నారు.

## ఎంఎల్‌సి జయమంగళ పిటీషన్‌పై ముగిసిన వాదనలు, తీర్పు రిజర్వు

**విజయవాడ,సెప్టెంబరు23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎంఎల్‌సీ పదవికి రాజీనామా చేస్తూ తాను ఇచ్చిన లేఖపై శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు నిర్ణయం తీసుకోక పోవడాన్ని సవాలు చేస్తూ జయమంగళ వెంకట రమణ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టులో వాదనలు ముగి సాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్ర సాద్ ప్రకటించారు. అంతకుముందు జరిగిన విచారణలో జయమంగళ తరపు న్యాయవాది అజయ్ వాదనలు వినిపిస్తూ రాజీనామా లేఖ సమర్పించి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఛైర్మన్ నిర్ణయం తీసుకోలేదు. ఏపీ శాసనసభ కార్యక లాపాల నిర్వహణ,విధానం లోని నిబంధన 186,అధికరణ 190(3)(బి) ప్రకారం రాజీనామ సమర్పించాక దానికి ఆమోదించడమో లేదా తిరస్కరించడమో ఏదో ఒకటి చేయాలి.నిర్ణయం తీసుకోవాల్సిన రాజ్యాంగబద్ధమైన భాధ్యత ఛైర్మన్‌పై ఉంది. రాజీనామా లేఖపై తగిన ఉత్తర్వులు జారీ చేసేలా ఛైర్మన్‌ను ఆదేశించండి' అని కోరారు. మండలి ఛైర్మన్ మోషేనురాజు తరపున సీనియర్ న్యాయవాది ఎం.నిరం జన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'పిటీషనర్ తనంతట తానుగా రాజీనామా చేశారా?ఏదైనా ఒత్తిడి ఉందా అనే విషయంపై జయమంగళతో ఛైర్మన్ వ్యక్తిగతంగా మాట్లాడి నిర్ణయం తీసు కోవాలి.ఈ నేపథ్యంలో నవంబరు 28న హాజరు కావాలని ఈ నెల 8న ఛైర్మన్ నోటీసు ఇచ్చారు. ఫలానా విధంగా వ్యవహరించండి అని ఛైర్మన్ ను ఆదేశించడం కోర్టు అధికార పరిధిని దాటి వ్యవహరించడం అవుతుంది. అసాధారణ పరిస్థి తుల్లోమాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకో గలవు.వ్యాజ్యాన్ని కొట్టేయండి' అని కోరారు.

## విజయవాడ ఎగ్జిబిషన్‌కు తొలగిన అడ్డంకులు

దసరా సందర్భంగా 'వైబ్రంట్ విజయవాడ సొసైటీ' ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌కు అడ్డం కులు తొలిగాయి. మచిలీపట్నం గొడుగుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి విజయవాడ శివారు గొల్లపూడిలో సాగు భూమి ఉంది. ఇక్కడి 35 ఎకరాలను ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించే ఎగ్జిబిషన్‌కు 56 రోజులల పాటు కేటాయించడాన్ని సవాల్ చేసూఇ బూరగడ్డ సుజయ్‌కుమార్ వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆభూములను ఎగ్జిబిషన్‌కు కేటాయించడంపై స్టే విధిస్తూ ఏపీ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ ఇటీవల డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది. వాటిని సవాల్ చేస్తూ,సుజయ్‌కుమార్ దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీనిజస్టిస్ విక్రమ్‌నాథ్,జస్టిస్ పీకె మిశ్ర లతో కూడిన ధర్మాసనం సోమవారం విచా రించింది.

## ఎపిలో 11 కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

**హైదరాబాద్,సెప్టెంబరు23, ప్రభాతవార్త:** రైల్వే లైన్లు లేని ప్రాంతాల్లో కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడానికి అంగీకారం తెలిపింది. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు రైలు అందుబాటులోకి రాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని ప్రాంతాల్లో రైల్వేలైన్లను ఏర్పాటుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పదకొండు రైల్వే లైన్ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర రైల్వే శాఖ ఏర్పాట్లు ప్రారంభించింది. డిపిఆర్ సిద్దం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలుమార్గాల్లో రైళ్ల రద్దీ పెరగడంతో పాటు రైళ్లను ఎక్కాలంటే సుదూరం రావాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆక్యుపెన్సీ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రైళ్ల అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇతర రవాణా మార్గాలను ఎంచుకుంటున్నారు. అందుకే ఆయారూట్లలో అవసరమైన చోట మూడు, నాలుగు, ఐదు, ఆరో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు.రైల్వే శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1960 కిలోమీటర్ల వరకూ కొత్త ప్రాజెక్టుల డిపిఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగానే కొండపల్లి నుంచి మైల వరం, తిరువూరు మీదుగా సత్తుపల్లి సమీ పంలోని లంకపల్లికి కొత్త రైల్వేలైన్ నిర్మాణం ఏర్పాటు చేయనున్నారు.

వార్త


కొంత లోకజ్ఞానం, కొంత ఓర్పు, కొంత హాస్య చతురత ఉంటే ఈ జీవితంలో మనం ఎంతగానో సంతోషంగా ఉండవచ్చు.

-బల్తజాన్

# సూత్రధారులే మూలం

చట్టాలకు సామాన్యులు లోకువ, సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారోకానీ మారిన కాల, మాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజమనిపిస్తుంది. ఆర్థిక, అంగ, అధికార, రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు రోజులు దాపురించాయి. మిగిలిన విషయాలు ఎలాఉన్నా మానవజాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికార యంత్రాంగం కానీ అంత సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బందిఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలున్నాయి.నిత్యం నిఘా పెడుతున్నారు. వీటన్నింటిని మించి తెలంగాణ ప్రభుత్వం 'ఈగల్' అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. కానీ నిత్యంఎక్కడో ఒకదగ్గర పట్టుబడుతూనే ఉన్నాయి. చిన్న స్థాయిలోనే కాదు భారీఎత్తున కోట్లాది రూపాయలు విలువైన డ్రగ్స్ నిందితులతోసహా పట్టుకుంటున్నారు. గత వారంలో సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరధిలో దాదాపు ఇరువై అయిదు కోట్ల విలువైన గంజాయితో సహా మత్తుమందులను సీజ్‌చేశారు. ఈ మత్తు మందుల కేసుల్లో పట్టుబడుతున్న నిందితుల్లో తొంభైశాతం నలభై ఏళ్ల లోపల ఉన్న యువకులే. ఇటీవల కాలంలో యువతుల భాగస్వామ్యం కూడా పెరిగిపోతుండడం ఆందోళన కల్గిస్తున్నది. గత మూడేండ్లలో సైబరాబాద్ పరిధిలో 14వేల కేసులు నమోదు అయితే అందులో 13వేల 684మంది యువజనం ఉన్నారు.అందులో 316 మంది యువతులున్నారు. చెన్నై, ముంబాయి,బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లోని విమానాశ్రయాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ గత రెండు,మూడేళ్లగా పట్టుబడిందివెయ్యి కోట్లపైనే ఉండొచ్చని అంచనావేస్తున్నారు.అంతకుముందు ఒకసారి కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకదళం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు నాలుగు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఈ యేడాది కూడా దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల డ్రగ్స్ కనుగొంటున్నారు. అంతెందుకు మొన్న హైదరాబాద్ నగరంలో మహారాష్ట్ర పోలీసులు ఏకంగా మత్తుమందు తయారు చేస్తున్న కర్మాగారాన్నే కనుగొన్నారు. ఈ సందర్భంగా పన్నెండు మందికిపైగా అదుపులోకి తీసుకున్నారు. ఇక గతవారంలో హైదరాబాద్ నడిబొడ్డున స్కూలు ముసుగులో మత్తుమందులు తయారు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. భారీ ఎత్తున మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. మరోకపక్క మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో కూడా మత్తుపదార్థాల వినియోగం పెరిగిపోతున్నది. ముంబయి మహానగరం కొకైన్‌కు కేంద్రంగా మారినట్లు చెప్పక తప్పడం లేదు. ఇక గంజాయి సాగు దేశంలోనే అనేక రాష్ట్రాల్లో భారీగానే జరుగుతున్నట్లు సమాచారం. అయితే దండకారణ్యం ప్రాంతంలో ఇటీవల కేంద్ర పోలీసు బలగాలకు మావోయిస్టులకు జరుగుతున్న పోరుతో కొంత తగ్గినట్లు కన్పించినా కొన్ని ప్రాంతాల్లో మాత్రం విస్తారంగా సాగు చేస్తున్నారు.అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి గంజాయి పంటలను ధ్వంసం చేస్తున్నా మళ్లీ మూడు నెలల్లో యధావిధిగా సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆ ప్రాంతంలో ఉన్న అమాయక రైతులు, రైతు కూలీలు, ముఖ్యంగా గిరిజనులు ఈ కేసుల్లో ఇరుక్కుపోతున్నారు. గంజాయి సాగులోనేకాదు రవాణా, వ్యాపారంలో కూడా పట్టుబడుతున్నది పాత్రధారులే. మాదకద్రవ్యాలు అఫ్ఘానిస్థాన్ నుంచి ఆఫ్రికా మీదుగా భారత్ చేరుకొని వివిధ మార్గాల ద్వారా దేశంలోని అన్నిప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్య భారతంలోని వివిధ తీవ్రవాద బృందాలకు నిధులు అందిస్తున్నట్లు కూడా సమాచారం. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక గంజాయితో పాటు బ్రౌన్‌షుగర్, కొకైన్ వంటి మత్తుపదార్థాల రవాణాలో కొందరు విద్యార్థులు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. మొత్తంమీద ఈ సరఫరా ముఠాల కదలికపై నిఘావేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా మత్తు పదార్థాల విస్తరణకు కారణమవుతున్నది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. ఈమహమ్మారి దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. మరోకపక్క ఎంతోమందిని అరెస్టు చేస్తున్నారు. కేసులు పెడుతున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఈవ్యాపారం ఆగడంలేదు. లక్షలాది కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఈజాడ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరి మితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. అవసరమైతే చట్టానికి మరింత పదునుపెట్టాలి. వినియోగం, ఉత్పత్తి, వ్యాపారం అత్యంత తీవ్రమైన నేరాలుగా కాంబోడియా, వియత్నాం,సింగపూర్ తదితర దేశాలు పరిగణించి మరణశిక్షలు కూడా విధించడానికి వెనుకాడడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పాత్రధారులతోపాటు సూత్రధారులను పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితులు కన్పించడం లేదు.

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.



బి.జాన్సన్

చెలమలో నీరు తీసినకొద్దీ ఊరినట్టు, మనిషిలో చదివిన కొద్దీ వివేకం పెరుగుతుంది.



జి.ముర్రే

# అవినీతి పాలకులకు ఇక చెల్లుచీటీ!

*రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను రాజ్యాంగబద్ధంగా పనిచేసే విధంగా ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు,సంస్థలు అవినీతి బంధుప్రీతి రహితంగా విధులు నిర్వహించాలి. లేకపోతే భవిష్యత్తులో తగినమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని గ్రహించాలి. ప్రజలందరికీ కనీసం కూడు, గూడు,గుడ్డ అందించేపని పాలకులు చేపట్టాలి. విద్యా,వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషిచేయాలి.బడ్జెట్లో అధిక నిధులు సమకూర్చాలి. అధిక ధరలు, ప్రైవేటీకరణకు ముకుతాడు వేయాలి. సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలతో సుస్థిర అభివృద్ధి అసాధ్యం అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. వికసిత భారత్‌గా మనదేశం భవిష్యత్తులో మారాలంటే ముఖ్యంగా పాలకులు పారదర్శకంగా పరిపాలన అందించడంతో సాధ్యం.*

ఐ.ప్రసాదరావు

ఇటీవల కాలంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలు యావత్ ప్రపంచాన్ని హడల్ ఎత్తించాయి. ఈ సంఘటనలతో దాదాపు అన్ని దేశాధినేతలు, పాలకులు, ప్రభుత్వాలు చాలా గుణపాఠాలు నేర్చుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాల్లో ప్రజలు చాలా ఓపిక, సహనం కలిగి ఉంటారు. ఓటు ద్వారా, సోషల్ మీడియా ద్వారా, పత్రికలు ద్వారా, భావ ప్రకటన ద్వారా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతూ ఉంటారు.ఇవేమీ పట్టించుకోకుండా, అధికారం మన చేతిలో ఉంది అని మూర్ఖంగా ముందుకు పోయే ప్రభుత్వాలకు ప్రజలు ముఖ్యంగా యువత ఏ రకంగా బుద్ధి చెబుతుందో గతంలో శ్రీలంకలో జరిగిన పరిణామాలు, తాజాగా నేపాల్‌లో జరిగిన పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.తస్మాత్ జాగ్రత్త పాలకులారా అని హెచ్చరికలు యువత ప్రత్యక్ష చర్యలు ద్వారా తెలియజేయడం జరిగింది. ఇక ప్రపంచవ్యాప్తంగా పాలకులు తమ పాలనా పద్ధతులను, విధానాలు మార్చుకోవాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిఉంటుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో ప్రజలు, యువత ఇంత బాహాటంగా పాలక వర్గంపై హింసాత్మక ఘటనలతో రెచ్చిపోవడానికి ప్రధాన కారణాలు 'పాలకుల అవినీతి, బంధుప్రీతి' అని గ్రహించాలి.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ ఎత్తున అవినీతి/బంధుప్రీతికి పెద్ద పీటవేసి, ప్రజల అవసరతలు పక్కన పెట్టడంతో చివరికి విసుగు చెందిన ప్రజలు యువత ప్రత్యక్ష చర్యలకు పాల్పడి,పాలకులను పారద్రోలుతున్నారు. నిజానికి రాజకీయాల్లో వచ్చిన ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత స్వార్థం వదులుకుని, ప్రజలకు సేవ చేయాలి. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలి.ప్రజల అవసరతలు తీర్చాలి. వారి అభిప్రాయాలను గౌరవించి తదనుగుణంగా పాలన అందించాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి.ప్రజాదర్బార్ తరచూ నిర్వహిస్తూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి. కానీ నేటి పాలకులు ఎన్నికయ్యే వరకూ ప్రజలే దేవుళ్లు అంటూ పొగిడి, ఓట్లు, సీట్లు దండుకుని తదుపరి ప్రజలకు దూరం జరగడంతో ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు.అవినీతి, బంధుప్రీతి భారీ స్థాయిలోచేయడం, అధికారం అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో నడవడంతో చివరికి దేశం విడిచి పారిపోయే పరిస్థితి, ప్రాణ సంకటంతో బ్రతికే పరిస్థితి తెచ్చుకోవడం జరుగుతుంది.ఇకనైనా పాలకుల స్వభావం మారాలి. ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ప్రపంచ సర్వే సంస్థలు వెలువరించిన నివేదికల ప్రకారం ముఖ్యంగా అవినీతిలో శ్రీలంక 121వ స్థానంలో, బంగ్లాదేశ్ 151వ స్థానంలో, నేపాల్ 107వస్థానంలో, ఇక భారతదేశం 96వ స్థానంలో ఉంది. అనగా ఈ దేశాల్లో అవినీతి బంధుప్రీతి ఎంతగా విస్తరించి ఉందో తేటతెల్లం అవుతుంది. పాలకులు నిజ జీవితంలో ముఖ్యంగా అధికారం చేపట్టిన తరువాత విచ్చలవిడిగా అవినీతి బంధుప్రీతితో వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేయడంతో, మోసపోయిన ప్రజలు పోరుబాటపడుతున్నారు.తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నారు. ఇక అన్ని దేశాల పాలకులు



కళ్లు తెరవాలి. తమ పాలనను సమీక్షించుకోవాలి. పారదర్శకంగా పరిపాలన అందించాలి. ప్రజల మన్ననలు పొందాలి. మన దేశంలో కూడా ఇటీవల కాలంలో రాజకీయ అవినీతి, బంధుప్రీతి పెచ్చుమీరుతున్నది. ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూడటం జరుగుతుంది.ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు.ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోరాదు. ప్రజల అవసరతలు పాలకులు తీర్చాలి. ఎన్నికల్లో అడ్డమైన వాగ్దానాలు ఇచ్చి, గద్దె ఎక్కిన తరువాత గళ్ళా పెట్టెలో డబ్బులు లేవు అని మోసం చేయరాదు.గత ప్రభుత్వాలు ఎంత మేరకు నిధులు నిల్వలు ఉంచారోతెలిసే కదా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ప్రజలకు, యువతకు అనేక వాగ్దానాలు ఇచ్చి, ఓట్లు సీట్లు దండుకుని,తీరా అధికారం చేపట్టిన తరువాత డబ్బులు లేవు అని వాగ్దానాలు నెరవేర్చకపోతే, ప్రజలకు, యువతకు ఆగ్రహం రాక ఏమోతుంది? తస్మాత్ జాగ్రత్త పాలకులారా, ప్రజా ప్రతినిధులారా ఎల్లకాలం ప్రజలు, యువత అమాయకులు కాదు అని ఇకనైనా గ్రహించాలి. ముఖ్యంగా అవినీతి బంధుప్రీతివదులుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటూ, కనీసం శాసనసభ సమావేశాలకు, శాసన మండలి సమావేశాలకు, పార్లమెంటు సమావేశాలకు రాకుండా వేతనాలు తీసుకోవడం మంచిది కాదు. భవిష్యత్తులో జవాబు చెప్పవలసిన పరిస్థితి ఉంటుంది.అధికారం రాలేదు అని, గెలిచిన తరువాత సమావేశాలకు రాకుండా ఉంటే ఎలా? మీ నియోజకవర్గం ప్రజల అవసరతలు ఎలా తీరుస్తారు? మీ ప్రాంతాల ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించబడతాయి. ఇకనైనా ఆలోచన చేయాలి.ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు, ప్రజల మనిషిగా ఉండాలి.సొంత వ్యాపారాలు పెంచుకోవడం, సొంత సంపద పెంచుకోవడం కోసం రాజకీయ అవతారాలు ఎత్తడం సరికాదు. ఏదో ఒక సమయంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని మన ఇరుగు పొరుగు దేశాల పరిస్థితులు బట్టి తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి.'మాఎమ్మెల్యే కనుపడుట లేదు, మా ఎం.పి కనుపడుట లేదు, మాప్రజా ప్రతినిధి కనుపడుట లేదు అనే బోర్డులు దర్శనం కారాదు. మనదేశంలో కూడా ముఖ్యంగా రాజకీయ వ్యవస్థ, ప్రతినిధులు అవినీతి బంధుప్రీతితో తారాస్థాయికి చేరుకుంటుంది. ఇకనైనా చిత్తశుద్ధితో పనిచేయాలి. పారదర్శక పాలన అందించాలి. మన భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి. రాజ్యాంగ నిర్మాతలు,స్వాతంత్ర్య సమర యోధులు ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చండి. దేశంలో ఉన్న అవినీతిపై ఉక్కుపాదం మోపాలి. నిరక్షరాస్యత, అనారోగ్యం పేదరికం కూకటివేళ్లతో పెకలించాలి. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను రాజ్యాంగ బద్ధంగా పనిచేసే విధంగా ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు అవినీతి బంధుప్రీతి రహితంగా విధులు నిర్వహించాలి. లేకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని గ్రహించాలి.ప్రజలందరికీ కనీసం కూడు, గూడు, గుడ్డ అందించే పని పాలకులు చేపట్టాలి. విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి.బడ్జెట్లో అధిక నిధులు సమకూర్చాలి.అధిక ధరలు, ప్రైవేటీకరణకు ముకుతాడు వేయాలి. సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలతో సుస్థిర అభివృద్ధి అసాధ్యం అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. వికసిత భారత్‌గా మనదేశం భవిష్యత్తులో మారాలి అంటే ముఖ్యంగా పాలకులు పారదర్శకంగా పరిపాలన అందించడంతో మాత్రమే సాధ్యం. ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా తలసరి ఆదాయం పెరుగుతుంది. జీవన ప్రమాణాలు కలిగి ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలు సరసన మన భారత్ చేరుతుంది. అవినీతి బంధుప్రీతి రహిత దేశంగా, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మన పాలకులు మన దేశాన్ని తీర్చిదిద్దుతారు అని ఆశిద్దాం.ఇటీవల మన ఇరుగు పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిణామాలు, అన్ని దేశాలకు కనువిప్పు కావాలి. ●

# మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు పెద్దపీట వేయలేమా!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయ సాధనలు, పిల్లల పెంపకం, కెరీర్ బాధ్యతలతో సతమతం అవుతున్న మహిళలకు తమ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్, శ్రేయస్సు పట్ల ఆలోచించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా సెప్టెంబర్ చివరి బుధవారం రోజున, అనగా 24 సెప్టెంబర్ 2025 రోజున జాతీయ మహిళా ఆరోగ్యం ఫిట్‌నెస్ దినోత్సవం (నేషనల్ వుమెన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. మహిళా ఆరోగ్యం చాలా సంక్లిష్టతతో కూడి పలు సవాళ్ల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మహిళలకు కౌమార దశ నుంచి వృద్ధాప్యం వరకు మోనోపాజ్, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం, రుతు స్రావ సమస్యలు, పిసిఎస్ సమస్యలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీనికి తోడుగా ప్రతి చిన్న సమస్యను బూతద్దంలో చూస్తూ అనవసర ఆందోళన, నిరాశ, ఒత్తిడులు, పని ఆధార ఒత్తిడులు, సామాజిక కట్టుబాట్లకు లోనవుతూనే ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మహిళలకు అనారోగ్యం, శారీరక సమస్యలు, మానసిక ఉద్రేకాలు, భావోద్వేగ సమస్యలను అదుపులో ఉంచుకోవడానికి తగు సమాధానాలను ప్రచారం చేయడం నిరంతరం కొనసాగించాలి. కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశాలు, ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, శారీరక శక్తిజననం,సరైన సమయంలో నిద్రపోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం, శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి. మహిళలకు అందుబాటులో ఉన్న సమయాన్ని తగు రీతిలో ప్రాధాన్యతా క్రమంలో గడపడం, దినచర్యలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, టెక్నాలజీ వాడుతూ తేలికగా పని చేయడం, సుసాధ్యం అయ్యే లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అవసరం అయినప్పుడు పనిని ఇతరులకు కేటాయించడం, విశ్రాంతికి తగు సమయం కేటాయించడం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి విధిగా జరగాలి. మహిళలు తమ పని ఒత్తిడిలో తగు పోషకాహారాన్ని తీసుకోవడంలో విఫలం అవుతూ ఉంటారు. అందరూ తిన్న తర్వాత మిగిలిన దానిని తిని తమ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటారు. సమతుల పోషకాహారం తీసుకోవడం, పోషకాహారలోపాలను గమనించి ఆహార అలవాట్లు మార్చుకోవడం,ప్రతిరోజు తగు నీటిని తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం, పోషకాహారాన్ని మాత్రమే తయారు చేయడం,ప్రాసెస్డ్ ఫుడ్ వాడకాన్ని తగ్గించడం, శరీర స్వభావాన్ని బట్టి ఆహారం ఎంపిక చేసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మహిళలుతమ ఆరోగ్యాలను కాపాడుకోవాలి. మానసిక వికాసానికి అవసరమైన వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ,మానసిక స్పష్టత, నిద్రలేమి సమస్యను దూరం చేయడం, ఆశావహ సామాజిక సంబంధాలను నెలకొల్పడం, నిలకడను పెంచుకోవడం,వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం, ఆత్మగౌరవాన్ని కాపాడుతుంటే ముందుకు సాగడం లాంటివి కొనసాగించాలి. మహిళలు తమ జీవనశైలిని తగురీతిలో మార్చుకుంటూ, పోషకాహారం తీసుకుంటూ, కుటుంబ శ్రేయస్సుతోపాటు తమ ఆరోగ్యం పరిరక్షించుతుంటూ, ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలి. ●

# ప్రజావాక్కు



### తిన్నింటి 'వీసాలు' లెక్కబెడుతున్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్,హెచ్‌వన్‌బి వీసా ఫీజుని ఎకాఎకీ ఆరు రెట్లు పెంచి వెంటనే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించడంభారత్‌లో ప్రకంపనలురేపింది.అమెరికాలో ఉన్న కంపెనీలు ఆ దేశ పౌరులు కాని తమ ఉద్యోగుల్ని అక్కడ ఉండిపనిచేసుకోడానికి ఉద్దేశించి ఇప్పించేపర్మిట్ లే హెచ్‌వన్‌బి వీసాలు. అమెరికా వాటిని మూడు సంవత్సరాల వ్యవధికి ఇస్తుంది. తర్వాత అవసరమైతే ఇంకో మూడేళ్లు పెంచుతుంది. ఆ ఫీజు సంవత్సరానికి లక్ష డాలర్లు అంటే ఎనభై లక్షల రూపాయలుగా అధ్యక్షుడు పెంచినట్లు ప్రకటన మొదటవచ్చింది.తర్వాత అది సంవత్సరానికి కాదు, వన్ టైమ్ కట్టాల్సింది, అదీ కొత్త దరఖాస్తుదారులకే అని వివరణ వచ్చింది. కొంతనయం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గెజిటెడ్ హోదా కల్పించాలి

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేయుచున్న పరిశోధన విద్య పూర్తి చేసి అటెండర్ నుండి ఐఎఎస్ ఆఫీసర్‌లు వివిధయూనివర్సిటీల నుండి వివిధ అంశాలపై పరిశోధనచేసి, డాక్టరేట్, పీహెచ్‌డి పట్టా పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఇంక్రిమెంట్ ప్రోత్సాహకంగా ఇవ్వాలి. వీరికి గెజిటెడ్ హోదాకల్పించాలి.కనీసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులైన ఉద్యోగులను డాక్టరేట్ పట్టాపొందిన వారిని గుర్తించి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.

- రాపాక రవీందం, జనగాం

### అభివృద్ధికే ఆటంకం

ఏ.ఐ, క్వాంటమ్, కంప్యూటింగ్ వంటి వాటిలో ప్రపంచ దేశాలమధ్య పోటీ అధికమైంది.పరిశీలనలప్రకారం ఆయా సాంకేతికల్లో తగినంత మంది నిష్ణాతులు అమెరికాలో లేరు. తదనుగుణంగా దేశవిదేశాల్లోని ప్రతిభావంతులకు ఎర్రతివాచీ పరవడం ద్వారానే శాస్త్రసాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతిని సాధించగలిగింది.హెచ్.వన్.బి.వీసాతో అమెరికాకు వెళ్లినవారిలో ఎంతోమంది సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధిఅవకాశాలు కల్పిస్తున్నారు. ఇవేవీ పట్టించుకోని ట్రంప్ దురహంకారం చివరకు అమెరికా అభివృద్ధికే ఆటంకమోతుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### ఇదీ మన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని రాజకీయాలుబహురసవత్తరంగా సాగుతున్నాయి.వై.ఎస్.ఆర్.సి.పి. అనే ప్రభుత్వవ్యతిరేక పార్టీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రతీ చర్యను తీవ్రంగా తమ మీడియా ద్వారా,నాయకులద్వారా, టి.వి.వారు నిర్వహించేడిబేట్ల ద్వారా ఖండిస్తున్నారు. అది వారి రాజకీయ ఎత్తుగడలో భాగమే అనుకుందాం.ఈనిందితులు చిరునవ్వులు చిందించిహుందాగా, నిండుగా వస్త్రాలంకరణ చేసుకుని వారి వెంట వంది మాగధులతో ఖరీదయిన కార్లలో, పోలీసు వారి సంరక్షణతో, ఏమాత్రం భయం లేకుండా విచారణలకు హాజరవుతున్నారు. అటువంటి వారికి కోర్టువారు క్షణాల్లో బెయిల్ మంజూరు చేస్తారు. ఇదే సామాన్యులైతే రెక్కలు విరచి మరీ విచారణ జరిగే ప్రదేశానికి తీసుకెడతారు. చట్టాలు మారినా వీటి చుట్టరికాలు రాజకీయ నాయకులకు మరింత చేరువవుతున్నాయి. ఇదీ మన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అంధకారంలో అమెరికా

వీసా నిర్ణయం అమెరికాను అంధకారంలో పడేస్తుంది. ఎందుకని ట్రంప్ నిర్ణయాలు అమెరికా తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే చేస్తాయి. కానీ భవిష్యత్ అంధకారం అవుతుంది. బిగ్ 7కంపెనీలు ఇండియా వంటి దేశాల వైపు తరలిపోతాయి. వేరే దేశాలలో ఉండే యువ ఉద్యోగుల మీద వీసా పొడిగింపు కోసం కంపెనీలు లక్ష డాలర్ల ఖర్చు చేయలేవు. ఇకపోతే స్వదేశీ ఉద్యోగం నినాదంతో అధికారం చేపట్టిన ట్రాంప్ భారత్ వంటి వర్ధమాన దేశాలకు హైదరాబాద్ వంటి ఐటి హబ్‌లకు సువర్ణ అవకాశం కల్పిస్తున్నారు. తద్వారా మెక్ అమెరికా గ్రేట్ అనే నినాదం మాసిపోతుంది. అమెరికా అంధకారంలో పడుతుంది.

- భారత అవినాష్, జనగామ

### అడ్డుకట్ట వేయాలి

వన్య ప్రాణులు జనావాస ప్రదేశాలలోకి రాకుండా ప్రభుత్వం అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పులులు, సింహాలు, ఏనుగులు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు ఈ మధ్య కాలంలో జనావాస ప్రాంతాల్లోకి వచ్చి దాడులు చేస్తున్నాయి. అడవిలో వాటికి ఆహారం దొరకకపోవడమే కారణం కావచ్చు. కావున వన్య ప్రాణులు సమస్య గుర్తించి అవి జనావాసంలోకి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోని వెంటనే అమలు జరిగేటట్లు చూడాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'వక్ఫ్'లో కొన్ని సవరణలపై స్టే చాలునా?

జాన్ బర్నబాస్ చిమ్మె

కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన వక్ఫ్‌సవరణ చట్టం 2025పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం కొన్ని సవరణలు రాజ్యాంగ వ్యతిరేకమైనవని భావిస్తూ వాటి అమలును నిలిపివేస్తూ స్టే విధించింది. కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాం మతాన్ని అనుసరిస్తున్నవారు మాత్రమే వక్ఫ్‌ను రూపొందించగలరనే నిబంధన కూడా స్టే విధించిన జాబితాలో ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టీన్‌జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనంమధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన ఆస్తులపరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగ బద్ధతపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పిటిషన్లు వక్ఫ్‌చట్టం 2025ను రద్దుపరచాలని కోరుతూ దాఖలు అయ్యాయి. పిటిషనర్లు వాస్తవానికి మొత్తం చట్టాన్నే కొట్టివేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం రాజ్యాంగ బద్ధతను పాటించని సెక్షన్లను మాత్రం నిలిపివేయాలని ఆదేశించింది. చట్టం రాజ్యాంగ బద్ధతకు ఊహ ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటుందని, అరుదైన సందర్భాలలో మాత్రమే జోక్యం చేసుకోవచ్చని మేము భావిస్తున్నాము అని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ణయించడానికి కలెక్టర్‌కు ఇచ్చిన అధికారాలపై కూడా సుప్రీంకోర్టు స్టే విధించింది. వక్ఫ్‌బోర్డులో ముస్లింయేతరుల భాగస్వామ్యం అనే వివాదాస్పద అంశంపై తీర్పునిస్తూ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ఉండే 20 మందిలో నలుగురు కంటే ఎక్కువ మంది ముస్లింయేతర సభ్యులు ఉండకూడదని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో 11 మందిలో ముగ్గురు కంటే ఎక్కువ ముస్లింయేతర సభ్యులు ఉండకూడదని ఆదేశించింది. కొత్త చట్టంలోనిప్రతి విభాగానికి 'ప్రాథమిక అడ్డంకి' (సవాలు)గా ధర్మాసనం పరిగణించింది. చట్టంలోని మొత్తం నిబంధనలను నిలిపివేయడానికి ఎటువంటి కేసును రూపొందించలేదని ధర్మాసనం పేర్కొంది.అయితే ఇందులోని కొన్ని విభాగాలకు కొత్త రక్షణ అవసరమని సుప్రీంకోర్టు ధర్మాసనం భావించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రాథమికంగానూ, తాత్కాలికంగానూ ఉన్నాయనీ తుది విచారణలో చట్టం రాజ్యాంగ చెల్లుబాటుపై పిటిషనర్లు లేదా కేంద్రప్రభుత్వం పూర్తి వాదనలు ముందుకు తీసుకెళ్లకుండా అవి నిరోధించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నాడా లేదా అని పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమాలను రూపొందించేవరకూ వక్ఫ్(సెక్షన్ 3(ఆర్) ఆస్తిని అంకితం చేయడానికి ముందు గత ఐదు సంవత్సరాలుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్న వ్యక్తి అయి ఉండాలి అనే నిబంధన ఏకపక్ష అధికార వినియోగానికి దారి తీస్తుంది అని సుప్రీం కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ధారించడానికి నియమించబడిన ప్రభుత్వ అధికారులకు ఉన్న అధికారాలకు సంబంధించి ఉన్న సెక్షన్ 3(సి)కి సంబంధించి అత్యంత ముఖ్యమైన విషయంపై సుప్రీంకోర్టు ప్రస్తావించింది. ప్రభుత్వ అధికారి నివేదిక ప్రకారం ఒక భూమి ఆక్రమణ కాదని నిర్ధారించే వరకూ ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించరాదని చట్టంలోని సెక్షన్ 3సి(2) నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఒక ఆస్తిని ప్రభుత్వ భూమిగా ప్రకటించ




డానికి, రెవెన్యూ రికార్డులను మార్చడానికి అధికారికి ఇచ్చిన అధికారానికి సంబంధించిన సెక్షన్ 3సి(3)పైన కూడా స్టే విధించింది. అధికారి కనుగొన్న దాని ఆధారంగా దాని రికార్డులను సరిచేయమని రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును ఆదేశించాల్సిన సెక్షన్ 3సి(4)ను కూడా సుప్రీంకోర్టు నిలిపివేసింది. కలెక్టర్ హక్కులను నిర్ణయించడానికి అనుమతించడం, అధికారాల విభజనకు విరుద్ధం. కార్య నిర్వాహణాధికారి పౌరుల హక్కులను నిర్ణయించడానికి అనుమతించబడదు అంటూ సుప్రీంకోర్టు పేర్కొంది.వక్ఫ్ ట్రిబ్యునల్‌నసెక్షన్ 83 ప్రకారం ఆస్తిపై హక్కును, కోర్టుల్లో చివరి తీర్పు వచ్చే వరకూ లేదా హైకోర్టులో అప్పీల్‌కు లోబడి ఉండేవరకూ వక్ఫ్ స్వాధీనం లేదా దాని రికార్డులు ఏవీ ఇబ్బంది కలిగించవని ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో అటువంటి ఆస్తుల విషయంలో మూడవ పక్ష హక్కులను సృష్టించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లింయేతర భాగస్వామ్యంపై నిబంధనలను నిలిపివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. కానీ పరిమితులను విధించింది. ముస్లిం దాని వ్యక్తులకు వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఒ)గా అవకాశం ఇవ్వొచ్చంటూ చట్టంలో చేసిన సవరణపై 'స్టే' విధించలేమని ధర్మాసనం పేర్కొంది. సాధ్యమైనంత వరకూ ముస్లింలకే ఆ పదవిని కేటాయించాలని ప్రభుత్వానికి సూచించింది. చీఫ్‌ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల నియామకానికి సంబంధించిన సెక్షన్ 23పై ధర్మాసనం ఈ విధంగా వ్యాఖ్యానించింది. 'సాధ్యమైనంతవరకు బోర్డుకు చెందిన ఎక్స్ అఫీసియో కార్యదర్శి అయిన సిఇఒను ముస్లిం సమాజం నుంచి నియమించడానికి ప్రయత్నించాలి అని పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల నమోదును తప్పనిసరి చేసే నిబంధనలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇది ప్రస్తుత కొత్త అవసరం కాదనీ, 1995, 2013 నాటి మునుపటి చట్టాల ప్రకారం ఉందని పేర్కొంది. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ అంటే మసీదులు, పాఠశాలలు, ఆస్పత్రులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థలను నిర్మించడం వంటి ధార్మిక లేదా మతపరమైన ప్రయోజనాల కోసం ముస్లింలు చేసిన దానం అని అర్థం. ఎక్స్ అఫీసియో సభ్యులు మినహా ముస్లింలు మాత్రమే పనిచేయాలని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఈ తీర్పు ద్వారా రాజ్యాంగ వ్యవస్థలు ఏవైనా సరే అవి రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా నడుచుకోకపోతే సహించేది లేదని సుప్రీంకోర్టు విస్పష్టంగా తెలియచెప్పింది. జిల్లా కలెక్టర్లు సర్వాధికారులు కారనీ, వారు ఏది నిర్ణయిస్తే అది అంతిమం అవుతుందనే విషయాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కార్యనిర్వాహకవర్గం కూడా రాజ్యాంగ బద్ధమైంది కాబట్టి రాజ్యాంగ నియమాలన్నీ వర్తిస్తాయని సుప్రీంకోర్టు ఈతీర్పు ద్వారా స్పష్టపరిచింది. ఒక ఆస్తి భూమి కానీ మరేదైనా కావచ్చు. వక్ఫ్ ఆస్తి అని ముస్లింల వాదన ఒకవైపు, అది ప్రభుత్వ స్థలమనీ మరొకవైపు ఉన్నప్పుడు కలెక్టర్లకు నిర్ణయాధికారం ఇవ్వడానికి వీలులేదని సుప్రీంకోర్టు స్పష్టపరిచింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో ఇద్దరు మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అవుతుంది. ఆ మహిళలు కూడా ముస్లింలు అయి ఉండాలి. వక్ఫ్ బిల్లును పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ కూడా ఏర్పాటయింది. వక్ఫ్ చట్టంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉన్నందువలన వాటిపైన మాత్రమే సుప్రీంకోర్టు 'స్టే'విధించి, ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం చట్టాన్ని కొట్టివేయాలని పిటిషనర్లు కోరినా సుప్రీంకోర్టు నిరాకరించడం గమనార్హం. మత వ్యవహారాలలో ప్రభుత్వాలు ఇష్టానుసారం వ్యవహరించడానికి వీలు లేదని మాత్రం స్పష్టపరిచింది. అధికార విభజనల బదలాయింపు సూత్రాన్ని యధేచ్ఛగా ఉల్లంఘించడం కూడా కుదరదని తేల్చి చెప్పింది. ఈ తీర్పు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిది. ●

## వర్సిటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు23, ప్రభాతవార్త: వర్సిటీలోని సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025ను నిర్వహించారు. ఈ హ్యాకథాన్ ను ప్రారంభించిన ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు యువతకు తమ ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఉత్సాహపూర్తిమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. అలాగే ఆలోచనల సృష్టి, సృజనాత్మకత, వినూత్న ప్రక్రియను అర్థం చేసుకునే విలువైన అనుభవాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, సమన్వయకర్త డాక్టర్ యు.సూర్యకామేశ్వరి, ప్యానల్ సభ్యులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమ, ఇతర గెస్ట్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

## 27న ఏఎల్ బియిడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : ఏఎల్ బియిడీ కళాశాల స్థాపించి 75సంవత్సరాలు నిండిన సందర్భంగా సెప్టెంబర్ 27వ తేదిన కళాశాల ప్రాంగణంలోని ప్లాటినం జూబ్లి వేడుకలు నిర్వహించనున్నట్లు వేడుకల కమిటీ సభ్యులు,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు.సోమవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్తేరుసునీల మాట్లాడారు.ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిధిగా గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.కళాశాల్లో చదివిన పూర్వ విద్యార్థులందరూ దీన్ని ఆహ్వానంగా భావించి తప్పకుండా ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు.కళాశాల చరిత్ర గురించి ఆమె మాట్లాడుతూ 1950లో ఆంధ్రక్రైస్తవ కళాశాల్లో ఒక బ్రాంచీగా ఉందన్నారు.దాదాపు 15సంవత్సరాల పాటు అక్కడ కొనసాగిన తదుపరి 1965లో ఏఎల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌గా మారిందని,1970లో ఇప్పుడున్న మూడు అంతస్తుల ప్రత్యేక బిల్డింగ్ లోని కళాశా షిఫ్ట్ చేయడం జరిగిందన్నారు.1972-73లో ఎంఈడి కోర్సు కోఎడ్యుకేషన్ గా ప్రారంభించడం జరిగిందన్నారు.1977వరకు ఆంధ్ర యూనివర్సిటీ గుర్తింపులో ఉన్న బిఈడి కళాశాల,77నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుర్తింపు లోకి వచ్చిందన్నారు.1980లో నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ సెంటర్‌గా ఏఎల్‌బియిడి కళాశాలను గుర్తించిందన్నారు.1984లో బిఈడి కోర్సును కో ఎడ్యుకేషన్ గా తెచ్చారని ఈ విధంగా దినదినప్రవర్తమానం చెందుతూ ఏఎల్ బిఈడి కళాశాల 75వసంతాలు పూర్తి చేసుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందని ప్రతి పూర్వ విద్యార్థి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.



## సరళీకృత వస్తు సేవల పన్ను - మధ్యతరగతి ప్రజలకు,చిరు వ్యాపారులకు ఊరట

గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : జిల్లా బిజేపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జీఎస్టీ రేట్లు తగ్గించినందుకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బిజేపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ సరళీకృత వస్తు,సేవల పన్ను మధ్యతరగతి



ప్రజలకు,చిరు వ్యాపారులకు ఊరట కలిగించే అంశం మని,దేశ భవిష్యత్తుకి మార్గదర్శకం కానున్న గొప్ప చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు.కార్యక్రమంలో ఈదర శ్రీనివాసరెడ్డి,భీమినేని చంద్రశేఖర్,పాలపాటి రవికుమార్,వెలగలేటి గంగాధర ,టివి రావు,చరక కుమార్‌గౌడ్,వైవి సుబ్బారావు,జిల్లా ప్రధాన కార్యదర్శులు భజరంగ్ రామకృష్ణ,షేక్ సాంబశివరావు, కృష్ణచైతన్య,ఏసోబు,రండి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్ర మహోత్సవాల్లో విభిన్న అలంకారాలతో అమ్మవారు



గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త :స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పాలకమండలి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి కల్యాణమండపం వేదికగా అమ్మవారు మంగళగౌరీగా దర్శనమిచ్చారు.ఆలయ పాలకమండలి విశేషంగా భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో నిష్ఠల నరసింహమూర్తి,శ్రీకాకుళం వారిచే శ్రీదుర్గా స్తుతి ప్రవచనం జరిగింది.స్థానిక బ్రాడీపేటలోని శంకరమందిరంలో ఆలయపాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు గాయత్రీ మాతగా దర్శనమిచ్చారు.అలంకారాలలో ప్రతిరోజు జరుగుతున్నపూజల్లో భాగంగా మంగళవారం గాయత్రీ,చండీహోమాలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. అరండల్‌పేట శ్రీలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రధానార్చకులు మల్లిప్రగడ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీగాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.విశేషంగా పాల్గొన్న సువాసినులచే కుంకుమార్చనలు,సాయంత్రం దంపతులచే అమ్మవారి సహస్రనామ పూజలు నిర్వహించారు.విశేషహారతి మంత్రపుష్పం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారు గాయత్రీ మాతగా దర్శనమిచ్చారు.ఆలయ పూజారులు చంద్రశేఖర శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. స్థానిక సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో వ్యవస్థాపకులు మంటిపాల విజయస్వామి ఆధ్వర్యంలో విశేష కుంకుమార్చనలు,అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక విద్యానగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి మందిరంలో పాలకమండలి ఆధ్వర్యంలో పూర్ణప్రసాదరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు మంగళగౌరీ దేవిగా దర్శనమిచ్చారు.ప్రతిరోజు ఉదయం,సాయంత్రం సువాసినులచే కుంకుమార్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## సాయిభాస్కర్ లో రోబోటిక్ తొంటి మార్పిడి ఆపరేషన్లు

### --సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి



గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : కొత్త ఆవిష్కరణలకు ఎప్పుడూ ముందుండే సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత,సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మరో నూతన ఆవిష్కరణకు నాంది పలకనున్నారు.ప్రపంచ ప్రఖ్యాత రోబోటిక్ సంస్థ స్ట్రైకర్‌తో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.దీనిలో భాగంగా రోబోటిక్స్,అందుకు తగిన సాంకేతిక సహకారాన్ని సంస్థ అందించనున్నట్లు పేర్కొన్నారు.స్థానిక అరండల్‌పేటలోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేంద్ర రెడ్డి వివరాలను తెలియజేశారు.ఏపిలోనే మొట్టమొదటిసారిగా తొంటి మార్పిడి ఆపరేషన్లలో మాకో హిప్ అండ్ నీ రోబోటిక్‌ను ప్రవేశపెడుతున్నామన్నారు.డిల్లీలోని స్ట్రైకర్ ఇండియా హెడ్ క్వార్టర్స్‌లో సంస్థ వైస్ ప్రెసిడెంట్,జనరల్ మేనేజర్ అమన్ రిషితో కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకోవడం జరిగిందని తెలిపారు.అక్టోబర్ మొదటి వారం నుంచి సాయి భాస్కర్ హాస్పటల్లో రోబోటిక్ తొంటి మార్పిడి ఆపరేషన్లు అందుబాటులోకి రానున్నాయని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్ట్రైకర్ నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రశాంత్ మహేశ్వరి,రెండు తెలుగు రాష్ట్రాల మేనేజర్ పీటీ కృష్ణమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

## నందివెలుగు రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ కృషి

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : నగరాభివృద్ధికోసం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నిరంతరం కృషి చేస్తున్నారు.నగరంలోని నందివెలుగు రోడ్డులో బ్రిడ్జిపై కల్వర్టు నిర్మాణానికి మంగళవారం అసెంబ్లీలో రోడ్లు,భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు.గత



50ఏళ్లుగా ఈ బ్రిడ్జి పై కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు.కల్వర్టు నిర్మాణానికి రూ.2.5కోట్లు అవసరం అవుతాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నందివెలుగు బ్రిడ్జి నిర్మాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తిచేస్తున్నామని ఎమ్మెల్యే మంత్రి జనార్దనరెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు.ఎమ్మెల్యే నసీర్ వినతిమేరకు మంత్రి బిసి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.త్వరలోనే నిధుల మంజూరుకు పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గుంటూరు వార్త



## 25న సిఎం చంద్రబాబు పర్యటన

### -డిఎస్సీ నియామక పత్రాలు అందజేత కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 23: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 25 న వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తున్న కార్యక్రమంలో పాల్గొననున్న నేపధ్యంలో ఏర్పాట్లను మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ , విద్యాశాఖ కమిషనర్ విజయ రామ రాజు , జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా , జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ , ఐ ఎస్ డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ , సంయుక్త కలెక్టర్



అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. ప్రధాన వేదిక , పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఎల్.ఇ.డి స్క్రీన్స్ , బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కడా తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని , తాగునీరు , మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. పరిశీలనా కార్యక్రమంలో డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు , గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రమణమూర్తి , అడిషనల్ ఎస్పీ మల్లికార్జునరావు గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ ఏ.ఆర్. హనుమంతు , గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ , ఆర్ డి ఓ శ్రీనివాసరావు , ఎస్ డి పిఓ తుళ్ళూరు మురళీకృష్ణ , డీఎస్పీ సీఆర్డీఏ ఇంటిలిజెన్స్ సుధాకర్ బాబు శ్రీనివాసరావు గుంటూరు జిల్లా SB CI-1 , డి.ఈ ఆర్ అండ్ బి లక్ష్మీనారాయణ , SB CI3 శ్రీహరి గుంటూరు , మెడికల్ ఆఫీసర్ తుళ్లూరు శ్రీనివాసరావు , ఈ ఈ సీఆర్డీఏ శ్రీనివాసరావు , ఏపీ సిపిడిసి ఎల్ ఈ ఈ సంజీవరావు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: కలెక్టర్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 23: జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొద్దిపాటి అప్రమత్తతో ప్రభుత్వం జారీ చేస్తున్న ఆరోగ్య సూచనలు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలసి నగరపాలక సంస్థ పరిధిలో డయేరియా వ్యాధులు నమోదు అయిన ప్రాంతాలు ప్రగతి నగర్, వర్కర్స్ కాలనీ, రామిరెడ్డి తోట, సీతానగర్, నెహ్రునగర్ లో త్రాగునీరు సరఫరా, పారిశుద్ధం, వైద్యసేవలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు నమోదు అవుతున్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ, వాటర్ టెస్టింగ్ తదితర అంశాలను నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, వైద్య చికిత్సలు, డోర్ టూ డోర్ సర్వే, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను జిల్లా వైధ్యారోగ్యశాఖ అధికారిణి డా. విజయలక్ష్మీ జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారీయా కు వివరించారు. ప్రగతి నగర్



లో జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా ఇంటింటికి వెళ్ళి తాగునీటి సరఫరా, కుటుంబ సభ్యుల ఆరోగ్యం పై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ప్రస్తుత వర్షకాలం నేపథ్యంలో మున్సిపల్ శాఖ సరఫరా చేస్తున్న త్రాగునీటిని, ఆర్వో ప్లాంట్ నీటిని సైతం పది నుంచి పదిహేను నిమిషాలు మరగకాచి చల్లార్చి త్రాగాలని తెలిపారు. మరుగుదొడ్డికి వెళ్ళి వచ్చిన తరువాత, ఆహారం తీసుకునే ముందు చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బయట ఆహారం తినకుండా ఇంటిలోనే తాజాగా ఆహారం సిద్ధం చేసుకొని తినాలన్నారు. కొద్దిపాటి అనారోగ్య లక్షణాలు ఉన్న వెంటనే సమీపంలోని ప్రాధమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రగతి నగర్ లో రహదారులపై నిలిచిన నీటిని తొలగించాలని, మంచినీటి కుళాయిల పైపులైన్లు డ్రైనేజీ కాల్వలో నుంచి వెళ్లకుండా పక్కకు మార్చాలని, డయేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో సాధరణ పరిస్థితులు వచ్చే వరకు త్రాగునీరు, ఇతర అవసరాలకు ట్యాంకర్లు ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇళ్ళలోను, కుళాయిలు వద్ద, వ్యక్తిగత ఆర్వో ప్లాంట్ లు, బోర్ల వద్ద వాటర్ శాంపిల్స్ తీసి నిరంతరం పరీక్షించాలన్నారు. ఎఎన్ఎం, అశాల సర్వేలెన్స్ టీంలు ఇంటింటికి వెళ్ళి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి క్లోరిన్ మాత్రలు పంపిణీ చేసి వాటిని నీటిలో కలుపుకునే విధానంను వివరించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, మంచినీటిని వేడిచేసి త్రాగాలని ప్రజలకు అర్ధమయ్యేలా వివరించాలన్నారు. అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని వెంటనే చికిత్స కోసం వైద్య శిబిరాలకు తరలించాలన్నారు. ప్రగతి నగర్ లోని ఉన్న ఇళ్ళను సాయంత్రం నాటికి సర్వే చేసేలా అవసరం మేరకు సర్వేలెన్స్ టీంలను తక్షణమే నియమించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి ఆదేశించారు. డయేరియా తో జీజీహెచ్ లో చికిత్స పొంది డిస్చార్జ్ అయిన సుద్దపల్లి డొంక వర్కర్స్ కాలని లోని వెంకయమ్మను, కాకాని రోడ్డులోని సీతానగర్ లోని షేక్ కరీమున్నీసా ఇంటికి జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

వైద్యులు ఇచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలని, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. రామిరెడ్డితోట మూడవ లైనులోని మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంను జిల్లా కలెక్టర్ పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వైద్యశిబిరంలో రోగుల వివరాలు నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చే రోగుల వివరాలు, ఫోన్ నెంబర్లు రిజిస్టర్ లో పూర్తిగా నమోదు చేయాలన్నారు. కొద్దిపాటి అనారోగ్య లక్షణాలు ఉన్న వెంటనే వారిని వైద్యశిబిరం కు తీసుకొని రావాలన్నారు. రామిరెడ్డి తోట ప్రధాన రహదారిలో మెబైల్ వ్యాన్ లోని పరీక్ష కేంద్రంలో వాటర్ టెస్టింగ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నెహ్రునగర్ లోని రిజర్వాయర్లలో త్రాగునీటిలో క్లోరిన్ శాతం పరీక్షలను పరిశీలించారు. ప్రజలకు సరఫరా చేసే త్రాగునీటిలో క్లోరిన్ శాతాన్ని రిజర్వాయర్లలో అవుట్ లెట్ వద్ద, టెయిల్ ఎండ్ పాయింట్ వద్ద నిరంతరం పరీక్షలు నిర్వహించాలన్నారు. రిజర్వాయర్లను పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. కేసులు నమోదైన ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న నీటి సోర్స్ పాయింట్ వివరాలను కమ్యూనిటీ డీసీజ్ నిపుణులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల డయేరియా కేసులు నమోదు అయిన ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్, స్థానిక శాసనసభ్యులు, జిల్లా అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో త్రాగునీరు, పారిశుద్ధం, వైద్యసేవలను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జీజీహెచ్ లో 92 మంది డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్నారని, వీరందరి ఆరోగ్యం స్థిరంగా ఉందని, వీరికి వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. డయేరియా కేసులు నమోదు అవటానికి గల కారణాలు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు, వైద్యనిపుణుల విశ్లేషిస్తున్నాయన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ డి శ్రీనివాసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి విజయలక్ష్మీ, ఇన్ చార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఇన్చార్జి సీఎంహెచ్ డా. శోభారాణి, స్పెషల్ అఫీసర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి మురళి, కమ్యూనిటీ డీసీజ్ వైద్యనిపుణులు డా.శివ గోపాల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఎస్ ఈ దాసరి శ్రీనివాసరావు, స్పెషల్ అఫీసర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి మురళి, వైద్యారోగ్యశాఖ, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సురక్షితమైన నీరందించండి

### --ప్రగతినగర్,రామిరెడ్డితోటలో కలెక్టర్,కమీషనర్ లతో కలసి పర్యటించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : భారీ వర్షాల నేపధ్యంలో ప్రబలుతున్న వ్యాధుల దృష్ట్యా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలని అధికారులకు తూర్పు ఎమ్మెల్యే నసీర్



సూచించారు.నగరంలోని ప్రగతినగర్,రామిరెడ్డితోటలో డయేరియా ఇతర వ్యాధుల ప్రభావం ఉండడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా,జిఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు.ఈ సందర్భంగా ప్రత ఇంటికి వెళ్ళి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని,బయట ఆహార పదార్థాల జోలికి వెళ్ళకూడదని సూచించారు.కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా,కలరా కేసులు నమోదవుతున్నాయని బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.పానీపూరీలు,బిర్యానీలు తినవద్దని సూచించారు.ప్రస్తుతం నగరంలో పానీపూరి విక్రయాలు నిషేధం విధించామని స్పష్టంచేశారు.కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## మానవాళికి గొప్పవరం ఆయుర్వేదం

గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : ఆయుర్వేద పితామహుడు దన్వంతరీ జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకోవడం మనం మన మూలాలను స్మరించుకోవడమేని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు.జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని భాష్యం మెడెక్స్,మెడి ఎయిమ్స్ క్యాంపస్‌లలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరికి భాష్యం రామకృష్ణ నివాళులర్పించారు.వైద్య విద్యార్థులు వైద్యవృత్తిని వ్యాపార దోరణిలో కాకుండా మానవత్వ విలువలను పెంపొందించేలా నిర్వహించాలని సూచించారు.తొలుత దన్వంతరి విగ్రహానికి రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు,అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాల రంగానికి మహర్దశ

గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : పెట్రోల్ ఎలక్ట్రికల్ వాహనాల్లో విస్తృత ఎంపిక అవకాశాలను అందించడం ద్వారా భారతదేశం ద్విచక్ర వాహనాల కోసం షాపింగ్ చేసే విధానాన్ని మార్చడానికి సిద్ధంగా ఉందని ఫ్లిప్‌కార్ట్ ఎలక్ట్రానిక్స్ విభాగ ప్రతినిధి సుజీత్ అగాపే తెలిపారు.జీఎస్టీ తగ్గింపుతో ద్విచక్ర వాహన రంగానికి మహర్దశ పట్టిందన్నారు.సెప్టెంబర్ 22నుంచి అమల్లోకి వచ్చిన జిఎస్టీ రేటు సవరణలో భాగంగా 350సిసి కంటే తక్కువ ఉన్న ద్విచక్ర వాహనాలపై పన్నును 28శాతం నుండి 18శాతం కి తగ్గించడంతో,కస్టమర్లు ఇప్పుడు తమ కొనుగోళ్ళపై విలువను పెంచుకునే అవకాశం ఉందన్నారు.

## సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాలను మరింతగా మెరుగుపరచాలి

గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : షెడ్యూల్ కులాల విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు వసతిని కల్పించడమే లక్ష్య ంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మరింతగా మౌలిక వసతులు సమకూర్చాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తవగా ఉన్న చాలా వసతి గృహాల్లో సరైన వసతులు లోపించాయని,సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల వసతి గృహాల్లో సైతం తీవ్రమైన వసతి లేములు కనిపిస్తునాన్నయని,విద్యార్థుల తల్లిదండ్రులు సైతం గగ్గోలు పెడుతున్నారని ప్రభుత్వం చొరవచూపి పూర్తిస్థాయిలో మెరుగుపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రతి రైతూ పంట నమోదు చేయించు కోవాలి



కాకుమాను, సెప్టెంబర్ 23(ప్రభాతవార్త): ప్రతి రైతూ పంట నమోదు చేయించు కోవాలనీ మండల వ్యవసాయ అధికారి వి.సుధాకర్ అన్నారు.మండల పరిధి వల్లూరు, చిన్నలింగాయ పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహ్నిచినట్లు ఏవో మంగళవారం తెలిపారు.ఈ కార్యక్రమం లో భాగంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రదాన పంట వేసిన ప్రతి రైతూ కూడా పంట నమోదు చేయించు కోవాలి అని తెలియచేశారు. పంట నమోదు చేయించుకోవటానికి ఈ నెల 30 925 చివరి తేదీ ,కనుక ప్రధాన పంట వేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వి వి ఎ లు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గాయత్రీ దేవి అలంకరణ




పెదనందిపాడు సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) పెదనందిపాడు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళ వారం అర్చక స్వాములు పట్ట స్వామి పట్టాభి రామారావు. నాదెళ్ళ వెంకటరమణమూర్తి అమ్మవారికి గాయత్రీ దేవి అలంకరణ కన్నుల పండుగగా నిర్వహించారు. విగ్రహ దాతలు అద్దెపల్లి శ్రీనివాసరావు రాజ్యలక్ష్మి లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమేశ్వరునికి అభిషేకం. అమ్మవారికి లలితా సహస్రనామం కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో. నున్న సురేఖ. నా గండ్ల మణిమాల . గోరంట్ల ప్రతిమ. అరవపల్లి ఉదయలక్ష్మి .దాసరి కుసుమాంబ. వసుంధర దేవి. వనజ. పార్వతి. శ్రీదేవి. కొత్త శ్రీధర్. సకల వీరేంద్ర గుప్తా. శేఖరు తదితరులు పాల్గొన్నారు.

## మాజిక్ డ్రైన్ పర్యావరణ హితం: షణ్ముఖ్ కుమార్

ప్రత్తిపాడు సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): మాజిక్ డ్రైన్ పర్యావరణ హితం అని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వై.వి.కె. షణ్ముఖ్ కుమార్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వము వినూత్నంగా, ప్రయోగాత్మకంగా చేపట్టిన మాజిక్ డ్రైన్ నిర్మాణము గురించి గుంటూరు,బాపట్ల,పల్నాడు, యన్.టి.ఆర్,కృష్ణా,ప్రకాశం జిల్లాలకు చెందిన 75 మంది ఉపాధి హామీ పథకము సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ప్రత్తిపాడు మండలము తిక్కిరెడ్డిపాలెం గ్రామ శివారు బొర్రావారిపాలెంలో మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం డైరెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ డ్రైన్ నిర్మాణము వలన కలిగే ప్రయోజనాలు,నిర్మాణము చేసేటప్పుడు తీసుకోవలసిన నాణ్యతా ప్రమాణాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ వ్యవస్థలో వ్యర్థ నీరు సాధారణ డ్రైన్ లలో బయటకు వెళ్ళకుండా, ఫిల్టర్ మీడియా ఉన్న ట్రెంచ్ (కందకం) ద్వారా నీరు నేరుగా భూమిలోకి ఇంకిపోతుందన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాలకు అనువైన, పర్యావరణ హితమైన వ్యవస్థ అని,దీని ద్వారా గ్రామాలలో స్వచ్ఛత,ఆరోగ్యం,భూగర్భజల స్థాయిలను పెంచటంలో ఉపయోగ పడుతుందన్నారు.మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణపు అంచనా విలువ ఒక్కొక్క దానికి లక్ష రూపాయలకు మించకుండా ఉండేలా చూడాలన్నారు.మంచినీటి పైప్ లైన్ ఉన్న రోడ్ల నిర్మాణం చేసేటప్పుడు,తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం అడిషనల్ కమీషనర్ శివప్రసాద్,జాయింట్ కమీషనర్ సునీత,చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, డ్వామా పి.డి.శంకర్,ఏ.పి.డి. శ్యాలాదేవి,యం.పి.డి.ఒ శివపార్వతి,సర్పంచ్ మాకినేని జగన్మోహనరావు, గుంటూరు, బాపట్ల,పల్నాడు,యన్.టి.ఆర్, కృష్ణా,ప్రకాశంఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



## అన్నవరంలో స్వస్థ నారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం



పెదనందిపాడు సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త)పెదనందిపాడు మండల ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నవరంలో మంగళవారం. మండల ఆరోగ్య కేంద్రం బృందం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డాక్టర్ బి ప్రియావద. ఆయా గ్రామ ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ ఎస్ ఆర్ ప్రసాద స్వామి. ఈ చెన్నయ్య. జి.శ్రీనివాస రావు,ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌బి. సుబ్బారావు. వైద్య మిత్ర మరియు ఏఎన్ఎంలు. ఆశా కార్యకర్తలు. అంగన్వాడి సిబ్బంది పాల్గొని సేవలందించారు.



## సజావుగా బి.ఫార్మశీ పరీక్షలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు23, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో బి.ఫార్మశీ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య యం.సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన పరీక్షల కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లు, బుక్‌లెట్స్ పరిశీలించారు. విద్యర్థులకు కల్పించిన సదుపాయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల తీరును నిరంతరం పరిశీలిస్తామని పేర్కొన్నారు.

## బి.టెక్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో బి.టెక్ కోర్సుకు జూలైలో జరిగిన 3/4 రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. రెగ్యులర్‌లో 827మందికి 747మంది, హానర్స్‌లో 207కు 207, మైనర్స్‌లో 5కు 5మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీవాల్యుయేషన్‌కు అక్టోబరు 6వ తేదీలోగా ఒక్కోపేపర్‌కు రూ.2070 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

**పీజీ అడ్మిషన్ల వివరాలు:** ఏపి ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఏపి పిజిసెట్ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌లో తొలి విడతలో 11401మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చారని అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఆర్‌విఎస్ఎస్ఎన్ రవికుమార్ తెలిపారు. వారిలో 9892మందికి సీట్లు కేటాయించామన్నారు. మిగిలిన సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీచేస్తామని పేర్కొన్నారు.

## సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు23, ప్రభాతవార్త: వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏపిఎస్ఎస్‌డిసి, ఐబియం స్కిల్ బిల్డ్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇంజనీరింగ్, ఎంయస్సీ, ఎంసిఏ విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హైద్రాబాద్‌లోని ఐబియం మాస్టర్ ట్రైనర్ ఇ. నరేంద్ర పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఐ టూల్స్,జనరేటివ్ ఏఐ, రెడ్ పాండ్‌ఏఐ, ఏజెంటిక్ ఏఐ, గూగుల్‌టూల్స్‌తో పాటు ఐబియం పోర్టల్‌లో ఉన్న 18 ఉచిత కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ యం.డి తౌసిఫ్ అహ్మద్, ఏపిఎస్ఎస్‌డిసి యుఎస్‌డిఓ యండి రఫి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ యం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, పలు విభాగాల సమన్వయకర్తలు కె.చైతన్య, యు.సతీస్‌కుమార్, డాక్టర్ లావణ్య, సూర్యకామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలో కబడ్డీ పోటీలు ప్రారంభం




ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు23, ప్రభాతవార్త: వర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో అంతర కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు 2025-26 మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఇన్‌చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ ఈ పోటీలను వేదికగా చేసుకుని క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఆ నైపుణ్యాలు క్రీడాకారుల సామర్థ్యాన్ని తెలుపుతాయన్నారు. ఒక మనిషికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా మనిషి వికాసం పెరుగుదలను, శారీరక దృఢత్వంకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్.పాల్‌కుమార్, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి.శ్రీనివాస్, పి.గణేష్,లు పాల్గొన్నారు .ఈ పోటీల నిర్వహక కార్యదర్శి కె.ప్రసన్న కుమార్ పోటీల వివరాలను వెల్లడిస్తూ వర్సిటీ పరిధిలో 21 కళాశాలల జట్లు ఈ పోటీలకు వచ్చాయన్నారు. నాక్-అవుట్-కం-లీగ్ విధానంలో పోటీలు జరుగుతాయని వివరించారు.

## మనువాద పాలకులకు రాజకీయ ప్రత్యామ్నాయమే జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి



గుంటూరు విద్య,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : మనువాద పాలకులకు రాజకీయ ప్రత్యామ్నాయం జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి అని ఫ్రంట్ చైర్మన్,దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీటైన రాజకీయ ప్రత్యామ్నాయం ఆవిర్భవించిందని ఎన్‌డిఎస్ఎఫ్ 5వ వార్షికోత్సవ మహాసభకు పోస్టర్ ఆవిష్కరించారు.ఈనెల 26న హైదరాబాదులో జరుగుతున్నందున ఎన్డీఎస్ఎఫ్ మహాసభను విజయవంతం చేయాలని ఎస్సీ ,ఎస్టీ,బిసి,మైనార్టీ సామాజిక వర్గాలు పిలుపునిచ్చారు.టిడిపి,బిజెపి,జనసేన రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం 17మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.అంజనేయకుమార్ నగర నాయకులు కొండలరావు,పార్టీ విశాఖ లీడర్ చైర్మన్ రాయపాటి సామ్యూల్ జాన్సన్,జాతీయ వడ్డెర ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షులు ఉప్పు రాంబాబు,ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు తానేటి లింగ రహీం కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం



గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు అమ్మవారి దివ్య అలంకారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం.ఉదయం బాలపూజ సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమ పూజలు నిర్వహించడం జరిగింది.కార్యక్రమాలను ఆశీర్వదించుటకు పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవర శివానంద భారతీస్వామి శ్రీశృంగేరి విరూపాక్ష శ్రీ పీఠ ఉత్తరాధికారి వారి పవిత్ర కార్యక్రమాలచే జ్యోతిప్రకాశం చేసి కార్యక్రమాలు నిర్వహించారు.సాయంకాలం 6.30గంటకు వేద స్వస్తి నిర్వహించడం జరిగింది.తదనంతరం అమ్మవారికి సహస్రనామార్చన హారతులు మహా మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగాయి.కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.


## జీఎస్టీ తగ్గింపు పాలసీదారులకు ఊరట



గుంటూరు విద్య ,సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : స్థానిక అమరావతిరోడ్డులోని ఎల్ఐసి కార్యాలయంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపు ఉత్సవం జరిగింది.ఈ సందర్భంగా ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు/ పి.సుబ్బారావు మాట్లాడుతూ ఎల్ఐసి సేవా దృక్పథం,వ్యాపార దక్షత,పొదుపు,విలువలు,విశ్వసనీయతతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ప్రధాని మోడీ జీఎస్టీ రద్దుచేయడం వలన ప్రజలకు చేసిన మేలులను వివరించారు.బ్రాంచ్ మేనేజర్ జెఎస్ఎస్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీలపై జీఎస్టీ అంశాలను వివరించారు.అసోసియేషన్ సెక్రటరీ జగదీష్,జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.డివిజన్ వైస్ ప్రెసిడెంట్ భావనారాయణ , వ్యవస్థాపక కార్యదర్శి నాగేశ్వరరావు,జయప్రకాష్, ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులుఎల్ఐసి పాలసీలపై జీఎస్టీ తగ్గింపుకోసం డిమాండ్ చేసి ఎన్నో సంవత్సరాల నుండి డిమాండ్ చేస్తూ వచ్చారు.వివరకు దేశప్రధాని మోడీ ఏజెంట్స్ కోరికలు మన్నించి జీఎస్టీ పన్ను ఇవ్వడం అందరికీ ఆనందాన్ని కలిగించింది.

## సోయాబీన్ పైరు పరిశీలన

పెదనందిపాడు సెప్టెంబర్ 23 (ప్రభాత వార్త)పెదనందిపాడు మండలంలోని రాజుపాలెం వరగాని గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. రైతులందరూ కూడా ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కచ్చితంగా ఈ పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఉప్పులపాడు జీజీసీఎంఎస్ కు 26 టన్నులు డీఏపీ వచ్చి ఉన్నదని అవసరం రైతులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పెదనందిపాడు జీ సి ఎం ఎస్ కు 25 టన్నులు 2020013 అందుబాటులో వుంది. ఎమ్మార్పీ ధర1350/ కి ఇస్తున్నట్లు తెలియజేశారు.



తరువాత క్లస్టర్ డెమో సోయాబీన్ ప్రదక్షి ణ క్షేత్రాన్ని సందర్శించారు. ఎకరం పొలం లో 8 నుంచి 10 వరకు లింగాకర్షక బుట్టలు పెట్టుకొని వాటి యొక్క ఉధృతిని తెలుసుకోవాలని సూచించారు.ఉధృతను బట్టి మొదటి సారిగా ప్రొఫెనోపాస్400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతుల అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను ఎం ఏ ఓ సుబ్రహ్మణ్యం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## మోదీ, నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం

మంగళగిరి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త: జీఎస్టీ రేట్లు తగ్గించి ప్రజలందరికీ ఆర్థికంగా ఎంతో లాభదాయకం చేసి దసరా దీపావళి పండుగ సంతోషం కలిగించిన ప్రధాన మంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటానికి స్థానిక భాజపా నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి స్వీట్స్ పంచి, బాణాసంచా కాల్చడం ద్వారా తమ



సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ ప్రజలందరికీ ఆర్థిక భారం తగ్గించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్మల సీతారామన్ ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తూ ఆనంద ఉత్సాహాలతో పండుగ జరుపుకుంటున్నారని అన్నారు . మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ కెసి రెడ్డి, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుళ్ళిమిల్లి రామకృష్ణ, తాడేపల్లి సేవా పక్వాడ ఇంచార్జ్ మునగపాటి వెంకటేశ్వరావు, మంగళగిరి పట్టణ సేవా పక్వాడ ఇంచార్జ్ కొంగర జోగేంద్ర ప్రసాద్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవెలకారు రాకేష్ జి, మంగళగిరి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం సభ్యులు అందే శివశంకర్ రావు, మంగళగిరి సేవా పక్వాడ కన్వీనర్ దామర్ల దుర్గారావు, దుగ్గిరాల పట్టణ అధ్యక్షులు అడపా వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రు భాను కిషోర్, బీజేవైఎం మంగళగిరి కన్వీనర్ జంజనం కార్తీక్, తాడేపల్లి రూరల్ కన్వీనర్ మేకల లక్ష్మణ్ జి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క నరసింహారావు, గీత కార్మిక సెల్ కన్వీనర్ పడమటి రాధాకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు తుమ్మ శ్యామ్. పట్టణ ప్రధాన కార్యదర్శి కమల కృష్ణ, రూరల్ జిఎస్ కటకం వెంకటేశ్వరరావు ఓబిసి జిల్లా కార్యదర్శి బుద్ధంటి రవికిరణ్, సీనియర్ నాయకులు శంకరనారాయణ, పట్టణ కార్యదర్శి కొల్లి బాబురావు, పోలిశెట్టి సోమశేఖర్, పట్టణ కోశాధికారి సంగేపు రామ మల్లేశ్వర రావు, నక్క శంకర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణం వైపు అడుగులు వేయాలి



తాడేపల్లి,సెప్టెంబర్ 23,ప్రభాతవార్త : ప్రపంచానికి పెనుసవాలుగా మారిన ప్లాస్టిక్‌ని పూర్తిగా నివారించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిర్ రహిత గ్రామ నిర్మాణంవైపు అడుగులు వేయాలని కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ సూచించారు.మండల పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వమించినట్లు ఆయన పేర్కొన్నారు.వర్సిటీ ఎన్ఎస్ఎస్,సీఎస్సీ-2 విభాగం ఆధ్వర్యంలో వాలంటీర్లు,విద్యార్థిని,విద్యార్థులు,గ్రామ పంచాయితీ సిబ్బంది ప్లాస్టిక్ వలన కలిగే హానికారక ప్రభావాల గురించి తెలిపే ప్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు.అనంతరం కమ్యూనిటీ హాలు కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ నాగమణి తెలిపారు.ప్లాస్టిక్ వాడకం వల్ల శ్వాసకోశ సమస్యలు,హార్మోన్ల లోపాలు వస్తున్నాయని సీఎస్సీ-2 విభాగాధిపతి డాక్టర్ బి.తిరుపతి రెడ్డి సూచించారు.కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రోవిసీలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,స్టూడెంట్ అఫైయిర్స్ డీన్ డాక్టర్ హబీబుల్లాఖాన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి,పంచాయితీ సిబ్బంది తదితరులు అభినందించారు.

## కనువిందు చేస్తున్న పుణ్యతిథి ఉత్సవాలు



పొన్నూరు, సెప్టెంబరు 23,ప్రభాతవార్త: శ్రీ సాయి....శ్రీ సాయి...జయ జయ సాయి....ఓం శ్రీ సాయిరాం....గురుదేవదత్తా.....అనే భక్తుల నినాదాలతో పట్టణంలోని సాయినగర్ మార్మోగిపోతోంది. శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శ్రీ షిరిడి సాయిబాబా 107వ పుణ్యతిథి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఉదయాన్నే బాబావారికి విశేషాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ గీతామృతము కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయిసేవా మండలి సభ్యులు పాల్గొన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ఉభయదాతల పేర్లమీద గోత్రానామార్చన జరిగింది. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సత్రాజు మధుసూధనరావు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## రసవత్తరంగా సాగుతున్న చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు




పొన్నూరు, సెప్టెంబరు 23,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్-2025పోటీలు అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. రెండో రౌండ్ ముగిసే సరికి 68మంది క్రీడాకారులు చెరో రెండు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు.ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీకి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆతిథ్యమిస్తోంది. కొన్ని చిన్న సంచలనాలు మినహా, ఎక్కువ మంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌కి సులభంగా అడుగుపెట్టారు. మాజీ జాతీయ ఛాంపియన్ జీఎం సూర్యశేఖర్ గంగూలి(పిఎస్‌పిబి)టాప్ బోర్డులపై తొలి విజయాన్ని నమోదు చేశారు గియూకో పియానో ఆరంభంలో, 19వ మూవ్‌లో యషద్ బంబేశ్వర్(చత్తీస్‌గడ్) చేసిన తప్పిదాన్ని గంగూలి సద్వినియోగం చేసుకున్నారు. వరుసగా బిషప్, నైట్ త్యాగాలు చేసి పూర్తిగా ఆధిపత్యం సాధించిన గంగూలి 30వ మూవ్‌లో ప్రత్యర్థిని రాజీనామా చేయించారు. జీఎం అబితీత్ గుప్తా(పిఎస్‌పిబి) కూడా మాజీ ఆంధ్ర మహిళా చాంపియన్ డబ్ల్యూఎఫ్ఎం ల్యాస్యజిపై విజయం సాధించారు. క్లాసికల్ సిసిలియన్‌లో లాస్య క్వీన్‌సైడ్ క్యాసిల్ ఎంచుకోవడంతో,గుప్తా పదునైన పాన్ దాడి ప్రారంభించి చివరికి మెటీరియల్ ఆధిక్యాన్ని విజయంగా మలిచారు. టాప్ సీడ్ జీఎం ఇనియన్ పి(తమిళనాడు) పెవెనింగన్ సిసిలియన్‌లో ఆడిన అధిరాజ్ మిత్రా(జార్ఖండ్)ను ఓడించారు. 33వ మూవ్‌లో తప్పుగా బిషప్ మార్పిడి చేయడంతో పాన్ ఎండింగ్‌కి వెళ్ళి ఇనియన్ అదనపు పాన్‌తో గెలుపొందారు.వెటరన్ జీఎం కృష్ణన్ సశికిరణ్ 2700రేటింగ్ దాటిన భారత రెండవ ఆటగాడు హృషీకేశ్ బానిక్(పశ్చిమబెంగాల్)ను 64మూవ్‌ల పోరులో ఓడించారు. పొజిషనల్ ఆధిక్యాన్ని ఎండ్‌గేమ్‌లో ఖచ్చితంగా విజయంగా మార్చారు. మాజీ జాతీయ విజేత జీఎం ఎస్‌పి సేతురామన్(పిఎస్‌పిబి) గురప్రకాష్(మహారాష్ట్ర)పై విజయాన్ని నమోదు చేశారు. అదేవిధంగా మూడో రౌండ్‌లో టాప్ బోర్డులపై మరింత రసవత్తర పోటీలు జరునున్నట్లు తెలుస్తుంది.62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్-2025 దేశంలో అత్యున్నత వ్యక్తిగత చెస్ టోర్నమెంట్ రూ.30లక్షల ప్రైజ్‌మనీతో జరుగుతున్న ఈ పోటీ, రాబోయే అంతర్జాతీయ పోటీలకు ఎంపికకు ప్రధాన వేదికగా నిలుస్తోంది. విజ్ఞాన్ యూనివర్సిటీ ఆటగాళ్ళకు అద్భుత సౌకర్యాలు కల్పిస్తోంది. టాప్ 70బోర్డుల ఆటలు లైవ్‌లో ప్రసారం అవుతున్నాయి. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా చెస్ అభిమానులు ఆటను ఆస్వాదిస్తున్నారు.

## ఘనంగా సేవా పక్వాడ కార్యక్రమం



పొన్నూరు, సెప్టెంబరు 23,ప్రభాతవార్త: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా పక్వాడ కార్యక్రమం అత్యంత ఘనంగా సాగుతుందని బిజెపి జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో వద్రాణం ఉదయ్ చంద్రరావు నేతృత్వంలో గ్రామంలో పలు ప్రదేశాలలో మొక్కలు నాటారు. గురుబాలు, గుడివాడ పవన్, ఆకాష్, గణేష్, సిహెచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకు ముడత పురుగు నిరోధానికి రైతులు శ్రద్ధ పెట్టాలి



పొన్నూరు, సెప్టెంబరు 23,ప్రభాతవార్త: ప్రస్తుతం వరిపైరులో ఆకు ముడత పురుగు ఉధృతంగా కనిపిస్తుందని, దాని నిరోధానికి రైతులు శ్రద్ధ పెట్టాలని ఎడిఏ రామకోటేశ్వరి కోరారు. మండల పరిధిలోని కట్టెంపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ఈ పురుగు ఉధృతికి కారణం రైతులు అతి ఖరీదైన మందులు వాడడమేనన్నారు.ఈ విధంగా మందులు వాడడం వల్ల రైతులకు వ్యవసాయంలో ఖర్చులు పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూమి యొక్క స్వభావాన్ని బట్టి పంటలు పండించాలన్నారు. అదేవిధంగా మందులు కూడా వాడాలన్నారు. ఎలుక మందు పంపిణీ వచ్చే నెల 7వ తేదీన చేపడతామన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, డివైఎస్ఓ కె.సుందరరామిరెడ్డి, ఎండి షబ్బీర్, వ్యవసాయ సహాయకులు వి.వాసవి, సిహెచ్ రూప, ఎంపీఈవో ఎస్ సురేష్‌బాబు తదితరులున్నారు.

## సెయింటాన్స్‌లో ఘనంగా ఫిజికల్ సైన్స్ టీచర్ పదవీ విరమణ



మాచర్ల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త: స్థానిక సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో 39 ఏళ్లుగా ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేసిన మల్లిపెద్ది అరుణ పదవీ విరమణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ వేలమంది విద్యార్థులకు బాసటగా, విద్యాప్రదాయినిగా, విజ్ఞాన శాస్త్రంలో అనేక మార్పులకు కృషి చేసి, సాంఘిక సేవా కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయిని చరిత్రలో నిలిచిపోతారన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండి విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాశాఖ అధికారులు దేవనబోయిన జ్యోతి అల్లిసురేష్ కోరారు. హెచ్‌ఎం సిస్టర్ థామస్ అరుణ సేవలను కొనియాడారు. కార్యక్రమానికి మాచర్ల మున్సిపల్ కమిషనర్, రొటేరియన్ ధూళిపాళ్ల వేణుబాబు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అనేక హోదాలు కలిగిన సిస్టర్స్, రోటరీ క్లబ్ సభ్యులు, జాగృతి మహిళా మండలి సభ్యులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యను అభ్యసించిన విద్యార్థులు, వారి పిల్లలతో, పాఠశాల ఆనందోత్సవాలతో సంబరాన్ని తలపించింది. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, రోటరీక్లబ్, జాగృతి మహిళా మండలి, కుటుంబ సభ్యులు, విద్యార్థులు మల్లిపెద్ది అరుణను ఘనంగా సత్కరించారు.

## ఇంటర్న్‌షిప్‌కు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులు



మాచర్ల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త: విద్యార్థినులకు నిజ జీవితంలో ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుందని మాచర్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.ఉషారాణి అన్నారు. పదో తరగతి విద్యార్థినులకు వృత్తి విద్య పాఠ్యాంశంలో భాగంగా పీఎంశ్రీ కింద సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ శిక్షణను ఏర్పాటు చేశారు. పట్టణంలోని నవ్యశ్రీ బ్యూటీ పార్లర్‌లో ఇంటర్న్‌షిప్‌కు హాజరయ్యారు. వీరు అక్టోబరు 1 వరకు ఆచరణాత్మక శిక్షణలో ఉంటారన్నారు. వృత్తివిద్య ఉపాధ్యాయురాలు ఎం.రమ్యవాణి, బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు బి.నవ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మాచర్లలో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...



మాచర్ల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మాచర్లలో మహిళా భక్తుల పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మాచర్లలోని కోదండరామాలయం, పాతూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో, వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. మహిళలు బతుకమ్మలను చేతబూని మేళతాళాలు, కనకతప్పట్లతో దేవాలయాలకు చేరుకున్నారు. దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంపటీచెట్టు చుట్టూ మహిళలు బతుకమ్మలను ఉంచి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తూ పాడిన పాటలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ దేవాలయాల్లో లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు.

## ప్రచారం ఘనం.. అమలు తీరు శూన్యం!

గురజాల, సెప్టెంబరు 23 ప్రభాతవార్తః గురజాల అసెంబ్లీ, రెవెన్యూ డివిజన్, ఎస్‌డీపీవో, ఎక్సైజ్ సర్కిల్ కేంద్రాలతోపాటు నగర పంచాయతీగా కొనసాగుతోంది. ఇక్కడ అందరూ అధికారులే.. అయితే అధికారుల ప్రచారం అమలు తీరు కనబడుటలేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల నో హెల్మెట్.. నో






ఎంట్రీ.. డ్రగ్స్ వద్దు బ్రో వంటి కార్యక్రమాలను చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి.. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలి, మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. అయినా లైసెన్సులు లేకుండా ద్విచక్ర వాహనాలు పరిగెడుతున్నాయి. మైనర్లు వాహనాలు నడుపుతున్నారు. స్థానిక దూబచెరువు ప్రాంతం గంజాయి కేంద్రంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ, సౌండ్ పొల్యూషన్ నియంత్రణ కరువైందని ప్రజలు వాపోతున్నారు. రేషన్ బియ్యం తరలింపు, నిషేదిత గుట్కా, పేకాట, లాటరీ టిక్కెట్ విక్రయాలను విస్మరించారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు మద్యం దుకాణాల సమయపాలన పాటించడం లేదని మందుబాబులు వాపోతున్నారు. షాపుల నిర్వాహకులు అనుకూల సమయం, బార్ అండ్ రెస్టారెంట్‌ల కోసం సమయపాలన మారిందనే ప్రచారం సాగుతోంది. అనధికారికంగా రెస్టారెంట్‌లలో మద్యం అధిక ధరలకు విక్రయాలు పరిపాటిగా మారాయని తెలుస్తోంది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేదం, రోడ్లపై చెత్తవేస్తే జరిమానా విధించబడును ప్రచారం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. రోడ్లపై ఆక్రమణల తొలగింపు అపహాస్యంగా మారిందని చెప్పవచ్చు. ఇంకోవైపు రోడ్డు పక్కనే చికెన్, మటన్ మాంసం విక్రయాలు సాగుతున్నాయి. స్థానికంగా ఉన్న వ్యాపార సముదాయాల ముందు ఉన్న తోపుడు బండ్ల వద్ద అక్రమ వసూళ్ళు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. మొత్తంగా గురజాలలో ర్యాలీలు, ఫ్లెక్సీలు, వాట్సాప్ సందేశాలకే పరిమితమా.. అమలు కనపడట్లేదని ప్రజలు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రణభేరి మహాసభను జయప్రదం చేయండి






పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 ప్రభాతవార్తః ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటిఫ్ ఆధ్వర్యాన ఈనెల 25వ తేదీన గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే రణభేరి సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం పిడుగురాళ్ల పట్టణంలోని కార్యాలయంలో గోడప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారధి, రవిచంద్రశేఖర్, ఎస్‌కె జమాల్, శ్రీనివాసరావు, సాంబశివరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## వృర్థాలతో కల్వర్టు రోడ్డు కొట్టుకుపోయింది!

### - రెండు గ్రామాలకు రాకపోకలు బంద్- పట్టించుకోని అధికారులు

కారంపూడి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త: మూడు రోజులక్రితం కారంపూడి మండలంలోని చిన్నగార్లపాడు, చిన్నకొదమగుండ్ల గ్రామాల మధ్య కల్వర్టు దగ్గర ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయింది. ఈ రోడ్డు గతంలో కూడా పాడైపోయిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడం ప్రజలను తీవ్రంగా నిరాశపరుస్తుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు తాత్కాలికంగా మరమ్మతు చేయడానికి రూ.25 లక్షల నిధులు అవసరం. అయితే ఈ నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. అందువల్ల, ఆ ప్రాంతంలోని ప్రజలు రోడ్డు గుండా ప్రయాణించడంలో, వ్యాపారం నిర్వహించడంలో, విద్యార్థులు పాఠశాలకు





చేరుకోవడంలో కష్టాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారరు. వైద్యసహాయం అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయాలకు చేరుకోవడం కష్టతరం అవుతోంది. వాణిజ్య నష్టాలు, గ్రామాల్లో సరకుల సరఫరా నిలిచిపోవడంతో వ్యాపార నష్టాలు పెరుగుతున్నాయి. పాఠశాలకు చేరడానికి రోడ్డు సరిగా లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రాంతీయ అధికారులు చెబుతున్నట్లుగా రోడ్డు శాశ్వత పరిష్కారం కోసం కల్వవర్టు నిర్మించాల్సి ఉంది. దీని ఖర్చు రూ.90 లక్షలు అవుతుంది. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులను మంజూరు చేయడం లేదు. ప్రతి వర్షాకాలంలో రోడ్డు పాడైపోవడం స్థానికుల జీవన విధానానిఇ్న తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

**అధికారుల నిర్లక్ష్యం - స్థానికుల ఆవేదన**

ప్రజలు పునరావృత సమస్యను పరిష్కరించమని పలుమార్లు స్థానిక అధికారులను కోరారు. అయినప్పటికీ నిధుల వాయిదా, ప్రాధాన్యం తక్కువగా ఉండటం వల్ల ఏ చర్యలు తీసుకోలేదు. ఇబ్బందులను ఎదుర్కొంటున్న ప్రజలు స్థానిక ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.


**టీడీపీ నాయకుల డిమాండ్**

ఇదే విషయమై గ్రామ టీడీపీ నేతలు బత్తుల శ్రీను, లాయర్ చల్లా వెంకటేశ్వర్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం కురుస్తున్న వర్షాలకు కల్వర్టులు కొట్టుకుపోతున్నా విషయాన్ని తెలియజేశారు. నూతన హైలెవల్ కల్వర్టు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

కారంపూడి మండలంలోని చిన్నగార్లపాడు, చిన్న కొదమగుండ్ల గ్రామాల మధ్య కల్వర్టు రోడ్డు కొట్టుకుపోవడం కేవలం భౌతిక ఇబ్బందే కాకుండా ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శాశ్వత పరిష్కారం లేకపోవడం, ప్రతి వర్షాకాలంలో రోడ్డు మరలా పాడైపోవడం కారణంగా స్థానిక ప్రజల్లో భయం, ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది. ఆర్‌అండ్‌బీ ఏఈ సుబ్బారావును ఫోన్‌లో వార్త రిపోర్టర్ వివరణ కోరగా ప్రస్తుతానికి శాశ్వతంగా కల్వర్టు నిర్మించాలి. అంటే రూ.90 లక్షలు నిధులు కావాలి, అలాగే తాత్కాలికంగా నిర్మించాలంటే రూ.25 లక్షల నిధులు మంజూరు కావాలని ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి పంపించాము. నిధులు మంజూరు కాగానే పనులు మొదలుపెడతామని తెలిపారు.

## కనువిందు చేస్తున్న అమ్మవార్ల అలంకరణ

పొన్నూరు, సెప్టెంబరు 23,ప్రభాతవార్త: శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆయాదేవాయాల్లో అమ్మవార్ల అలంకరణలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. ముందుగా పేర్లు నమోదు చేసుకొన్న ఉభయదాతలపేరు మీదు సహస్రనామార్చనలు, గోత్రనామాలతో పూజాధికార్యక్రమాలు జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో శ్రీ పార్వతీదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. తెలగపాలెం రామమందిరంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు పూజాధికార్యక్రమాలను









నిర్వహిస్తున్నారు. దేవాలయం శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, కమిటి అధ్యక్షుడు అల్లం సాంబశివరావుల పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లు చేశారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమపూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం కాశీవిశాలాక్షి అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## మునిసిపల్ కమిషనర్‌గా రామ అప్పలనాయుడు



తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): పురపాలక సంఘ నూతన కమిషనర్ గా కె.రామ అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తెనాలి మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన బండి శేషన్న బదిలీపై వెళ్లడంతో మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్ ఇంచార్జ్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్ గా నియమితులైన రామ అప్పలనాయుడు ఇప్పటివరకు విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆయన తెనాలి మున్సిపల్ కమిషనర్ గా నియమితులయ్యారు. గత కొన్ని నెలలుగా తెనాలి మున్సిపల్ కమిషనర్ ఇన్చార్జి పాలనలో కొనసాగుతుండగా, నేడు రామ అప్పలనాయుడు రాకతో పూర్తిస్థాయి కమీషనర్ నియామకం జరిగినట్లయింది. కాగా నూతన కమిషనర్ సెప్టెంబర్ 25 తరువాత బాధ్యతలు చేపట్టనున్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రానికి వంటగది ఏర్పాటు

తెనాలి టౌన్ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): ప్రాథమిక విద్య మరియు అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం మరియు ఆంధ్ర పారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో, పట్టణంలోని రామలింగేశ్వరపేట లోగల దొడ్డపనేని ఇందిర మునిసిపల్ పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రానికి చెందిన స్టోర్ రూమ్ మరియు వంటగదిని రోటరీ సభ్యులు మంగళవారం ప్రారంభించారు. అంగన్వాడి కేంద్రానికి చెందిన ఈ స్టోర్ రూమ్ మరియు వంటగది వాడుకోవడానికి పూర్తిగా ఇబ్బందిగా ఉందని రోటరీ దృష్టికి తీసుకురావడంతోటి రోటరీ సభ్యులు తమ విరాళాలను ప్రకటించి 50 వేల రూపాయల విలువైన మరమ్మతులను చేపట్టి తిరిగి ఆ గదులను ఉప యోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అంగన్వాడీ కేంద్రంలోని స్టోర్ రూమ్ మరియు వంటగదిని సిడిపిటిపి విజయ గౌరీ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కొడాలి సౌజన్య సమక్షంలోరోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు మరియు కార్యదర్శి గుమ్మడి వెంకట్ నారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్ సమక్షంలో ఈ గదులను ప్రారంభించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు ,హ్యాపీ స్కూల్స్ డైరెక్టర్ బత్తుల వెంకటేశ్వరరావు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుత్త వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ వైకాపా బిసీ సెల్ అధ్యక్షునిగా వెంకటేశ్వరరావు

తెనాలి టౌన్ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులుగా పట్టణంలోని 23వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు పెదలంక వెంకటేశ్వరరావు ని నియమించగా, ఇటీవల ప్రకటించిన పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మరియు నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు, మాజీ శాసనసభ్యులు శివకుమార్ ని కలిసి తమ నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పదవులు పొందిన వారిలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా పెదలంక వెంకటేశ్వరరావు, రూరల్ బీసీ సెల్ అధ్యక్షునిగా కామాదుల స్వామి, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పిన్నపాటి రవికిరణ్, తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి క్రాంతి, గోల్డ్ రహీమా, షేక్ దుబాయ్ బాబు, షేక్ సుభాని(పెచింగ్) ఆవుల కోటయ్య, కుర్ర జస్వంత్ యాదవ్, బండ్లమూడి నాని, మల్లెబోయిన రాము, గోడే సుబ్రహ్మణ్యం, సమయపురం సురేష్, కొల్లా గుర్నాథ్ గుప్తా, అమర్తులూరి సీమోను, అడ్వకేట్ విజయ్ నాయుడు, పిల్లి నాగేశ్వరరావు, రుద్రపాటి చెన్నయ్య, కనపర్తి శశికుమార్, ఎర్రగుంట్ల రవీంద్రబాబు, తాడిబోయిన నాగరాజు, షేక్ మీరావలి, కుర్ర శీను(ఫ్లెక్సీ), మునిపల్లి వంశీ, మల్లెపాడు రాజ్ కుమార్, నీలి అజయ్, మన్నవ ప్రభాకర్, అక్కి దాసు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు: డిఎంహెచ్ఓ

తెనాలి టౌన్ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): గర్భస్థశిశులింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని, అలా నిర్వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని, తెనాలి ఉపజిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ తెలిపారు. గర్భస్తశిశులింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి తెనాలి డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మీటింగ్, బుధవారం పట్టణంలోని పాతప్రభుత్వ వైద్యశాలలోని, ఉప వైద్య ఆరోగ్యశాఖధికారిణి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా, డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ డివిజన్ లోని ప్రవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్స్, లేబోరేటరీలు లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చినా, పిసిపి యన్డిటి చట్టం ప్రకారం కఠినమైనచర్యలు తీసుకుంటామని, జిల్లా లో పిసిపియన్ డిటి చట్టము జిల్లా కలెక్టర్ ఛైర్మన్ షిప్ లో పటిష్టంగా అమలువుతుందన్నారు. కమిటీ మెంబర్స్ డా.నరేంద్ర సింగ్, ప్రసూతి వైద్య నిపుణులు, డా.కె.సురేష్ ,చిన్న పిల్లలవైద్యనిపుణులు, డా. వినీల, జనరల్ మెడిసిన్ వైద్యులు, డాక్టర్ వేములప్రియాంక, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ ముమ్మనేనిభానుమతి, పెనుగొండవెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ, సీఐటియు ధర్నా

తెనాలి టౌన్ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): లేబర్ కోడ్ లను రద్దుచేయాలని కోరుతూ, సీఐటీయూ తెనాలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం శాసన సభ లో ఫ్యాక్టరీస్ యాక్ట్ 1948, మరియు షాప్స్ అండ్ ఇష్టబ్లిష్మెంట్ యాక్ట్ 1965 కు సవరణలు చేస్తూ పెట్టిన బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను వుద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబి.ప్రసాద్ , సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి మాట్లాడారు. అనంతరం కార్మికశాఖ అధికారి డివిఎస్.ప్రసాద్ కి వినతిపత్రం అందించారు. సిఐటియు డివిజన్ ప్రెసిడెంట్ కే.రవికుమార్, నాయకులు జి.వెంకట సుబ్బయ్య, సీహెచ్.శేషగిరిరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, రాచూరి వెంకటేశ్వర్లు, ఎం. సుభాష్, టి. చంద్రశేఖర్, కాశీ విశ్వనాథ్, వి.సుధాకర్, మండేల నాగరాజు, ఎం.మరియమ్మ, సువార్తమ్మ, సుగుణ కుమారి, రత్న కుమారి విక్టర్ బాబు, ధనలక్ష్మి కృ.దార్ల పద్మ, రాచూరి గౌరి, యడ్లపల్లి అంజి, నంబూరి పెంచలమ్మ, సానమ్మ, వెంకట లక్ష్మి, శివప్రసన్న, వి.లక్ష్మి నారాయణ, షేక్.కరీం, మురళి పాల్గొన్నారు.




## కలరా పట్ల అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ ఆరోగ్యాధికారి.




తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): పట్టణ పరిధిలో కలరా వ్యాధికి సంబంధించి కేసులు నమోదవుతున్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మునిసిపల్ ఆరోగ్యాధికారి మొవ్వ యేసుబాబు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం కావడం చేత త్రాగునీరు కలుషితమై, భూగర్భ జలాలు కలుషితమై, ఆ నీటిని త్రాగటం వలన వాంతులు, విరోచనాలు లాంటివిపట్ల నిర్లక్ష్యం చేయవద్దని, ఆర్ఎంపి ల వద్దకు వెళ్లకుండా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని, ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించటం కూడదని ఆయన సూచించారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

తెనాలి టౌన్ సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త): తెనాలి డివిజన్ ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ కార్యకర్త, సహాయకురాళ్ళ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు తెనాలి, మంగళగిరి, ప్రత్తిపాడు, పొన్నూరు, తదితర ప్రాంతాల నుండి పలువురు మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఐ.సి.డి.యూ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసన్న, సిడిపిఓ విజయ గౌరీ, ఈ నియామకాలను పర్యవేక్షించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో, "పోషణ్ మా "కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజన సిన్హా మాట్లాడుతూ, పిల్లలకు చిన్నతనం నుండే బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తూ, మంచి ఆహారపు అలవాట్లను నేర్పాలని, తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఆమె కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కెఎల్‌యూ లో ఉచిత కంటి వైద్యశిబిరం



తాడేపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : కెఎల్ యూనివర్సిటీలో లారెన్స్, మైకో సంస్థల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 270మంది విద్యార్థులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని కంటి చూపులో లోపాలు, కళ్లల్లో తలెత్తే సాధారణ సమస్యలను గుర్తించి తగిన సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికి కాంటాక్ట్ లెన్స్‌లు ఉచితంగా అందజేశారు. అలాగే డ్రైవర్లకు కంటి పరీక్షలు పూర్తిగా నిర్వహించి సమగ్ర నివేదికలు అందించారు. కార్యక్రమంలో విసి డాక్టర్ పార్థసారధి వర్మ, ఆచార్య డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య, హాబీ క్లబ్ ఇన్చార్జీ డాక్టర్ సుభాకర్ రాజు, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్చార్జీ డాక్టర్ ఆర్.సుప్రియ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## కృష్ణానది కరకట్టలను యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేయాలి: కలెక్టర్

బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: కృష్ణానది కరకట్టలు యుద్ధ ప్రాతిపదికన అధికారులు బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో బలహీనంగా ఉన్న కృష్ణానది కరకట్టలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. దోనెపూడి చప్టా మీదుగా ఇప్పటికే వరద ప్రవాహం వస్తుందని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. దోనెపూడి చప్టా మీదుగా ఎవరిని వెళ్లనివ్వకుండా పోలీసులను ఉంచి పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అనంతరం దోనెపూడి ఫెర్రీ పాయింట్, కొల్లూరు లాక్ ల వద్ద ఫెర్రీ పాయింట్, వెల్లటూరు, వెల్లటూరు ఫెర్రీ పాయింట్, పెద్దపులివర్రు వద్ద కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి బలహీనమైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. ఇసుక, కంకర గ్రావెల్ కలిపి కట్టను బలోపేతం చేయాలని కొల్లూరు ఈ డబ్ల్యు ఆర్ సి విజయరాజుకు సూచించారు. వెల్లటూరు ఫెర్రీ పాయింట్ వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్లను అభ్యర్థించారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల తహసిల్దార్ లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఎం.శ్రీనివాసరావు, జల వనరులశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా పోలీస్ కార్యాలయంలోని విభాగాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్బి, ఎస్సీ ఎస్టీ సెల్, కమ్యూనికేషన్, ఇన్ వార్డ్ అవుట్ వార్డ్, పిజిఆర్ఎస్ సెల్, ఐటీ కోర్, ఫింగర్ ప్రింట్ తదితర విభాగాలను స్వయంగా పరిశీలించి ఒక్కొక్క విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధుల గురించి తెలుసుకుని మెరుగైన పనితీరు కోసం సూచనలు సలహాలను అందించారు. ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి ఒక్కరు వారి విభాగాలను శుభ్రపరచుకోవాలని ఆదేశించారు. అదే విధంగా కార్యాలయ సిబ్బంది వారివారి విధులలో అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డివిస్పి బాల మురళీకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ నారాయణ, డిసిఆర్బి సిఐ శ్రీనివాసరావు, పి జి ఆర్ ఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఆర్.ఐ లు మొలుద్దీన్, శ్రీకాంత్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి పౌరుడి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నిస్తాం

బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: జిల్లాలోని ప్రతి పౌరుడి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నిస్తామని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మతి స్థిమితం లేని మహిళ ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి జిల్లా పోలీసులు మంగళవారం బంధువులకు అప్పగించారు. ఈ నెల 22వ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో బాపట్ల జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈపూరు గ్రామంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న ఒక మహిళ ఒంటరిగా తిరుగుతున్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కొల్లూరు ఎస్ఐ జె. అమరవర్ధన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ఆ మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమెతో సానుకూలంగా మాట్లాడి వివరాలు అడగగా, తన పేరు అమీనా అని, తనది అచ్చంపేట ప్రాంతమని తెలపడంతో . వెంటనే జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని దర్యాప్తు జరిపిన పోలీసులకు, ఆ మహిళను సుమారు 10 రోజుల క్రితం గుంటూరుకు చికిత్స కోసం తీసుకువచ్చిన సమయంలో కుటుంబ సభ్యుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నదని తెలుసుకున్నారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులను సంప్రదించి ఆమె క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించారు. మహిళను భద్రత కోసం తెనాలి జేఎంజె సదరన్ హోమ్‌లో ఉంచారు. అనంతరం మంగళవారం ఆమె భర్త షేక్ షీలార్ కి అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పౌరుడి భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వెంటనే స్పందించి వారిని రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యంగా బావిచండం జరుగుతుందన్నారు. మహిళకు భద్రత కల్పించడంలో చొరవ చూపిన కొల్లూరు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఫోటో



## కన్నుల పండుగగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కొల్లిపర, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) : దసరా ఉత్సవాలు మండలంలో కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా వివిధ రూపాల్లో పలు చోట్ల అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో శ్రీసర్వమంగళ పార్వతిదేవి, శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో శ్రీమంగళ గౌరీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీగాయిత్రిదేవిగా అమ్మవారిని పండితులు అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, దావులూరు, చక్రాయపాలెం, మున్నంగి, అత్తోట గ్రామాల్లో శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది




కొల్లిపర, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) : మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని ఐసిఆర్‌పి షేక్ మస్తాన్‌బీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగిలో ప్రకృతి వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సు నిర్వహించి బీజామృతం తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌బీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా కుటుంబం కూడా కావాల్సినటువంటి ఆకుకూరలు, కూరగాయలు పెరట్లో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులకు అప్పగింత

కొల్లూరు, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) : మతిస్థిమితం సరిగా లేని మహిళను తమ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కొల్లూరు ఎస్సై అమరవర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఈపూరులో మతిస్థిమితం లేని ఓ మహిళ సంచరిస్తూ ఉండటంతో గ్రామస్తులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. ఘటన స్థలానికి చేరుకుని ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఆమెను విచారించగా ఆమె పేరు అమీనా అని అచ్చంపేట ప్రాంతమని తెలిపింది. షుమారు 10రోజుల క్రితం గుంటూరుకు చికిత్స కోసం తీసుకువచ్చిన సమయంలో కుటుంబ సభ్యుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నదని తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆమె అడ్రస్‌ను కనిపెట్టి బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు మహిళను అప్పగించారని ఎస్సై తెలిపారు.

## పోషకాహారంపై అవగాహన



కొల్లూరు, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) : గర్భవతులు బాలింతలు పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఫజరున్నీసా అన్నారు. మంగళవారం కోటిపల్లి ప్రాథమిక వైద్య కేంద్రంలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలు జరిగాయి. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలు జరిగాయి. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పౌష్టికాహారం లోపంతో ఉన్న పిల్లలకు పౌష్టికాహార బలంగా ఇవ్వాలని సూచించారు. గర్భవతులు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, రాణి, గర్భవతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరద విపత్తు వస్తే లంక గ్రామాలలో ఏ ఒక్కరి ప్రాణానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: వరద విపత్తు వస్తే లంక గ్రామాలలో ఏ ఒక్కరి ప్రాణానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కొల్లూరు, భట్టిప్రోలు రేపల్లె మండలాల సర్పంచ్ లు, అధికారులతో మంగళవారం భట్టిప్రోలు మండలం తాహసిల్దార్ కార్యాలయం వద్ద ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద విపత్తు వస్తే సమర్థంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత సర్పంచ్ లు, అధికారులపై ఉందన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి సర్పంచ్ లు, అధికారులు సంసిద్ధం కావాలన్నారు. లంక గ్రామాల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా నేను మీకు అండగా ఉంటాను, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. లంక గ్రామాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలి రావడానికి సిద్ధం కావాలన్నారు. కృష్ణానది కరకట్టను బలోపేతం చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా కొల్లూరు మండలం కొల్లూరు కెనాల్ లాకుల వద్ద నుంచి పెనుమూడి వరకు కరకట్ట బలహీనంగా ఉందని సర్పంచులు చెప్పారు. వరద సమయంలో ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లంక గ్రామాలలో కాల్వలలో చెట్లు తొలగించాలన్నారు. దోనెపూడి చప్టా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. కిష్కింధపాలెం వద్ద పడవలు వెళ్లే మార్గంలో చెట్లు తొలగించాలని విన్నవించారు. కృష్ణానదిపై నిర్మించిన అరవింద వారధి సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా నియంత్రించాలని కోరారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల తహసిల్దార్ లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఎం.శ్రీనివాసరావు, ఆయా మండలాల 28 మంది సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



## యూరియా అందుబాటులో ఉంది'



బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: జిల్లాలో యూరియా 171.600 మెట్రిక్ తన్నులు అందుబాటులో ఉందని అవసరమైన రైతులు తీసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ ఎస్ కె లు మరియు పి ఏ సి ఎస్ కేంద్రాల 17 ద్వారా 289.205 మెట్రిక్ టన్నుల యూరియా ను 2385 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా 171.600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు లో ఉందని తెలిపారు

## బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసినా, విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా, సహకరించిన వారిపై పకడ్బందీగా కేసులు

బాపట్ల, సెప్టెంబర్23, ప్రభాతవార్త: బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసినా, విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా, సహకరించిన వారిపై పకడ్బందీగా కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. అన్ని జిల్లాల సంయుక్త కలెక్టర్లు, వ్యవసాయ, మార్క్ ఫెడ్ శాఖ అధికారులతో మంగళవారం రాజధాని అమరావతి నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలోనైనా బ్లాక్ బర్లీ పొగ నారు వేస్తే కేసులు నమోదు చేయాలన్నారు. జీవో నెంబర్ 740 పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు సమర్థంగా పని చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా స్థాయిలో కమిటీలో ఉండాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డిఓ, డిఎస్పి, వ్యవసాయ శాఖ ఏడి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ కమిటీలో ఉన్నారని చెప్పారు. అలాగే మండల స్థాయిలో తహసిల్దార్, ఎస్సై, మండల వ్యవసాయ శాఖ అధికారి, రైతులు కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ప్రభుత్వం సూచన మేరకు ఆయా కంపెనీలు 20 వేల టన్నుల పొగాకును కొనుగోలు చేశాయన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారిని అన్నపూర్ణ, మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



## రహదారి నిర్మించండి మహాప్రభో..

కర్లపాలెం, సెప్టెంబర్23, ప్రభాతవార్త: కర్లపాలెం పంచాయతీ లోని 9వ వార్డు లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అంతర్గత రహదారులు లేక ప్రజలు నడవటానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్ళే చిన్నారులు సైతం బురదలో నడిచి వెళ్ళవలసి వస్తుంది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డు మెంబర్ ఉన్న కూడా ఏమి పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ కార్యదర్శి వారికి పిర్యాదు చేసిన ఏమి చర్యలు తీసుకోవటం లేదని వివరించారు. గత 10 సంవత్సరాల నుంచి వార్డు మెంబర్ గా కొండమూది పద్మావతి ఉన్నారని ఇప్పటికి ఆ పల్లెలో ఒక్క సీసీ రోడ్డు కూడా నిర్మించలేదని వార్డ్ మెంబర్ పై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాలు గెలిపించినందుకు ఒక్క రోడ్డు కూడా వేయలేకపోయారని ఆమెను ప్రశ్నిస్తున్నారు. పల్లెలో ఉన్న చిన్న పిల్లలు వృద్దులు నడవలేక అవస్థలు పడుతున్న కూడా ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగంపై జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికలు తెలిపారు.



## గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, సెప్టెంబర్23, ప్రభాతవార్త: కర్లపాలెం మండల పరిధిలోని నల్లమోతు వారి పాలెం ఎట్రవారిపాలెం, బుద్దాం, యాజలి దుండి వారి పాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్యం పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వర్షాలు విపరీతంగా కురుస్తున్నందువల్ల పారిశుధ్యం పూర్తిగా లోపించకుండా అధికారులు వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వివిధ రకాల సర్వేలను వెంటనే పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.




## పిట్టలవానిపాలెం ఎంపిడివోగా శేఖర్



పిట్టలవానిపాలెం, సెప్టెంబర్23, ప్రభాతవార్త: పిట్టలవానిపాలెం ఎంపీడీవో గా సిహెచ్ శేఖర్ బాధ్యతలు పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధి అధికారిగా సిహెచ్ శేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వేమూరు మండలంలో ఈఓపిఆర్డిగా విధులు నిర్వహిస్తు పదోన్నతి పై బదిలీలలో భాగంగా పిట్టలవానిపాలెం ఎంపీడీవో గా భాద్యతలు చేపట్టారు.

## ప్రమాద భరితంగా పొన్నాల కాలువ: పొంచి ఉన్న ప్రమాదం

కర్లపాలెం, సెప్టెంబర్23, ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలోని నర్రవారిపాలెం తుమ్మలపల్లి గ్రామాల మధ్య ఉన్న పొన్నాల కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. వంతెన పైనుంచి ఐదు అడుగుల మేర నీరు వెళుతూ ఉండటంతో వంతెన దాటడానికి ఇరు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతేగాక దసరా సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు సైతం ఈ వంతెన వద్దకు వచ్చి ఈత కొట్టడానికి ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. ఆదమరిస్తే నీటి ప్రవాహానికి చిన్న పిల్లలు కొట్టుకొని వెళ్ళే ప్రమాదం ఉంది. కనుక అధికారులు స్పందించి కనీసం సూచిక బోర్డులైన ఏర్పాటు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అంతే కాకుండా వంతెన నిర్మాణానికి కూడా అధికారులు పూనుకోవాలని ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు.



## కృష్ణానది వరద ప్రవాహం దృష్టిలో ఉంచుకుని సర్పంచ్‌లు అధికారులతో సమావేశమైన కలెక్టర్

కొల్లూరు, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త) : భారీ వర్షాల హెచ్చరికల నేపధ్యంలో కృష్ణానదికి వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా భట్టిప్రోలు, ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నదీ పరివాహక ప్రాంతాల సర్పంచ్‌లు అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కృష్ణానదికి వరద ప్రవాహం పెరిగితే సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరికి ప్రాణహాని జరగకుండా చూడాలని అన్నిశాఖల అధికారులకు ఆదేశించడం జరిగింది. అనంతరం కొల్లూరు మండలంలోని దోనేపూడి గ్రామం దగ్గర చిన్నరేవు చప్టపై ప్రవహిస్తున్న వరద ప్రవాహాన్ని, అలాగే కొల్లూరు లాక్ సెంటర్ వద్ద ఫెర్రీ పాయింట్ స్థలమును పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, కొల్లూరు మండల తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



## గాయత్రీదేవిగా భక్తులకు దర్శమిచ్చిన అమ్మవారు




యడ్లపాడు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : శరన్నవరాత్రులలో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు భక్తులకు శ్రీ గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. సకలదేవతల స్వరూపం గాయత్రీదేవి, అన్ని మంత్రాలకు మూలశక్తి అమాత, ముక్తన, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంఖం, చక్రం, గద అంకుశం ధరించి అమ్మవారు దర్శనమిస్తుంది. ఈమెను ధ్యానిస్తే అనంత మంత్రశక్తి కలుగుతుంది. సకల దురిత ఉపద్రవాలు శాంతిస్తాయి. బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. గాయత్రీ ఉపాసనవల్ల బుద్ధి తేజోవంతం అవుతుంది. గాయత్రీ మంత్రజపం చతుర్వేదం పారాయణ ఫలితాన్ని ఇస్తుందని పండితులు తెలుపుతున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అన్ని రకాల అరోగ్య సమస్యలపై పరీక్షలు



యడ్లపాడు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : ప్రాథమిక అరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించే స్వస్థ నారీ శక్తివంతమైన కుటుంబ అభియాన్ కార్యక్రమంలో అన్ని రకాల అరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని, కావున స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ప్రాథమిక వైద్యులు భరద్వాజ్ తెలిపారు. మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని సచివాలయం నందు మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో అయన ప్రసంగించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 102మంది స్త్రీలకు వైద్య అరోగ్య సిబ్బందిచే అన్ని అరోగ్య పరీక్షలు అనగా కాన్సర్ స్క్రీనింగ్, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయటం జరిగిందని, గర్భిణీ స్త్రీలకు టిటి వ్యాక్సిన్ తోపాటుగా ఐరన్, కాల్షియం బిళ్ళలు ఇవ్వటం వారికి అరోగ్య పరీక్షలు నిర్వహించటం పలు సలహాలు, సూచనలు తెలపటం జరిగిందన్నారు. అర్సిహెచ్ పోర్టల్ నందు అన్ లైన్ చేయుట, చిన్నారులకు వాక్సినేషన్ చేయటం, పిఎమ్జెఎవై కార్డులు, వైయో వందన కార్డ్సు అన్ లైన్ చేసి అందరికి మందులు అందజేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో అరోగ్య సిబ్బంది, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గులాబీ రంగు పురుగు అశించడం వల్ల ఎక్కువ నష్ట కలుగుతుంది : ఎవో



యడ్లపాడు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : పత్తి పంట కాయ దశలో ఉన్నదని, ఈ దశలో గులాబి రంగు పురుగు అశించడం వలన ఎక్కువ నష్టం జరుగుతుందని, దీనికి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎవో హరిప్రసాద్ తెలిపారు. యడ్లపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా పొలంలో తిరుగుతూ గుడ్డి పువ్వులు ఎక్కడైనా ఉంటే వాటిని ఏరివేసి పొలానికి దూరంగా తగలబెట్టాలని, అలాగే పొలంలో అక్కడక్కడ పది కాయలు కోసి అందులో ఏమైనా గులాబీ రంగు పురుగు ఉనికి ఉన్నదేమో చూడవలెనని, ఇలా చూసుకునట్లుయితే లేదా లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి వరుసగా ఎనిమిది రెక్కపురుగులు పడినట్లయితే తగు చర్యలు చేపట్టవలసి ఉందన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మిస్టరీ చేదించిన పోలీసులు


### ..స్నేహితుడిని అతి కిరాతకంగా చంపిన నిందితులు

యడ్లపాడు, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త : మండల కేంద్రం యడ్లపాడు సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న డ్రైనేజ్లో క్రూరమైన హత్యకు సంబంధించిన కేసును ఛేదించి ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేయటం జరిగిందని, స్నేహితుడిని అతి కిరాతకంగా చంపిన ఈ కేసులో నిందుతులు చాకచక్యంగా చిక్కారని, ఈ కేసును ఛేదించిన సిబ్బందిని స్వయంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందనలు తెలిపారని నర్సరావుపేట డిఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు.




చిలకలూరిపేట సర్కిల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ 2025 జూన్ 25వ తేది యడ్లపాడు సమీపంలోని కాలువలో కాలుతూ ఉన్న మృతదేహం విషయం స్థానిక పోలీసులకు సమాచారం అందిందని, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, దర్యాప్తులో భాగంగా అ మృతదేహం తాడిబోయిన గోపి(32)అనే వ్యక్తిదని గుర్తించటం జరిగిందన్నారు. గోపి గతంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్గా పనిచేసేవాడని, తరువాత సినిమా రంగంలోకి వచ్చి సిలిస్టియాన్ క్రియేషన్స్ అనే బ్యానర్తో షార్ట్ ఫిల్మ్లు, వేబ్ సిరీస్లు తీసేవాడని తెలిసిందన్నారు. మిషన్ మంగళాద్రి అనే వెంబ్ సిరీస్ కూడా తీయడం మెదులు పెట్టాడన్నారు. గోపి ఇమ్రాన్ అనే వ్యక్తి అక్క అఫ్రిన్ ద్వారా పరిచయం అయ్యాడని, అఫ్రిన్, గోపి సన్నిహితంగా ఉండేవారని, అలాగే ఇమ్రాన్ ప్రేమిస్తున్న అమ్మాయి గురించి కూడా గోపి వేధించడంతో వారిద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయని, ఈ కారణంతో గోపిని చంపి అతని డబ్బును కాజేయాలని ఇమ్రాన్ పథకం పన్నాడని, ఇందుకు తన స్నేహితులైన షేక్ రియాజ్, ఖాజా మొహిద్దీన్లు సహాయంతో కోరటం జరిగిందన్నారు. 2025 జూన్ 24న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలోగోపిని గుంటూరులోని ఇమ్రాన్ అద్దె గదికి రమ్మని ఫోన్ చేసి పిలిపించారని, అక్కడ ప్లాన్ ప్రకారం ముగ్గురు కలిసి గోపి తలపై రాడ్తో కొట్టారని, అనంతరం తాడు బిగించి గొంతు నులిమి చంపేశారు. హత్య అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లో మట్టి తాడుతో కట్టి గోపి కారు డిక్కీలో వేసుకుని చిలకలూరిపేట వచ్చి అక్కడ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొని గుంటూరు వైపు వెళ్లే మార్గంలో యడ్లపాడు వద్ద నిర్మానుష్యంగా ఉన్న సర్వీసు రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ కాలువలో గోపి మృతదేహాన్ని వేసి నిప్పంటించారు. నిందితుల అరెస్ట్ ఈ కేసులో ఎటువంటి ఆధారాలు లేకపోయినా జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించటం జరిగిందన్నారు. సాంకేతిక ఆధారాల సహాయంతో ముగ్గురు నిందుతులను యడ్లపాడు మండలం ఎన్ఎస్ఎల్ టెక్స్టైల్ వద్ద 2025 సెప్టెంబర్ 22వ తేది సాయంత్రం 6.45గంటలకు అరెస్ట్ చేయటం జరిగిందన్నారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన రాడ్, గోపికి చెందిన సెల్ ఫోన్, ఏటీఎం కార్డులు, 12వేల నగదు అలాగే నిందితులు ఉపయోగించిన వాహనం స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన రూరల్ సీఐ బి సుబ్బానాయుడుతోపాటు కేసు దర్యాప్తులో సహకరించిన యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ, ఎఎస్ఐ సుబ్బారావు, రోసిబాబు, హెచ్సీ శ్రీధర్, దేవరాజ్, పీసీలు ఐశ్వర్య రాజేష్, రత్న కిషోర్, హెచ్జిలు సాంబ, మధుబాబు, అలాగే సీడీఆర్ వింగ్ పీసీ వి శ్రీనివాసరావులు పాల్గొనటం జరిగిందన్నారు.

## మంత్రి పయ్యావుల కేశవ్ను కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్



పెదకూరపాడు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ను మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ అమరావతి - బెల్లంకొండ రహదారికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించి రోడ్డ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలియజేశారు.

## శ్రీ బాలా త్రిపురసుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



అమరావతి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : అమరేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైయున్న శ్రీ బాల చాముండేశ్వరి అమ్మవారు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ బాలా త్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా అమరేశ్వరస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరణ చేశారు.

## మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : డాక్టర్ రవికుమార్



అమరావతి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : స్వస్థనారి..స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం అమరావతి సిహెచ్సిలో మంగళవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పిఎం నరేంద్రమోదీ ఆదేశంతో గ్రామ గ్రామాన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు మహిళలు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకొని సరైన మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మార్కెట్యార్డు ఛైర్మన్ జానీ, డాక్టర్లు, రోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## స్టాక్ పాయింట్లు, ఈవిఎం గోదాముల్లో కలెక్టర్ తనిఖీ



నరసరావుపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : పట్టణంలోని వ్యవసాయశాఖ మార్కెట్యార్డు ఆవరణలో ఉన్న మండలస్థాయి స్టాక్ పాయింట్ను మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సకాలంలో రేషన్ సరుకులు అందించాలన్నారు. రైతుబజార్ నందు ఏర్పాటు చేసే చౌకధరల దుకాణాలకు సంబంధించిన ప్రదేశాన్ని పరిశీలించారు. సివిల్ సప్లయ్స్ ఇన్ఛార్జి జయప్రకాష్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అంగన్వాడీ పిల్లలకు, గర్భిణీలకు ఏ సరుకులు పంపిణీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి హాస్టళ్ళకు సరఫరా చేసే బియ్యం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కలెక్టర్ కృతికాశుక్లా వెంట డిఆర్ఓ మురళీ, మార్కెటింగ్ ఏడి ఉపేంద్ర, మున్సిపల్ కమిషనర్ జశ్వంత్రావు, తహాశీల్దార్ వేణుగోపాల్ ఉన్నారు. ఈవిఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా సాధారణ తనిఖీలలో భాగంగా మార్కెట్యార్డు ఆవరణలోని ఈవిఎం యంత్రాలు, వివిప్యాడ్స్ భద్రపరిచిన గోడౌన్ను తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ తనిఖీలలో భాగంగా గోడౌన్కు వేసిన భద్రతా సీల్స్, సి.సి.కెమేరాలు, అగ్నిమాపకదళ పరికరాలు, సెక్యూరిటీ లాక్ బుక్లను క్షుణ్ణంగా కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు.

## ఎంఏఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



నరసరావుపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : ఎంఏఎం విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు జన్మదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక వేడుకలను నిర్వహించడంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ఎస్.టి. బాలికల హాస్టల్లో ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులను అందజేశారు. అదే విధంగా కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, పృధ్వీరాజ్, ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, ఎస్.రామారావు, ప్రముఖులు, వైద్యులు, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.శేషగిరిరావుకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదే విధంగా మైనంపాడులో ఉన్నటువంటి నైస్ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొండేటి చంద్రారెడ్డి, కె.బ్రహ్మం, శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా రెడ్క్రాస్ ప్రతినిధులు డాక్టర్ సృజన, నంద్యాల రాంప్రసాద్రెడ్డి, గుప్తా, రాంప్రసాద్, బత్తుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



నరసరావుపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాల ఆవరణలో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు షేక్.కరీమ్, పుస్తకాల పంపిణీకి సహకరించిన ప్రవల్లిక సత్యం - రమాదేవి దంపతులతో పాటు ప్రవల్లి, తాళ్ళ రాజశేఖరరెడ్డి, ఎస్.కె.జిలానీమాలిక్, ఆంజనేయులు, మునీంధర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనేక సహాయక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మొత్తం 500 పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

## జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థిని ఎంపిక



నరసరావుపేట, సెప్టెంబరు 23 ప్రభాత వార్త : జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థిని కె.కావ్య ఎంపికయ్యారు. వివరాలను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. అనంతపురం, ధర్మవరంలో జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ అంతర్జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో కావ్య పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపిందన్నారు. తమ కళాశాల ప్రథమస్థానం సాధించడం, గోల్డ్మెడల్ను తీసుకురావడం, రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పి.డి.ఆదిబాబు, తిరుపతిరావు అభినందించారు.

## డాక్టర్ గోపిరెడ్డిని కలిసిన విద్యార్థి విభాగం నాయకులు



నరసరావుపేట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మంగళవారం విద్యార్థి విభాగం నాయకులు స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉప్పుతోళ్ళ వేణుమాధవ్తో పాటు విద్యార్థి సంఘం నాయకులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వేల్పుల వారి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారికి గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మూరబోయిన శ్రీనివాసరావు, కనకా పుల్లారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, శనివారపు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇస్సపాలెం దేవాలయంలో ప్రత్యేక పూజలు



రొంపిచర్ల, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : నరసరావుపేట మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో మంగవారం దసరా ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవిదేవి మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మహంకాళి అమ్మవారి ఆలయంలో వైభవంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని మాధవిదేవి విజ్ఞప్తి చేశారు.

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతి

నకరికల్లు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లికార్జున, లక్ష్మిపతి, వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు పథకం అమలు చేయాలన్నారు. అదే విధంగా నిరుద్యోగుల కొరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. అన్నిశాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. లైబ్రరీ, విద్యాలయాలు, ప్రభుత్వశాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కెరిడ్జ్ విద్యార్థిని ఎంపిక

నకరికల్లు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కెరిడ్జ్ విద్యార్థిని సిరినందన ఎంపికయ్యారు. వివరాలను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు అభినందన కార్యక్రమంలో మంగళవారం తెలియజేశారు. గుంటూరు డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలను నిర్వహించారు. 50 మీటర్ల ఫ్రీ స్టైల్, వంద మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సిరినందన ప్రతిభ చూపి రాష్ట్ర స్విమ్మింగ్ కాంపిటీషన్కు ఎంపికయ్యారు. సిరినందన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లుతో పాటు స్కూల్ డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జి కోట బాపూజీ ఆకాంక్షించారు.

## ఆకట్టుకుంటున్న నవరాత్రి ఉత్సవాలు




వినుకొండ, సెప్టెంబర్23, ప్రభాతవార్త: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రెడో రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమించారు. బిస్కెట్ ప్యాకెట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. పది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. వినుకొండ ప్రాంత ప్రజలతోపాటు ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బొన్నలగడ్డ బాబ్జి, గౌరవ అధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల అమర్నాథ్, రెడ్డినగేష్బాబు, కోశాధికారి పెండ్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**నూజెండ్లలో.......**మండలంలోని రవ్వారం గ్రామ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి మంగళగౌరీదేవిగా భక్తులకు దర్శనమించారు. భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రధానాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నాటుసారా అనుమానిత ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ



ఈపూరు, సెప్టెంబర్23, ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ పరిధిలోని బొల్లాపల్లి మండలం బోడిపాలెం తండా, నాటు సారా తయారీ అనుమానిత ప్రాంతాల్లో ఈపూరు ఎక్సైజ్, వినుకొండ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీలు చేశారు. ఈపూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటు సారా, కల్తీ మద్యం, కల్తీ కల్లు తయారు చేయడం విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారి పట్ల పౌరులు అప్రమత్తంగా ఉండి తమకు సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వ మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన లేని యెడల చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఈపూరు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, వినుకొండ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి 'ఆనం'ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వారి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. దీనిపై మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.

## పట్టణంలో వేడుకగా సాగుతున్న దసరా ఉత్సవాలు






సత్తెనపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : పట్టణంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకలలో భాగంగా పట్టణంలోని వీర బ్రహ్మేంద్ర ఆశ్రమంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళ వారం రెండవ రోజు జరిగాయి. అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులు పూజలను నిర్వహించారు. అదే విధంగా త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అదే విధంగా కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా తొలి రోజున బాల త్రిపురసుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. వడ్డవల్లి పెద్ద బొడ్రాయి సెంటర్లో అమ్మవారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా వేద గాయత్రీదేవి అలంకరణ చేశారు. వెంకటపతికాలనీలో ప్రత్యాంగిరా అమ్మవారి పీఠం నందు రెండవ రోజు అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## భారతమాత అన్నప్రసాద సేవా కార్యక్రమాలు



సత్తెనపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : భారతమాత అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్లమ్ ఏరియాలలో మంగళవారం 121 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగార్జునకాలనీలో ఉన్న ప్రజలకు అన్నదానం చేశారు. జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షులు వాలేటి కుమారి అందించిన సమాచారం మేరకు కమిటీ సభ్యులు అన్నం మల్లికార్జునరావు జ్ఞాపకార్థం అన్నం కృష్ణమూర్తి - విజయదుర్గాల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్ తిమోతి, దివ్వెల శ్రీనివాసరావు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

## గణపవరంలో స్వస్థనారి..స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం


రాజుపాలెం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : మండలంలోని గణపవరంలో గ్రామంలో మంగళవారం స్వస్థనారి..స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ అలేఖ్య వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సందేశాన్ని వినిపించారు. మహిళలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రవితేజానాయక్, డాక్టర్ కాంచన, డాక్టర్ ఆర్.శ్రీనివాస్లు తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణీలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సి.హెచ్.ఓ. వసంతరావు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, ఆయుష్ సిబ్బంది జిలానీ, లక్ష్మినారాయణ, యోగా టీచర్లు రమేష్, పద్మశ్రీ పాల్గొన్నారు.

## నదీ పరివాహక ప్రాంతంలో భక్తులు జాగ్రత్తలు పాటించాలి



అమరావతి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : ఎగువ నీరు దిగువకు అధికంగా రావడంతో నదీ ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో నదీలో దిగరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన పంపుల వద్ద మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని సూచించారు. కృష్ణానది పరిసర ప్రాంతాల వైపు దూరంగా ఉండాలని భక్తులకు, ప్రజలకు సూచించారు.

## పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి



పెదకూరపాడు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : మండలంలోని గారపాడు, లింగంగుంట్ల గ్రామాలలో మంగళవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూపర్వైజర్ మాధవి తెలియజేశారు. అంగన్వాడీలో అందించే కోడిగుడ్లు, ఆకుకూరలు, భోజనం తినడం ద్వారా పౌష్టికంగా ఉంటారని సూపర్వైజర్ పెద్ద హిమంబి అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైక్ దొంగలు అరెస్ట్

నకరికల్లు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త : బైక్ దొంగనాలు చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సత్తెనపల్లి డిఎస్పీ ఎం.హనుమంతరావు, సి.ఐ. కిరణ్, ఎస్.ఐ.లతో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. దొంగతనం చేస్తున్న ముఠా నుండి 35 బైక్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.25,75,000 వేలు ఉంటుందన్నారు. నకరికల్లుకు చెందిన మున్నంగి కిషోర్రెడ్డి, ఫిరంగిపురంకు చెందిన వలిశెట్టి కార్తీక్, వంగా మహేష్రెడ్డి, తిరుమలరెడ్డి, తెల్లగొర్ల అనీల్ ఈ ముఠాలో ఉన్నట్లు తెలిపారు. నకరికల్లులో - 6, రాజుపాలెంలో -6, ముప్పాళ్ళలో -4, అద్దంకిలో -1, యర్రగొండపాలెంలో-2, విశాఖపట్నంలో-1, నరసరావుపేట-1, క్రోసూరు, నాదెండ్ల, వినుకొండలలో ఒక్కొక్కటి చొప్పున చోరీ చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన మోటార్ సైకిల్స్ను చల్లగుండ్ల గ్రామ పరిధిలోని గుర్రాలకొండ వెనుక వైపు ఉన్న క్వారీలో దాచిపెట్టడం జరిగిందన్నారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీస్ అధికారులు తెలియజేశారు.

24-9Pg5 9_24-9Pg5.qxd 9/23/2025 10:06 PM Page 1



# ఆయుష్మాన్ భారత్.. ఆరోగ్య విప్లవం

## ప్రజలకు రూ.5 లక్షల దాకా ఉచిత ఆరోగ్య బీమా అందిస్తున్నాం: ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పేద, ధనిక తేడా లేకుండా ప్రజలందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ఓ విప్లవమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఆ పథకం ప్రజారోగ్య రంగంలో విప్లవాన్ని సృష్టించిందని, లబ్ధిదారులకు ఆర్థిక రక్షణ, గౌరవాన్ని నిర్ధరిస్తుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ అమల్లోకి వచ్చి నేటితో ఏడు సంవత్సరాలు పూర్తి కాగా, మోడీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. నేటితో మనం ఆయుష్మాన్ భారత్ పథకం మొదలుపెట్టి 7 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాం. ఇది భవిష్యత్తు అవసరాలను ముందుగానే ఊహించి, ప్రజలకు అత్యున్నత నాణ్యతతో పాటు సరసమైన ఆరోగ్య సంరక్షణను నిర్ధరించడంపై దృష్టి సారించి తీసుకున్న ఒక కార్యాచరణ అని ప్రజారోగ్య రంగంలో ఒక విప్లవాన్ని చూస్తోంది. ఆయుష్మాన్ భారత్ ఆర్థిక రక్షణ, గౌరవాన్ని నిర్ధరించింది" అని మోడీ తెలిపారు. సాంకేతికత, మానవ సాధికారతను భారత్ఎలా మరింత ముందుకు తీసుకువెళుతుందో ఆ పథకం ప్రపంచానికి చూపించింది" అని మోడీ అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం 55 కోట్లకు పైగా పౌరులకు వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య హామీ పథకంగా ప్రశంసించింది. ఇప్పటివరకు 42 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు జారీ అయ్యాయని చెప్పింది. లక్షలాది కుటుంబాలను రక్షించిన ఆయుష్మాన్ భారత్ ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల ప్రభుత్వ ఆరోగ్య వ్యయం 29 శాతం నుంచి 48 శాతానికి పెరిగిందని, ప్రజల ఖర్చు 63 శాతం నుంచి 39 శాతానికి తగ్గిందని చెప్పింది. అనారోగ్యం సమయంలో లక్షలాది కుటుంబాలను రక్షించిందని వెల్లడించింది. అనారోగ్యం వచ్చినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ధ్యేయంతో మొదలుపెట్టామని తెలిపింది. ఏటా ఆరు కోట్లకు పైగా కుటుంబాలను రక్షించిందని పేర్కొంది. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని 2018 సెప్టెంబర్‌లో కేంద్రం లాంఛనంగా ప్రారంభించింది. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతారు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు.

ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. సిజిహెచ్ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పథ కాల కింద ఉన్న వయోవృద్ధులు వాటినిగానీ, ఎబిపిఎంజెఎవైనిగానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు. ఈ పథకం కింద దేశంలోని పేద కుటుంబాల్లోని ప్రతి సభ్యునికి ఆయుష్మాన్ కార్డు అందిస్తారు. ఈ కార్డుతో ఆసుపత్రిలో చేరినప్పుడు రూ. 5లక్షల వరకు వైద్యసేవలు ఉచితం.



## కోర్టులు బకాయిలు వసూలుచేసే
# రికవరీ ఏజెంట్లు కాదు
## సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** న్యాయస్థానాలు బకాయిలు వసూలుచేసే రికవరీ ఏజెంట్లు కాదని సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ఈ ధోరణి మంచిది కాదని అసహనం వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కేసును విచారిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది. డబ్బు రికవరీ అనేది సివిల్ వివాదమని, సివిల్ వివాదంలో అరెస్టును ఒక సాధనంగా ఉపయోగించరాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. డబ్బు తీసు కున్న వ్యక్తి ఆ డబ్బు రికవరీకి వెళ్లిన వ్యక్తిని కిడ్నాప్ చేశాడని యూపికి చెందిన ఓ కేసులో పోలీసులు అభియోగాలు మోపడంపై కోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. క్రిమినల్ చట్టాలను దుర్వినియోగం చేస్తోన్న సంప్రదాయాన్ని ఈకేసు ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించింది. న్యాయం చేసే విధానానికి ఈ కేసు తీవ్ర ముప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. బకాయిల మొత్తాన్ని వసూలు చేయడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కావని, న్యాయవ్యవస్థ దుర్వినియోగాన్ని అనుమ తించబోమని కోర్టు స్పష్టంచేసింది. ఎవరినైనా అరెస్టు చేసే ముందు తమ వద్దకు వచ్చిన ఆ కేసు క్రిమినలా సివిలా అని పోలీసులు సరిగా పరిశీలిన చేయాలని సూచించింది.

ఇలాంటి కేసులు పోలీసులను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టివేస్తా యని పేర్కొంది. సివిల్ వివాదాల్లో వేధింపుల సాధనంగా క్రిమినల్ చట్టాలను ఉపయోగించకుండా నిరోధించేందుకు తెలివిగా వ్యవహరించాలని యూపి ప్రభుత్వ తరఫు న్యాయవాదికి సుప్రీంకోర్టు సూచించింది. పోలీసులు తమవద్దకు వచ్చిన కొన్ని క్లిష్టమైన కేసులు సివిలో క్రిమినలో తెలుసుకునేందుకు పదవీ విరమణ పొందిన న్యాయమూర్తులను జిల్లాలకు ఒకరు చొప్పున నోడల్ అధికారులు నియమించవచ్చని సలహా ఇచ్చింది.



# మహిళా పోలీసుల ఎన్‌కౌంటర్

## దోపిడీ దొంగ అరెస్టు

### బైక్, ఫోన్, ట్యాబ్ స్వాధీనం


**ఘజియాబాద్, సెప్టెంబర్ 23:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆదివారం రాత్రి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ పోలీస్ చెక్ పోస్ట్ వద్ద అనుమానితుడు బైక్‌పై వెళ్తుండగా, అడ్డుకున్న పోలీసులపై కాల్పులకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలికి తూటా తగిలి కింద పడిపోయాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు 22ఏళ్ల జితేంద్రపై స్నాచింగ్, దోపిడీ, దొంగతనం తదితర కేసులు ఉన్నాయి. పోలీసుల విచారణలో నిందితుడు ఢిల్లీ-ఎన్సీ ఆర్ ప్రాంతంలో బైకులు, స్కూటర్లు దొంగలిస్తున్నాడు. ఫోన్లు, ట్యాబ్స్ తదితర ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగలించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి బైక్‌తోపాటు ఓఫోన్, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఇవన్నీ కూడా దొంగలించినవేనని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులంతా మహిళలే కావడం విశేషం. ఘజియాబాద్‌లో తొలిసారి మహిళా పోలీసులు ఎన్‌కౌంటర్‌లో పాల్గొనడం ఉత్తం ప్రదేశ్ చరిత్రలో మొదటిసారి అని సీనియర్ పోలీస్ అధికారి ఉపాసన పాండే తెలిపారు.

# భరణంకోసం గొంతెమ్మ కోరికలు అనుచితం

## పట్టుబడితే ప్రతికూల తీర్పులు ఎదుర్కోవాలి: 'సుప్రీం' ధర్మాసనం హెచ్చరిక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పెళ్లైన 14 నెలల్లోనే విడాకులు కోసం దరఖాస్తు చేసిన ఓ వివాహిత తనకు భరణంగా రూ.5 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేయడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మొత్తం కోసం పట్టుబడితే చాలా కఠినమైన తీర్పు తప్పదని జస్టిస్ జేబీ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం ఆ మహిళను హెచ్చరించింది. అమెజాన్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తోన్న ఆమె భర్త విడాకుల సమయంలో భరణంగా రూ.35 లక్షలు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. కానీ, ఆ మహిళ మాత్రం తనకు రూ.5 కోట్లు ఇస్తేనే విడాకుల పత్రంపై సంతకం పెడతానని పట్టుబట్టింది. అయితే, మహిళ తరపు న్యాయవాది విచారణలో ఆమెభర్తతరపు లాయర్ వాదనలను తోసిపుచ్చారు. మధ్యవర్తిత్వ కేంద్రంలో ఈ మొత్తాన్ని తగ్గించారని, తన క్లయింట్ ముందు డిమాండ్ చేసినా తర్వాత రాజీకి వచ్చారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ పార్దీవాలా. భర్త తరపు న్యాయవాదిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆమెను వెనక్కిపిలిచి మీరు పెద్దతప్పు చేస్తున్నారు.. ఆమెను ఎవరూ ఆపలేరు ఆమె కలలు చాలా పెద్దవి" అని వ్యాఖ్యానించారు. భరణంగా రూ.5 కోట్లు కావాలనే డిమాండ్ అమోదయోగ్యం కాదని, అలాంటి వైఖరి ప్రతికూల తీర్పును ఆహ్వానించడమేనని న్యాయమూర్తి అన్నారు. తదుపరి సర్దుబాటు చర్చలకోసం దంపతులు ఇద్దరూ సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రానికి రావాలని అల్టిమేటం జారీచేసింది. ఇదే సమయంలో రూ.5 కోట్ల భరణం డిమాండ్ చేస్తే ప్రతీకూల తీర్పు ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది. గతేడాది ఏప్రిల్‌లో వివాహం చేసుకున్న ఓ జంట విబేధాల కారణంగా విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా భరణంవిషయంలో భార్య గొంతెమ్మ కోరికలు కోరడం గమనార్హం. గతంలోనూ ఓ మహిళ కూడా ఇలాగే తనకు విడాకుల సమయంలో రూ.18 కోట్లు, బీఎండబ్ల్యూ కారు ఇవ్వాలని కోరింది. 14 నెలల కిందటే వివాహం చేసుకుని, ఏడాది పాటే దాంపత్య జీవితం కొనసాగించిన ఈజంట విడిపోవాలని నిర్ణయించుకుంది ఏది ఏమైనా ఇదిదురదృష్టకరం.. కానీ, వివాహబంధం రద్దు కోసం భరణంగా భార్య రూ.5కోట్లు కావాలని డిమాండ్‌చేసినట్టు మాకు సమాచారం ఉంది, భార్య ఇలాంటి పట్టుదలతోనే ముందుకువెళ్తే ఆమెకు వ్యతిరేకంగా ఆదేశాలు ఇవ్వాల్సిరావచ్చు. కాబట్టి ఈ వివాదానికి ముగింపు పలికేలా ఆమోదయోగ్యమైన, సబబైన డిమాండ్లు భార్యపెట్టాలని మేము ఆశిస్తున్నాం'అని జస్టిస్ పార్థీవాలాఅన్నారు. ఇరువర్గాలు అక్టోబర్ 5న సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రంముందు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## ప్రముఖ మలయాళ నటుల ఇళ్లల్లో
# కస్టమ్స్ అధికారుల సోదాలు
### స్మగ్లింగ్‌ద్వారా వచ్చిన హైఎండ్ కార్లు కొన్నట్లు వారిపై ఫిర్యాదులు



**కోచి, సెప్టెంబరు 23:** మలయాళ నటులు దుల్కర్ సల్మాన్, పృథ్విరాజ్‌సుకుమారన్ నివాసాలపై కస్టమ్స్ అధికారులు దాడులుచేశారు. మంగళవారం ఉదయం కోచిలోని వారి నివాసాల్లో సోదాలు చేపట్టారు. లగ్జరీ కార్ల స్మగ్లింగ్ ఆరోపణలకు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా అధికారులు 'ఆపరేషన్ నమకూర్' చేపట్టారు. ఇందులో భాగంగానే దుల్కర్, పృథ్విరాజ్ నివాసాలతో పాటు కేరళలోని 5జిల్లాల్లో 30 చోట్ల సోదాలు జరుపుతున్నారు. ఒక ఆన్‌లైన్ మ్యాగజైన్ కథనం ప్రకారం లగ్జరీ కార్లను భూటాన్ నుంచి అక్రమంగా రప్పించుకున్నారని దుల్కర్, పృథ్విరాజ్‌లపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు భూటాన్ ఆర్మీకి చెందిన హైఎండ్ వాహనాలను కొనుగోలు చేసి అక్రమంగా రీసేల్ చేసే గ్యాంగు నుంచి నటులు ఈ వాహనాలను కొనుగోలు చేసినట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. భూటాన్‌లో నిర్వహించే వేలంలో ఖరీదైన వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, హిమాచల్‌ప్రదేశ్ మీదుగా భారత్‌లోకి తీసుకొచ్చి సెలబ్రెటీలకు అమ్మడమే ఈ ముఠా పని అని అధికారులు గుర్తించారు. అయితే పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసంలో జరిపిన సోదాల్లో అధికారులకు ఎలాంటి ఆధారాలు లభించలేదని సమాచారం. కాగా దుల్కర్‌సల్మాన్‌కు హైఎండ్ కార్ల సేకరణ ఎక్కువఇష్టం. ఇందుకోసం ఆయన ప్రత్యేక గ్యారేజినే ఏర్పాటుచేసు కున్నారు. పోర్షే, మెర్సిడిస్, బిఎండబ్ల్యులతోపాటు అత్యంత అరుదుగా కనిపించే హైఎండ్ లగ్జరీ వాహనాలను సేకరిస్తారని ఇందుకు ఆయనే స్వయంగా ఎక్స్‌లో పోస్టుపెట్టినట్లు సమాచారం.



# చుక్కల్లో పసిడి

### 5 రోజుల్లో రూ. 2,600 పెరిగి
### 10 గ్రా. రూ. 1,14,330కి చేరిన ధర

#### బంగారాన్ని దాటేసిన వెండి.. కిలో రూ. 1,49,00 పైనే

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23:** పసిడి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి బంగారం అందని ద్రాక్షగా మిగిలిపోతున్నది. బంగారం రేటు తగ్గేదేలే అంటూ దూసుకుపోతోంది. దీపావళి నాటికి బంగారం ధరలు భారీగా పెరుగుతాయని అనుకుంటే, అంతకన్నా ముందే గోల్డ్ రేట్ షాక్ ఇస్తోంది. మంగళవారం ఒక్కరోజే బంగారం ధర భారీగా పెరిగింది. ఫెడ్ వడ్డీ రేటు ఎఫెక్ట్‌తో బంగారం ధర భారీగా పెరుగుతోంది. గత ఐదు రోజుల్లో తులం బంగారం ధర రూ.2,600 పెరిగింది. దీపావళి నాటికి బంగారం ధర ఎంత పెరుగుతుందా అని అనుకున్నారు కానీ, అంతకన్నా ముందే గోల్డ్ రేట్ భారీగా పెరుగుతోంది. కిలో వెండి ధర ఐదు రోజుల్లో రూ.8,000 పెరిగింది. ఇంకో రూ.1,000 పెరిగితే వెండి లక్షన్నర మార్క్ చేరుకుంటుంది.

సెప్టెంబర్ 23న బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,260 పెరిగి రూ.1,13,070 నుంచి రూ.1,14,330కి తగ్గింది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర కూడా రూ.1150 పెరిగి రూ.1,03,650 నుంచి రూ.1,04,800కి చేరుకుంది. ఇక 18 క్యారెట్ బంగారం ధర రూ.940 పెరిగి రూ.84,810 నుంచి రూ.85,750కి చేరింది. వెండి సైతం పైపైకి బంగారంతో పాటు వెండి ధరలు కూడా అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవాళ కిలో వెండిపై ఏకంగా రూ.1,000 పెరగడంతో ధర రూ.1,49,000కి చేరుకుంది. డిసెంబరు డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ ధర రూ.461 (0.34 శాతం) పెరిగింది. దీంతో 1కేజీ వెండి ధర రూ.1,34,016కి చేరింది. ఎంసీఎక్స్‌లో వచ్చే సంవత్సరం (2026) మార్చి డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ ధర సైతం రూ.508 (0.37 శాతం) మేర పెరిగి, 1కేజీకి రూ.1,35,397కు చేరింది.

**పోటాపోటీగా సిల్వర్, గోల్డ్ రేట్లు పెరుగుదల**


ఇక మల్టీ కమాడిటీ ఎక్స్ఛేంజ్‌లో కూడా "సిల్వర్, గోల్డ్ రేట్ల పెరుగుదలలో వేగం ఏ మాత్రం తగ్గలేదు. వాటి రేట్లు కొత్త రికార్డులను క్రియేట్ చేస్తున్నాయి. లైఫ్ టైం హై లెవల్‌కు బంగారం ధర చేరింది. 15 ఏళ్ల గరిష్ఠ స్థాయికి వెండి రేటు పెరిగింది. గోల్డ్ అక్టోబర్ ఫ్యూచర్స్ ధర 0.35 శాతం అంటే రూ.396 పెరిగి రూ.1,12,626 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే డిసెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ధర 0.17 శాతం అంటే రూ.230 పెరిగి రూ.1,33,785కి వచ్చింది. ఫెడరల్ రిజర్వ్ కామెంట్స్, నవరాత్రి, స్థానికంగా జరిగిన కొనుగోళ్లతో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డాలర్ బలపడుతుండటం, రూపాయి వీక్ అవుతుండటం కూడా బంగారం కొనుగోళ్లను పెంచింది. బంగారాన్ని అత్యంత సురక్షి త పెట్టుబడి సాధనంగా మదుపరులు చూస్తుండటం అతిపెద్ద సానుకూల అంశం" అని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ (కమొడిటీస్) రాహుల్ కలంత్రి విశ్లేషించారు. బంగారం ధరలు పెరుగుతుండటంతో, ఇప్పటివరకు గోల్డ్ కొన్నవాళ్లు ఆఫ్‌లోడ్ చేయడం కన్నా, అలాగే హోల్డ్ చేసేందుకు ఇష్టపడుతున్నట్లు కనిపిస్తోంది. లాభాల బుకింగ్ ఉండవచ్చని అందరూ అనుకున్నారు కానీ, డిమాండ్ ఇంకా పెరుగుతోంది. ఇన్వెస్టర్లకు బంగారం బాగా మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోంది అని ఇండియా బులియన్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) వైస్ ప్రెసిడెంట్, ఆస్పెక్ట్ గ్లోబల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ అక్ష కాంబోజ్ అన్నారు. సాధారణంగా దసరా, దీపావళి పండుగ సీజన్‌లో బంగారం కొనుగోళ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ధనత్రయోదశి రోజు బంగారం కొనేందుకు ఆసక్తి చూపిస్తారు.

# సంక్షిప్తంగా..

## చైనా అత్యున్నత రక్షణ శాస్త్రవేత్త అరెస్టు!

**బీజింగ్, సెప్టెంబరు 23:** చైనాలో కీలక వ్యక్తుల అరెస్టులు కొనసాగుతున్నాయి. తాజాగా ఆ దేశ ఆయుధ వ్యవస్థల కోసం సెమీకండక్టర్లను తయారుచేసిన అత్యున్నత శాస్త్రవేత్త యూ ఫాక్సిన్ అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. ఆయనకు చెందిన ఝిజియాంగ్ మైక్రోవేవ్ టెక్నాలజీ కంపెనీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నెల 21న తమ ఛైర్మన్ ఫాక్సిన్‌ను ది సూపర్‌వైజరీ కమిషన్ ఆఫ్ హవాంగ్‌షి అదుపులోకి తీసుకొన్నట్లు ఝిజియాంగ్ సంస్థ పేర్కొంది. ఈ విషయాన్ని సౌత్‌చైనా మార్నింగ్ పోస్టు కథనంలో వెల్లడించింది. ఫాక్సిన్ ఝిజియాంగ్ యూనివర్సిటీలోని ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఆయన మైక్రోవేవ్ అండ్ మిల్లీమీటర్ వేవ్ రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీలో నిపుణుడు. కమ్యూనికేషన్, నేవిగేషన్, రాడార్ టెక్నాలజీలో ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. దీంతోపాటు గాలియం నైట్రేడ్, గాలియం ఆర్సెనైడ్ సెమీకండెక్టర్లకు అవసరమైన మెటీరియల్‌ను ప్రాసెస్ చేయడంపై కూడా ఫాక్సిన్ పనిచేశారు.

## జర్మనీవైపే మొగ్గుచూపిస్తున్న అత్యధిక భారతీయులు



**బెర్లిన్,సెప్టెంబరు 23:** ఐరోపా దేశాల్లో జర్మనీ అత్యంత ఇష్టమైన దేశంగా మారుతోంది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లోనే భారత పర్యాటకులు జర్మనీలో 5.20 లక్షల మంది బస చేశారని జర్మన్ నేషనల్ టూరిస్ట్ ఆఫీస్ మంగళవారం వెల్లడించింది. ఈ గణాంకాలతో యూరప్‌లో భారతీయులు ఎక్కువగా సందర్శించే టాప్3 దేశాల్లో ఒకటిగా జర్మనీనిలిచింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది జనవరి జూలై మధ్య జర్మనీకి వచ్చే భారత పర్యాటకుల సంఖ్య 5.5 శాతం పెరిగింది. ముఖ్యంగా భారత్ జర్మనీ మధ్య విమాన సర్వీసులు గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 2019తో పోలిస్తే 2024 నాటికి ఇరు దేశాల మధ్య విమానాల రాకపోకలు 26 శాతం అధికమయ్యాయి. మెరుగైన కనెక్టివిటీతో పాటు, ఆధునిక భారత పర్యాటకులను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా సత్ఫలితాలనిచ్చాయని జిఎన్‌టిఓ తెలిపింది.

## ప్రధాని నివాసానికే గుంతల రోడ్డు!: డికె శివకుమార్

**బెంగళూరు, సెప్టెంబరు 23:** బెంగళూరు నగరంలోని అధ్వాన రోడ్లపై వెల్లువెత్తుతున్న విమర్శలను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ గట్టిగా తిప్పికొట్టారు. ఈ సమస్య ఒక్క బెంగళూరుకే పరిమితం కాదన్న ఆయన, దేశ రాజధాని ఢిల్లీని ఉదాహరణగా చూపించారు. తాను ఢిల్లీలో పర్యటించాను. ప్రధానమంత్రి నివాసం ఉండే రోడ్డులోనే ఎన్ని గుంతలు ఉన్నాయో మీడియా గమనించాలని వ్యాఖ్యానించారు. రోడ్లపై గుంతలు ఉండటం దేశవ్యాప్త సమస్య అని, కానీ మీడియా మాత్రం కేవలం కర్ణాటకను లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. దేశమంతటా ఇదే పరిస్థితి ఉంది. గతంలో బిజెపి ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే రోడ్లు ఎందుకిలా ఉంటాయని ఆయన ప్రశ్నించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, తమ సిబ్బంది ప్రతిరోజూ వేలాది గుంతలను పూడ్చివేస్తూనే ఉన్నారని శివకుమార్ స్పష్టం చేశారు. టెక్ హబ్ అయిన బెంగళూరు గుంతల నగరంగా మారిపోయిందంటూ ఇటీవల కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించిన విషయం తెలిసిందే.

## బివైడిలో పూర్తి వాటాలు విక్రయించిన వారెన్ బఫెట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పెట్టుబడుల మాంత్రికుడు, ఇన్వెస్ట్ గురు వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాత్‌వే చైనా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం బివైడిలో తమకున్న పూర్తి వాటాను విక్రయించి, 17 ఏళ్ల సుదీర్ఘ పెట్టుబడికి లాభాల ముగింపు ఇచ్చింది.ఈ ఏడాది మార్చి 31, నాటికి బివైడిలో బెర్క్‌షైర్ హాత్‌వే వాటా పూర్తిగా ముగిసినట్లు స్పష్టమైంది. దీంతో ఆ సంస్థ నుంచి బెర్క్‌షైర్ పూర్తిగా బయటకు వచ్చినట్లయింది. బెర్క్‌షైర్ హాత్‌వే తొలిసారిగా 2008లో బివైడిలో పెట్టుబడులు పెట్టింది. అప్పట్లో కేవలం 230 మిలియన్ డాలర్లతో సుమారు 22.5 కోట్ల షేర్లను (10శాతంవాటా) కొనుగోలు చేసింది. గడిచిన 17 ఏళ్లలో బీవైడీ షేరు ధర ఊహించని రీతిలో పెరిగింది. 2008 సెప్టెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆ కంపెనీ షేరు విలువ ఏకంగా 4500 శాతానికి పైగా వృద్ధి చెందడం విశేషం.

# ఆధార్ నమోదులో కొత్త మార్పులు

## ఇక అన్నీ ఆన్‌లైన్‌లోనే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** దేశవ్యాప్తంగా ఆధార్ వ్యవస్థను మరింత సులువుగా, సురక్షితంగా వినియోగించుకునేందుకు వీలుగా యుఐడిఎఐ మరి కొన్ని మార్పులను ప్రవేశపెట్టనుంది. ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు మార్చుకునేలా ఇటీవలె కొత్త అప్‌డేట్‌ను తీసుకువచ్చారు. ఫలితంగా ఆధార్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్, చిరునామాను సులభంగా ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. దీంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత బయోమెట్రిక్ అథెంటికేషన్‌లో కూడా కీలక మార్పులు తీసుకువచ్చింది ఆధార్ సంస్థ. ఇప్పటి వరకు ఉన్న ఫింగర్ ప్రింట్, కంటి ఐరిస్ స్కాన్‌నుఇప్పుడు మరింత ప్రతిభావంతంగా పనిచేసేలా మార్పులు చేశారు. ఫలితంగా బ్యాకింగ్, ఇన్సూరెన్స్‌తో పాటు ఇతర సేవలు ఉపయోగించే సమయంలో సులభంగా, వేగంగా పనులు పూర్తిచేసుకోవచ్చు. ముఖ్యంగా ప్రజల గోప్యతను దృష్టిలో పెట్టుకుని మాస్క్‌డ్ ఆధార్‌ను వినియోగించేలా ప్రచారం చేస్తుంది. ఇందులో12అంకెల పూర్తిఆధార్‌నంబర్ కాకుండా చివరి నాలుగు నంబర్లు మాత్రమే కనిపిస్తాయి. దీనివల్ల యూజర్ల ప్రైవసీ భద్రంగా ఉంటుందని అంటున్నారు. బ్యాకింగ్ రంగంలో ముఖ్యమైన ఈ కెవైసి ప్రక్రియను మరింత సులభంగా మార్చారు. ఫలితంగా కొత్త బ్యాంక్ ఖాతా, మొబైల్ కనెక్షన్, లేదా ఏదైనా ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. పాన్, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డును లింక్‌చేసినప్పటి నుంచి ట్యాక్స్, ఆర్థిక సేవలకు సంబంధించిన మోసాలు తక్కువవయ్యాయి. ఆధార్‌ను మరింత సురక్షితంగా, ఆధునికంగా మార్చేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అనేక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే త్వరలోనే కొత్త మార్పులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో ముందుగా బయోమెట్రిక్ వెరిఫికేషన్‌లో భాగంగా ఫేస్ అథెంటికేషన్ ఫీచర్‌ను తీసుకురానుంది.

# చుక్కలమందుతో కంటిచూపు మెరుగు!

### అర్జెంటీనా శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడి



**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 23:** అర్జెంటీనాలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆఫ్ ప్రెస్‌బ్యోపియాకు చెందిన పరిశోధకులు ఈ కంటి చుక్కల మందును తయారు చేశారు. ప్రెస్‌బ్యోపియా సమస్యను సర్జరీ అవసరం లేకుండా, కళ్లద్దాలు వాడకుండా ఓ పరిష్కారం కనుగొనడం కోసం వీరు చాలా కాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో దగ్గరి చూపును తిరిగి పొందేందుకు ఐ డ్రాప్స్‌ను అభివృద్ధి చేశారు. ఇటీవల జరిగిన యురోపియన్ సొసైటీ ఆఫ్ కాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్స్ 43వ కాంగ్రెస్‌లో అర్జెంటీనా పరిశోధకులు తాము డెవలప్ చేసిన కంటి చుక్కల మందు గురించి వివరాలను వెల్లడించారు. ఈ కంటి చుక్కలు వేసుకుంటే సర్జరీ, కళ్లద్దాలతో పనిలేదు. వెల్లడించారు. ఈ మందులో ఉండే పిలోకార్పైన్ అనే పదార్థం కంటి ప్యూపిల్‌ను చిన్నగా చేస్తుంది. అన్‌ఫోకస్డ్ లైట్ కంట్లోకి రాకుండా చేస్తుంది. దగ్గరి, దూరం వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయి. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మెడిసిన్ డైక్లోఫెనాక్ కూడా ఉంటుంది. ఈ రెండింటినీ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌లో కలుపుతారు. ప్రెస్‌బ్యోపియా ఉన్న 766 మంది వలంటీర్లకు ప్రయోగాత్మకంగా ఈ చుక్కల మందును ఇచ్చి చూశారు. 1 నుంచి 3 శాతం సాంద్రతలో పిలోకార్పైన్‌ను ఉపయోగించారు. ఈ మందు వేసుకున్న వారిలో 80-90 శాతం మంది తమ దగ్గరి చూపు మెరుగుపడిందని చెప్పారు. ఈ కంటి చుక్కలు వేసుకున్న గంటలోపే కొందరు వలంటీర్లు నియర్ విజన్ చార్ట్‌లో (కంటిచూపు పరీక్ష) 23 లైన్లు ఎక్కువ చదవారట. ఈ ఐ డ్రాప్స్ వలంటీర్లపై సమర్థంగా పనిచేశాయని కానీ కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ వచ్చినట్లు పరిశోధకులు తెలిపారు. కొందరిలో కొద్దిగా మసకగా కనిపించడం, చికాకు అనిపించినట్లు కానీ కొద్ది సేపటికే వాటికవే తగ్గినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కంటి చుక్కల మందు ఇప్పటి వరకు మంచి ఫలితాలు ఇచ్చినా దీనిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉందని పరిశోధకులు అంటున్నారు. ఈ చుక్కల మందును ఏళ్ల తరబడి ప్రతి రోజూ వాడితే.. కంటిపై ప్రతికూల ప్రభావం చూపుతుందా లేదా అనే విషయం తేలాల్సి ఉంది. దీని వల్ల కాటరాక్ట్, రెటీనల్ సమస్యల వస్తాయా? అనేది విషయంలోనూ స్పష్టమైన సమాచారం లేదు. ఈ కంటి చుక్కల మందును అందరూ ప్రతిరోజు వాడొచ్చని తేల్చడానికి దాదాపు 5 సంవత్సరాల ఫాలోఅప్ టెస్టింగ్ అవసరమని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 180 కోట్ల మంది ప్రెస్‌బ్యోపియా సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో చాలా మందికి కళ్లద్దాలు కూడా అందుబాటులో లేవు. ప్రస్తుతం సైంటిస్టులు చేస్తున్న ప్రయోగాలు ఫలిస్తే.. భవిష్యత్తుల్లో లక్షలాది మందికి సర్జరీ, రీడింగ్ గ్లాసెస్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. కేవలం కొన్ని చుక్కలు కంటి మందు వేసుకుంటే సరిపోతుంది. కంటిచూపు మెరుగుపరిచే పరిశోధనల్లో ఇదో కీలక ముందడుగు. శాస్త్రవేత్తల ప్రయోగాలు ఫలిస్తే మరి కొన్నేళ్లలోనే కేవలం కంటి చుక్కల మందుతోనే కంటి చూపు మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుంది.

24-09pg6exHMNWJQE 10_24-09pg6exHMNWJQE.qxd 9/23/2025 10:47 PM Page 1





పూర్ణ కుంభంతో అచ్చెన్నాయుడుకు, రామ్మోహన్‌నాయుడులకు స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

## వైభవంగా కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు

**- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు**

**కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన శ్రీకాకుళం జిల్లాలోని కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది జాతర ఉత్సవాలు మంగళవారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కోరాడ చిన్నగోవిందలు స్వాగతం పలకగా వేదపురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు పూర్ణకుంభంతో వేదమంత్రోచ్చరణల మధ్య ఆలయంలోనికి తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహ్మద్ ఖాన్, ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి, కింజరాపు హరివరప్రసాద్, హరిప్రభాకర్, టీడీపీ నాయకులు రామకృష్ణ, వెలమల విజయ లక్ష్మి, దేశం నేతలు బోయిన గోవిందరాజులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నవరాత్రులలో దేవి పూజల ద్వారా
# అమ్మవారి అనుగ్రహం



రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 23, ప్రభాతవార్త: నవరాత్రులలో దేవి పూజలు చేయడం ద్వారా శ్రీ లలితాంబికా దేవి అనుగ్రహం లభిస్తుందని భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో రెండవ రోజైన మంగళవారం ఉదయం 5 గంటలకు గర్భాలయంలోని శ్రీ లలింతాభికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహాసరస్వతీ దేవిలకు, శ్రీ మహాగణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వరల స్వాములకు అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. ఉదయం 6.30కి వేదపారాయణం, శ్రీ మహారుద్రాభిషేకం, శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహాసరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ముగ్గురమ్మలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు కావలసిన భోజన, వసతీ ఏర్పాట్లను ఆలయ నిర్వహకులు పులిపాటి విజయ్ భరత్, విజయ్ గోకుల్, సింధు, సౌమ్య, తదితరులు పర్యవేక్షించారు.

## దసరా సందర్భంగా మహిళా మంత్రులు,
# ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల డ్రెస్ కోడ్

**● అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు దీక్షలోనే ఉంటామన్న మంత్రులు అనిత, సవిత**

**విజయవాడ సెప్టెంబర్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ, శాసన మండలిలో కూటమి మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డ్రెస్ కోడ్ పాటిస్తున్నారు. దేవీ నవరాత్రులు సందర్భంగా కూటమి మహిళా నేతలు ఎర్ర దుస్తుల్లో అసెంబ్లీకి వచ్చారు. నవరాత్రుల సందర్భంగా రోజుకో కలర్ కోడ్ డ్రెస్‌తో అసెంబ్లీకి రావాలని మహిళా సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో గాయత్రీదేవి అలంకారం సందర్భంగా రెడ్ కలర్ కోడ్ దుస్తుల్లో కూటమి పార్టీల మహిళ సభ్యులు సభకు వచ్చారు. నేటి ఉదయం దుర్గమ్మ గుడికి వెళ్లిన కూటమి మహిళా నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ. అసెంబ్లీ, శాసన మండలిలో కూటమి మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డ్రెస్ కోడ్ పాటిస్తున్నారని మంత్రి తెలిపారు. దేవీ నవరాత్రులు సందర్భంగా కూటమి మహిళా నేతలు ఎర్ర దుస్తుల్లో అసెంబ్లీకి వచ్చారు. నవరాత్రుల సందర్భంగా రోజుకో కలర్ కోడ్ డ్రెస్‌తో అసెంబ్లీకి రావాలని మహిళా సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో గాయత్రీదేవి అలంకారం సందర్భంగా రెడ్ కలర్ కోడ్ దుస్తుల్లో కూటమి పార్టీల మహిళ సభ్యులు సభకు వచ్చారు. నేటి ఉదయం దుర్గమ్మ గుడికి వెళ్లిన కూటమి మహిళా నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలు గురించి మంచి సందేశం వెళ్లాలనే డ్రెస్ కోడ్ పాటిస్తున్నామని చెప్పారు. అందరు గాయత్రీ దేవి అలంకారానికి అనుగుణంగా రెడీ శారీస్‌తో వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని చల్లగా చూడాలని దుర్గమ్మను వేడుకున్నామన్నారు. దుర్గా నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎవరికీ



దసరా సందర్భంగా మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాటిస్తున్న డ్రెస్ కోడ్‌తో చీరలు ధరించిన దృశ్యం

ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. మన సంస్కృతి సంప్రదాయాలు గురించి మంచి సందేశం వెళ్లాలనే డ్రెస్ కోడ్ పాటిస్తున్నా మని చెప్పారు. అందరు గాయత్రీ దేవి అలంకారానికి అనుగుణంగా రెడీ శారీస్‌తో వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని చల్లగా చూడాలని దుర్గమ్మను వేడుకున్నామన్నారు. దుర్గా నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగు తున్నాయని తెలిపారు. ఎవరికీ ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందరికి హోం మంత్రి అనిత, బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత నవరాత్రి ఉత్సవాలు శుభాకాంక్షలు తెలిపారు.

# జగన్ ప్రభుత్వంలో 3,116 తప్పుడు కేసులు

**- రాజకీయ, మీడియా, అమరావతి ఉద్యమకారులపైనే అత్యధికం - మండలిలో హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి**

**విజయవాడ, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం అమలు చేసిన తప్పుడు, అక్రమ కేసులపై శాసన మండలిలో చర్చ జరిగింది. కొణిదెల నాగబాబు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ కాలంలో అమరావతి రైతులు రాజధాని కోసం పోరాడితే వందలాది మందిపై కేసులు పెట్టారని, తనపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడంతో కడప కోర్టుకు హాజరయ్యానని తెలిపారు. గత ప్రభుత్వ చీకటి జీవోలు తెచ్చే సంస్కృతిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగించదని స్పష్టం చేశారు. అన్ని కేసులను లా ప్రకారం పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యమించిన టీచర్లపై నమోదైన కేసుల్లో 80 శాతం ఎత్తివేశామని, మిగిలిన కేసుల పరిష్కారానికి కూడా చర్యలు కొనసాగుతున్నాయని ఆమె వెల్లడించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2019 నుండి 2024 మధ్యకాలంలో మొత్తం 3,116 తప్పుడు కేసులు పెట్టిందని హోంమంత్రి



వంగలపూడి అనిత శాసన మండలిలో వెల్లడించారు. ఈ కేసుల్లో రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు, సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై అభిప్రాయాలు వ్యక్తం చేసిన సాధారణ ప్రజలపై కూడా కేసులు పెట్టారని ఆమె చెప్పారు. కేవలం ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే, సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకే లేదా ఫార్వార్డ్ చేసినందుకే ప్రజలపై కేసులు పెట్టారు అని ఆమె విమర్శించారు. అమరావతి రైతులు రాజధాని కోసం చేసిన ఉద్యమంలో వందలాది కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. ఈ కేసుల్లో కొన్ని విచారణ దశలో ఉండగా, మరికొన్ని ట్రయల్ పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని కేసులు కోర్టుల పరిధిలో విచారణలో ఉన్నాయి అని వివరించారు.

ఈ వ్యవహారంపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీస్ శాఖ, న్యాయ శాఖలతో సమన్వయంగా సమావేశమై కేసుల పరిష్కారంపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అంతేకాకుండా ఇటీవల సాక్షి పత్రికలో ఎన్డీయే కూటమి సభ్యుల్లో 94శాతం మందిపై కేసులున్నాయన్న వార్తలపై స్పందిస్తూ, వారు గుర్తించాల్సింది ఒక్కటే - మా నాయకులపై కోడి కత్తి కేసులు, గొడ్డలి వేటు కేసులు, లేదా తల్లి, చెల్లెలు పేరుతో పెట్టిన పర్సనల్ కేసులు లేవు. ఇవన్నీ రాజకీయ కేసులే. గత ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎత్తిచూపినందుకు మాత్రమే ఈ కేసులు నమోదయ్యాయి అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.



## దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యునిగా అట్లూరి రాజశేఖర్

96 మందితో సేవా కమిటి

**విజయవాడ, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రుల ఉత్సవ సేవా కమిటీ సభ్యునిగా సీనియర్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే నాయకులు అట్లూరి రాజశేఖర్ నియమితులయ్యారు. శరన్నవరాత్రుల్లో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా దుర్గమ్మ దర్శనం సజావుగా జరిగేలా ఆలయంలో పలు కమిటీలు నియమిస్తుంటారు. దీనిలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి 96 మందితో సేవా కమిటిని ఏర్పాటు చేసారు. ఈ కమిటీలో బాపులపాడుకు చెందిన రాజశేఖర్‌ను నియమించారు. నవరాత్రులలో తనకు దుర్గమ్మసేవ చేసే అవకాశం కల్పించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. కాగా అట్లూరి గత 22 సంవత్సరాలుగా 'వార్త' జాతీయ దినపత్రికలో గన్నవరం పాత్రికేయునిగా పనిచేస్తున్నారు.

**శ్రీరాముడిపై ప్రమాణం చేస్తున్నా...**

# క్వారీలతో నాకెలాంటి సంబంధం లేదు!

**● శాసనసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరావు**



**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నా ఆరాధ్య దైవమైన శ్రీరాముడి పై ప్రమాణం చేస్తున్నా... క్వారీల గ్రావెల్ తవ్వకాలపై నాకు ఎటువంటి ఫైనాన్స్ లావాదేవీలు లేవని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరావు అన్నారు. సోమవారం శాసన సభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో గ్రావెల్ కొండలు ఎక్కువగా ఉన్నాయని గత వైసీపీ ప్రభుత్వం క్వారీల తవ్వకాల అనుమతులు ఆ పార్టీ మద్దతుదారులే పొందారు. మన కూటమి ఎమ్మెల్యే గత ఏడాది జూన్ 4న ఎన్నికైనప్పటికీ మరుసటి రోజున ఉదయం 10గంటలకు మైనింగ్ డీడీ వైసీపీ మద్దతుదారునికి ఒక క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ క్వారీ తవ్వకాలపై ఎచ్చెర్ల నియోజకవర్గంలో కూటమి నాయకులంతా వ్యతిరేకించి తవ్వకాలను అడ్డుకోవడంతో స్థానిక తహసీల్దార్, పోలీస్ సిబ్బంది ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ తవ్వకాలు ఆపడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. అంతేకాకుండా క్వారీ తవ్వకాలకు అనుమంతి పొందిన వైసీపీ మద్దతుదారునికి నా పక్క నియోజకవర్గం మన కూటమి ఎమ్మెల్యే మద్దతుగా నిలవడం బాధాకరంగా ఉందని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. అంతేకాకుండా నాపై లేనిపోని ఆరోపణలతో వివిధ పత్రికల్లో, టీవీ చానల్స్‌లో కథనాలు రాయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. ఈ క్వారీ తవ్వకాలపై విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.



## రాపూరులో 21 శతాబ్దం నాటి పోత్తాపి చోళుల శిలాశాసనం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా రాపూరు మండలం మునగాల వెంకటాపురం గ్రామ సమీపాన గల అటవీ ప్రాంతంలో మంగళవారం 12వ శతాబ్దం నాటి శిలాశాసనం గుర్తించినట్లు జిల్లాకు చెందిన ప్రహుక చరిత్రకారుడు షేక్ రసూల్ అహమద్ తెలిపారు. స్థానికలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ప్రాంతంలో కేంద్ర పురావస్తు అధికారుల బృందంతో సంయుక్తంగా పర్యటించి ఈ శిలాశాసనం గుర్తించినట్లు చెప్పారు. ఈ ప్రాంతం వెయ్యేళ్ళ క్రింతం జనావాసాలతో వర్ధిల్లినట్లు ఈ చారిత్రాత్మక అవశేషాలను బట్టి తెలుస్తుందన్నారు. గ్రామానికి ఉత్తరాన గల అటవీ ప్రాంతంలోని దేవల్ల దిబ్బ సమీపంలోని శిధిలమైన శివాలయ ప్రాంతంలో శాసనాన్ని గుర్తించడం జరిగినట్లు ఈయన తెలిపారు. 4 అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పు గల గ్రానైట్ రాతిపై 3 వైపుల చెక్కబడిన ఈ శాసనంలో పోత్తాపి చోళుల పాలన కడప, చిత్తూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు విస్తరించినట్టుగా, అలాగే ఆయా ప్రాంతాలలో వివిధ ఆలయాలు నిర్మించినట్లుగా తెలుస్తుందని కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ చెన్నై శాసన విభాగ అధికారి డాక్టర్ యం. యేసు బాబు తెలిపారు. ఈ శాసనం ద్వారా పోత్తాపిచోళ రాజైన నల్లసిద్ధదేవ మహారాజు 12వ శతాబ్దానికి చెందిన చోళ చక్రవర్తి వీర రాజేంద్రునికి సమకాలీనుడుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ శిలాశాసనం కొంత శిథిలమవడంతో అనేక చారిత్రక విషయాలు మరుగున పడ్డాయని యేసుబాబు తెలిపారు. ఈ శిలా శాసనం చరిత్ర పునర్నిర్మాణానికి ఎంతో ముఖ్యమైనది కనుక దీనిని భద్రపరచవలసిన బాధ్యతను గ్రామస్తులకు, పురావస్తు శాఖ అధికారులకు కోరామన్నారు. పురావస్తు బృందం, చరిత్ర పరిశోధకుడు కార్తీక్ రెడ్డి, గ్రామస్తులు పెంచలయ్య, ప్రసాద్ తదితరులున్నారు.

# ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళన

**● కాలుష్య పరిశ్రమలు తక్షణం మూసివేయాలి ● బీచ్ రోడ్డులో బైఠాయింపు... రాస్తారోకో ● డిప్యూటీ సీఎం హామీ ఇచ్చే వరకు కదలం**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం ఉప్పాడ సెంటర్‌లో మత్స్యకారులు మంగళవారం తీవ్ర ఆందోళన చేపట్టారు. సముద్ర తీర ప్రాంతంలో పరిశ్రమల నుండి నుండి వ్యర్థ పదార్థాలను సముద్రంలోకి తరలించడం వలన మత్స్య సంపద నాశనం అవుతున్నదని, తీరప్రాంతంలోని నిర్మించిన పరిశ్రమలను తక్షణం మూసివేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై మహిళలు, మత్స్యకార కుటుంబ సభ్యులు బైఠాయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చేవరకు రాస్తారోకో కొనసాగిస్తామన్నఆరు. ఫార్మా కంపెనీలు, పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యం కారణంగా సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద లభించక జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నామని మా ఆకలి కేకలు వినండని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాదు గ్రామాల మత్స్యకారులు




కుటుంబాలతో సహా ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ప్లకార్డులతో బైఠాయించి మంగళవారం ఆందోళన నిర్వహించారు. గత 6 నెలలుగా మత్స్య సంపద లభించక కుటుంబాలు వస్తులుండే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

**అధికారులు చర్చలు విఫలం**

ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులతో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవో మల్లిబాబు, ఇన్‌చార్జి పాడా పీడీ వేణుగోపాలరావు జరిపిన చర్చలు సఫలం కాలేదు.

**వెనుదిరిగిన కలెక్టర్ షన్మోహన్**

మత్స్యకారులతో అధికారులు చర్చలు కొలిక్కి రాకపోవడంతో జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి విచ్చేసి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. మత్స్యకారులతో చర్చించడానికి సంప్రదింపులు జరపగా విముఖత వ్యక్తం చేయడంతో కార్యాలయం నుండే కలెక్టర్ వెనుదిరిగి వెళ్ళిపోయారు.

**డిప్యూటీ సీఎం హామీ ఇచ్చే వరకు ఆందోళన**

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వచ్చి తమ సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చే వరకూ ఆందోళన విరమించేదిలేదని మత్స్యకారులు చెప్పారు. ఆయన మత్స్యకారులు అభివృద్ధికి కృషి చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. దీంతో నేడు కూడా ఆందోళన కొనసాగుతుందని మత్స్యకారులు తెలిపారు.

## రైల్వే పెన్షనర్లు తమ సమస్యలను నెలాఖరులోగా తెలపాలి

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు డివిజన్ పరిధిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు తమ తమ సమస్యలను ఈనెల 30 లోగా తెలియ జేయాలని అఖిల భారత రైల్వే పెన్షనర్ల సంక్షేమ సమాఖ్య (ఏఐఆర్‌పీడబ్ల్యూఎఫ్) డివిజనల్ కార్యదర్శి ఎస్. మస్తాన్ వలీ, కోశాధికారి వి.సాయి శేఖర్ తెలిపారు. రైల్వే మంత్రిత్వ శాఖ, గుంతకల్లు రైల్వే డివిజన్‌లో డిసెంబర్ 15న పెన్షన్ అదాలత్ ను నిర్వహించనున్న నేపథ్యంలో పెన్షనర్లు తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన 2006 తర్వాత నుంచి నోషనల్ ఇంక్రిమెంట్‌లను పొందేందుకు సంబంధించి జూన్ 30, డిసెంబర్ 31 తేదీల్లో పదవీ విరమణ చేసిన పెన్షనర్లు జనవరి 1, జులై 1ల నుంచి నోషనల్ ఇంక్రిమెంట్‌లను పొందేందుకు అర్హులు. వీరికి నోషనల్ ఇంక్రిమెంట్‌లనుమంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, అనేక మంది పెన్షనర్లకు నోషనల్ ఇంక్రిమెంట్‌లను స్థానిక డివిజనల్ అధికారులు మంజూరు చేయడంలో తీవ్ర అలసత్వం వహిస్తున్న కారణంగా పెన్షనర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అలాగే సెకండరీ ఫ్యామిలీ పెన్షన్, ఉమ్మీద్ కార్డ్‌ల వంటి సమస్యలను పేర్కొంటూ, తమ సర్వీసు సర్టిఫికెట్ తమ సమస్యలకు సంబంధించిన రైల్వే అధికారులు జారీచేసిన ఆఫీస్ ఆర్డర్‌లను, ఇందుకు సంబంధించిన పత్రాలతో ఈనెల 30, అక్టోబర్ 15లోగా రైల్వే గ్రౌండ్ సమీపంలో ఉన్న రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం ఆవరణలోని తమ ఏఐఆర్‌పీడబ్ల్యూఎఫ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వీటికి సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే డివిజనల్ కార్యదర్శి ఫోన్ నెంబర్ 98484 11632కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. బాధితుల సమస్యలను పరిశీలించి బాధిత పెన్షనర్ల సమస్యలను వివరిస్తూ, పేర్కొంటూ దరఖాస్తులను రూపొందించి రైల్వే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పెన్షనర్లకు న్యాయం చేకూర్చిందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

## కుల గణన సామాజిక న్యాయం పుస్తకావిష్కరణ



**విజయవాడ ,సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** బీసీల అభ్యున్నతికి టీడీపీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కుల గణన సామాజిక న్యాయం పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాజానికి బీసీలు వెన్నుముక వంటివారన్నారు. వారి అభ్యున్నతి కోసమే ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆనాటి నుంచి బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా పార్టీ కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు బలహీన వర్గాలను రాజ్యాధికారంలోనూ, పాలనలోనూ భాగస్వామ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. బీసీ కుల గణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కుల గణనతో బీసీలకు ఎంతో మేలు కలుగుతుందని మంత్రి సవిత అభిప్రాయపడ్డారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలకు ఏవిధంగా న్యాయం జరగాలో కుల గణన సామాజిక న్యాయం పుస్తకంలో విపులంగా వివరించారన్నారు. ఈ పుస్తకావిష్కరణలో రచయిత నెల్లూరు నర్సింహారావు, ప్రచురణ కర్త కోయ చంద్రమోహన్, తోట నర్సింహలు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



**అంబాజీపేట, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** అంబాజీపేటకు చెందిన నిమ్మకాయల ఎస్.ఎస్.ఎస్. శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా మరోసారి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందినట్టు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన ప్రస్తుతం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అకాడమీ క్రికెట్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఆయన రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించారు. అంబాజీపేటకు చెందిన శ్రీనివాస్ క్రీడాకారునిగా సైతం రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. 2005లో ఏపీ రంజీ క్రికెట్ జట్టు ప్రోబబుల్స్‌కు ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అంబాజీపేటలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌గా ప్రస్థానం ప్రారంభించిన శ్రీనివాస్ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. 2014 నుంచి 2022 వరకూ కడప జిల్లాలో ఏసీఏ అకాడమీ కోచ్‌గా సేవలించారు. అనంతరం మంగళగిరి, విజయనగరం అకాడమీలలో కూడా పనిచేశారు. ప్రస్తుతం మంగళగిరి అకాడమీ అసిస్టెంట్ కోచ్‌గా రాష్ట్ర అండర్-14 జట్టుకు రెండుసార్లు, అండర్-16 జట్టుకు ఒకసారి కోచ్ వ్యవహరించారు. తనను రంజీ జట్టు కోచ్‌గా ఎంపిక చేయడం పట్ల ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



# సేవ్ అనంతపురం సేవ్ ఆర్‌డీటీ

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సబిత**

**సచివాలయం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** రాయలసీమ అభివృద్ధిలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) ఎంతో కీలకమైన పాత్ర పోషించిన ఆ సంస్థను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి సవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సుమారు 50సంవత్సరాలుగా రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైద్య, విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్డీటీ సంస్థ ఎంతో కృషి చేసిందన్నారు. ఆ సంస్థ రెన్యూవల్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అందరం సమిష్టిగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి అమిత్ షా, ఇతర మంత్రులను కలిసి ఆసంస్థ రెన్యూవల్ కోసం విజ్ఞప్తి చేశామన్నారు.

మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ... ఆర్డీటీ సంస్థ రాయలసీమ ప్రాంతంలో ఎన్నో అబివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆర్డీటీ రెన్యూవల్‌కు సంబందించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారని చెప్పారు.

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ 50ఏళ్ళుగా రాయలసీమ ప్రాంతంలో ఆర్డిటి సంస్థ పేద ప్రజలకు 70వేలకు పైగా గృహాలను నిర్మించిందన్నారు. అంతేకాక సుమారు కోటి మొక్కలు నాటారని తెలిపారు. 600పడకల ఆస్పత్రి ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెరుగైన వైద్యం అందించారని అన్నారు.

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అనేది ఒక కల్పవృక్షం అని చెప్పవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజిక సేవా కార్యక్రమాలు, విద్య, వైద్యం, క్రీడలు తదితర రంగాల్లో ఆ సంస్థ గణనీయమైన సేవలు అందించిందని చెప్పారు. కావున సేవ్ అనంతపురం సేవ్ ఆర్డీటి అనే నినాదంతో ఆ సంస్థ పరిరక్షణలో మేమంతా వెన్నుదన్నుగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంకా ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## విజయవాడలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర (సివిల్ సరీ ్వసెస్ ) డిప్యూటి కలెక్టర్‌లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ్స అసోసియేషన్ కార్యాలయాన్ని విజయవాడలో ప్రారంభించారు. రాష్ట్రవిభజన జరిగిన తరువాత కొత్తగా విజయవాడలోని బెంజ్‌సర్కిల్ సమీపంలో ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద మంగళవారం ఉదయం నూతన కార్యాలయాన్ని అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు యం.విశ్వేశ్వరనాయుడు, ప్రధానకార్యదర్శి మోహనరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఏ.రవీంద్రరావులు ప్రారంభించారు. డిప్యూటీ కలెక్టర్స్ సర్వీసెస్, ప్రమోషన్‌లు తదితర అన్ని రకాల ప్రయోజనాలు ఇప్పించేందుకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి వాటి పరిష్కారానికి కృషిచేస్తామని నాయకులు ఈసందర్భంగా హామీ ఇచ్చారు. సమస్యల సాధనకు అసోసియేషన్ శక్తివంచన లేకుండా కృషిచేస్తుందని సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రాజధాని నిర్మాణంలో బ్యాంకర్లు భాగస్వాములు కండి

## బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరిన సిఎం చంద్రబాబు



తేనీటి విందులో సీఎం చంద్రబాబు,మంత్రులు నారాయణ,పయ్యావుల కేశవ్,బ్యాంకు చైర్మన్లు

**విజయవాడ, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** అమరావతిలో రీజనల్ ఆఫీసు ప్రారంభించాలని, అలాగే రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరారు. లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో భాగంగా విజయవాడ వచ్చిన పలు బ్యాంకుల చైర్మన్‌లు, ఎండీలకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎం తేనీటి విందు ఇచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులు గురించి వారికి వివరించారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నందున విస్తృత అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు రాజధానిలో స్థలాలు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

15 నెలల కాలంలో రాష్ట్రా నికి వచ్చిన పెట్టుబడులు, కేంద్ర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టుల గురించి వారికి తెలిపిన ముఖ్యమంత్రి పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లు, జాతీయ రహదారులు, క్వాంటం వ్యాలీ తదితర పనుల పురోగతిని వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, ప్రణాళికల గురించి చెప్పారు. విద్యుత్, వ్యవసాయం, ఇరిగేషన్, విద్య, వైద్య రంగాల్లో, పౌర సేవల్లో టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్నామని అన్నారు.

ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, పి నారాయణ, ఎంపీ బాలశౌరి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రామ సుబ్రమణ్యన్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ దేవదత్త చంద్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ రజనీష్ కర్నాటక్, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ పరమేందర్ చోప్రా, ఐఆర్‌డీఏఐ చైర్ పర్సన్ అజయ్ సేత్, నేషనల్ ఇన్సూరెన్స్ చైర్మన్ రాజేశ్వరీ సింగ్ ముని, ఎల్ఐసీ ఎండీ సత్పాల్ భాను, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సీఎండీ భూపేష్ సుశీల్ రాహుల్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సీఎండీ సంజయ్ జోషీ, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఈడీ సంజయ్ లాల్లా తదితరులు హై టీలో పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా డా.వంపూరు గంగులయ్యతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

# జానపద కళల పరిరక్షణకు కృషి

## మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో జానపద కళలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడ బెరం పార్క్ లోని హాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా డా. వంపూరు గంగులయ్యతో మంత్రి కందుల దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. కూటమి ప్రభుత్వం కళారంగానికి పెద్దపీట వేస్తుందని, కవులు, కళాకారులు, రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జానపద కళలకు పునర్ వైభవం తీసుకొస్తామన్నారు. జానపద కళారూపాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. గడచిన ఐదేళ్లలో అనేక కళారూపాలు విస్మరణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంతరించిపోతున్న జానపద కళలకు పునరుత్తేజం తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. కేంద్ర సహకారంతో కళాకారుల పెన్షన్ పునరుద్ధరిస్తామన్నారు. అభినందన మాత్రమే కోరుకునే అల్ప సంతోషి కళాకారుడు అని, కళాకారులని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సాంస్క ృతిక శాఖ అధికారులను మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన వంపూరు గంగులయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సమర్థవంతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ మంత్రి దుర్గేష్ అద్భుతమైన రంగస్థల నటుడని కొనియాడారు. జన హృదయం నుండి పుట్టిన జానపద కళల అభివృద్ధికి గంగులయ్య కృషిచేస్తారని భావిస్తున్నాను అన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, సాంస్క ృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జున రావు, రాష్ట్ర సాంస్క ృతిక మరియు సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డప్పల నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, వీర మహిళలు సౌజన్య, అన్నపూర్ణ, గంగులయ్య కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట

## అక్రమ కేసులపై ప్రజా తిరుగుబాటు తప్పదు: కాకాణి



పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్సీ నాయకులు

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** లేనిది ఉన్నట్లుగా చేయనిది చేసినట్లుగా నమ్మించడంలో చంద్రబాబు దిట్ట అని , తమ ప్రభుత్వంలో వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని అభివృద్ధిని తాము పూర్తిస్థాయిలో చేప్పుకోలేకపోయామని, అయితే తాను చేయంది కూడా చంద్రబాబు ప్రజలకు చెప్పుకుంటూ నమ్మించే యత్నం చేస్తున్నారని వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్‌గార్డెన్స్‌లో మాజీ శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆత్మకూరు నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం, రీకాలింగ్ చంద్రబాబు మానిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి కంటే అధికంగా సంక్షేమాన్ని అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు తాను ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో అన్నింటా ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో తల్లికి వందనం పేరుతో కటుంబంలోని ప్రతి ఆడబిడ్డకు 15వేల రూపాయలు ఇస్తామని చెప్పారని ఈప్రకారం కోటి మందికి ఇవ్వాల్సి ఉండగా అనేక సాకులు చూపి 60లక్షల మందికి ఇచ్చారని ఇది మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తానన్న 20వేల రూపాయలు అధికారంలోకి వచ్చాక ఒక సంవత్సరం ఎగ్గొట్టి అరాకొరగా ఇవ్వడం మోసం కాదా అన్నారు. మూడు సిలిండర్లు మహిళలకు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రెండు సిలిండర్లకు డబ్బులు ఇస్తామనడం మోసంకాదా, బస్సులు పెంచకుండానే ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి ప్రతి బస్సు ఓవర్‌లోడ్ తో మహిళలతో పాటు అందులో ప్రయాణించే వారికి కూడా పడరానిపాట్లు పడేలా చేస్తున్నారన్నారు.

ఆడబిడ్డ నిధి 15వేల రూపాయల వంతున ఎన్నికల్లో చంద్రబాబు చెబితే అదే విషాన్ని టిడిపి మంత్రి నిమ్మల రామానాయుడు నీకు 15వేలు, నీకు 15వేలు అంటూ చెప్పిన డైలాగులు బాగా పాపులర్ అయ్యాయన్నారు. చంద్రబాబు మాత్రం పి4పేరుతో ఆడబిడ్డలను దగా చేశారన్నారు. నిరుద్యోగ భృతి 3వేలు ఇస్తామని చెప్పి 16నెలల పాలనలో ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. ఇలా ప్రతి పథకాన్ని మోసపూరిత హామీలతో తుంగలో తొక్కి ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డితోపాటు ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుటుంబాలకు ప్రజల్లో విశ్వసనీయత ఉందని కాకాణి ఈసందర్భంగా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో నాడు దివంగత మంత్రి గౌతంరెడ్డిని నేడు తనను అత్యంతంగా అభిమానిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తల అభిమానం మరువజాలనన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అవినీతి తాండవిస్తుందని , ఇసుకదందాలు, మట్టి మాఫియాలు అధికంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు.స్థానిక మంత్రి ఇటీవల తమకుటుంబంపై చేసిన విమర్శలు అవాస్తవమన్నారు. తాము గతంలో 25ఎకరాల భూమిని తనతండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇచ్చి నవోదయ విద్యాలయాన్ని స్థాపించారని అందుకు సంబంధించి తాము ఒక్క సెంటు కూడా ప్రభుత్వం నుండి పొందలేదని ఈ విషయమై విమర్శలు చేసిన మంత్రి సమాధానం చెప్పాలని విమర్శలను రుజువు చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, వైసిపి మహిళా రీజనల్ అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, మండల వైసిపి అధ్యక్షుడు చిట్టమూరి జితేంద్రనాథ్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పీర్ల పార్థసారధి, రావుల లక్ష్మి, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాధ్యక్షులు పెయ్యల సంపూర్ణమ్మ, బోయిళ్ళ పద్మజారెడ్డి, వైసిపి వివిధ స్థాయి నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, నందా ఓబులేశు, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, పులిమి రమేష్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాధరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, చెన్ను వెంకటేశ్వర్లురెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బొర్రా సుబ్బిరెడ్డి, చిట్టెం శ్రీనివాసులు, కరిముల్లా, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జిఓ నం.190లో స్థానికతపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాలి

## 27న చలో హైదరాబాద్‌కు ఉద్యోగ ఉపాధ్యాయ జెఎసి పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:**జిఒ నెంబర్ 190లో స్థానికతపై ప్రభుత్వం స్పందించాలని 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ టి.విజయ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.జీవో నం.370 ఉద్యోగ ఉపాధ్యాయ బాధితులకు తాత్కాలిక డిప్యూటేషన్ల కోసం ఉపశమనం కొరకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం. 190ను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో 317 జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 27న చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 190లో స్థానికతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, డిప్యూటేషన్ జీవో190లో కూడా స్థానికత లేదనే విషయం పైన స్పందించాలని కోరారు.ఈ జీవో ద్వారా తాత్కాలిక డిప్యూటేషన్‌లో కేవలం కొంతమందికి మాత్రమే అవకాశాన్ని కల్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 317 బాధితులు అందరికీ న్యాయం జరిగేలా శాశ్వతంగా వారి సొంత జిల్లా జోన్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టామని 317 జీవో బాధితులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.



ప్రపంచ తెలుగు మహాసభలకు గోవా గవర్నర్ అశోక్ గజపతిని ఆహ్వానిస్తున్న గజల్ శ్రీనివాస్

# ప్రపంచ తెలుగు మహాసభలకు రండి

## గోవా గవర్నర్‌ను ఆహ్వానించిన గజల్ శ్రీనివాస్

**విజయవాడ, సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు లో శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభలకు గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి ని కలసి ఆహ్వానించినట్లు ఆంధ్ర సారసత్వ పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. జనవరి 5 వ తేదిన ఉదయం 10 గంటలకు మహాసభలలో భాగంగా జరిగే ఆంధ్ర వైభవం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు సాహితీ ,సాంస్కృతిక , సేవా రంగ ప్రముఖులకు ఆంధ్రశ్రీ , ఆంధ్ర సారస్వత భూషణ, ఆంధ్ర సారస్వత రత్న పురస్కారాలను అందజేసి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసం గించమని కోరగా గోవా గవర్నర్ సానుకూలంగా స్పందించారని డా.గజల్ శ్రీనివాస్, ముఖ్య సమన్వయ కర్త పి.రామచంద్ర రాజులు తెలిపారు.

**ఉత్తమ లఘు చిత్రం "పెద్ద బాల శిక్ష"**

ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు వికాసం పై నిర్వహించిన లఘు చలన చిత్ర పోటీలలో పెద్ద బాల శిక్షకు ప్రధమ బహుమతి లభించిందని ఆంధ్ర సారసత్వ పరిషత్అధ్యక్షులు డా, గజల్ శ్రీనివాస్ , ముఖ్య సమన్వయ కర్త పి. రామ చంద్ర రాజులు తెలిపారు.ఉనికి , తెలుగు వైభవం చిత్రాలకు ద్వితీయ, తృతీయ బహుమతులు , సుమధురం, కాసేపు తెలుగు లో మాట్లాడుకుందాం, మహాశయులు మళ్ళీ పుట్టాలి చిత్రాలు ప్రత్యేక ప్రశంసా బహుమతులు గెలుచుకున్నాయి.ఉత్తమ దర్శకుడు ఉనికి , అభిజిత్ సాయి రెడ్డి, ఉత్తమ రచన,సంభాషణలు శ్వాస, వజ్రనాభ నటరాజ్ మహర్షి , ఉత్తమ నటి మా తెలుగు తల్లికి మల్లెపూదండ నర్తకి, ఉత్తమ నటుడు పెద్ద బాలశిక్ష ఉదయ్ భాగవతుల, ఉత్తమ ఛాయాగ్రహణం మధులిక అభి. ఉత్తమ కూర్పు , సూర్య అకొండి, తెలుగు వైభవం కు వ్యక్తిగత ప్రతిభా బహుమతులు గెలుచుకున్నారని పోటీల జ్యూరీ చైర్మన్‌గా శ్రీ లోహిత్ కుమార్ , సభ్యులు గా సాకేత్ ఉదయగిరి, లిరేష కూనపరెడ్డి నిర్వహించారు. తొలుత తెలుగు చలన చిత్ర ప్రముఖులు కోన వెంకట్ , దర్శకులు దశరథ్, బి.వి ఎస్.రవి, సిరాశ్రీ, మన చౌదరి లను వొకేషనల్ ఎక్సలెన్సీ అవార్డును రోటరీ క్లబ్ గుంటూరు ప్రదానం చేసింది. విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షులు డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ , శాసన సభ్యులు నజీర్ అహ్మద్ , సాంస్క ృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బుచ్చి రామప్రసాద్, పరిషత్ నిర్వాహకులు రెడెప్ప ధవేజ్, మేడి కొండ శ్రీనివాస్, అన్నా ప్రగడ రవి శ్రీనివాస్, డా.కత్తి వెంకటేశ్వరావు, వాసిరెడ్డి విద్యాసాగర్, లఖంరాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణా దేవిగా దుర్గమ్మ

## పెరిగిన భక్తుల రద్దీ

## క్షేత్రస్థాయిలో కలెక్టర్, ఇఓ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో గాయత్రిదేవిగా భక్తులను కటాక్షించారు. సకల వేదాలకు నెలవై సకల దేవతలకు ప్రతిస్వ రూపంగా ఆరాధనాలందుకునే గాయాత్రిమాత అలంకారంలో భక్తులు దుర్గమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. కలెక్టర్ .లక్ష్మీషా, కమీషనర్ రామ చంద్రమోహన్, ఇఒ వికె .శీనా నాయక్ లు ఏర్పాట్లు ఎపపటికపుడు పరిశీలిస్తూ భక్తుల మన్ననలందుకున్నారు.

**రెండోరోజు 60,041 భక్తులకు దర్శనం:** రెండవ రోజు సాయంత్రం 5 గంటలకు 60,641 మంది భక్తులు దుర్గమ్మవారిని శ్రీ గాయత్రి మాతగా దర్శించుకున్నట్లు ఇఒ వికె శీనా నాయక్ వెల్లడించారు. 16,629 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వృద్దులకు, వికలాంగులకు బ్యాటరీ బండ్ల ద్వారా ఆలయానికి తీసుకొచ్చి శ్రీఅమ్మవారి దర ్శన ఏర్పాటు చేశారు.

**రెండోరోజు ఆదాయం రు. 25.48,725లక్షలు**

టికెట్ల అమ్మకం, ప్రసాదాలు ద్వారా మొత్తం రు. 25.48,725ల ఆదాయం సాయంత్రం 5 గంటల వరకు లభించిందన్నారు.

**ప్రోటోకాల్ ప్రముఖులు దర్శన సమయం పాటించాలి:** "దసరా ఉత్సవాలు సందర్భంగా శ్రీ కనక దుర్గ అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రోటోకాల్ పరధిలోకి వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ వ్యవస్థలకు చెందిన వారు ప్రతి రోజు ఉదయం 7 నుండి 9 వరకు, సాయంత్రం 3 నుండి 5 వరకు దర్శనం నిమిత్తం రావొచ్చు అని,భక్తుల రద్దీ రీత్యా ఆ తరువాత వచ్చే వారిని అనుమతించలేమని ఆలయ ఈవో శీనా నాయక్ స్పష్టంగా పేర్కొన్నారు.అదే విధంగా దసరా రోజుల్లో ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి 7.30 వరకు అమ్మవారి ఆలయ శుద్ధి, నైవేద్యం, పంచ హారతులు సందర్భంగా బంగారు వాకిలి నుండి అమ్మ వారి దర్శనం అనుమతించబడదని గమనించగలరు.

**క్షేత్రస్థాయిలో కలెక్టర్ లక్ష్మీషా :** దుర్గఅమ్మవారి దర్శన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్... సాధారణ భక్తుడిగా క్యూలైన్లో దర్శనం భక్తులతో కలసి సాగిన జిల్లా పాలనాధికారి లక్ష్మీషా క్యూలైన్ల నిశిత పరిశీలన చేశారు. బస్టాండు, సీతమ్మ వారి పాదాలను సందర్శనచేసి భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారుభక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండ అన్ని జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులతో కలిసి అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. పండిట్ నెహ్రూ బస్టాండును సందర్శించి ప్రయాణికులతో మాట్లాడారు. సీతమ్మ వారి పాదాల వద్ద భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.





రాష్ట్ర మంత్రులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ శీనా నాయక్, వృద్ధులు వికలాంగులకు సేవలందిస్తున్న దృశ్యం

**ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి:** .. అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ్మశ అన్నారు. ఈనెల 24వ తేదీ బుధవారం గౌరవ భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విజయవాడ నగర పర్యటనకు రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ్మశ ఆదేశించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ బుధవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇంద్రకీలాద్రి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పర్యటనకు సంబంధించి తీసుకోవాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ లక్షీ ్మశ మంగళవారం ఆలయ ఈవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పటిష్ట భద్రతతో పాటు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలకడంతో, అమ్మవారి దర్శనానికి చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఆలయ ఈవో వీకే శీనా నాయక్, అధికారులు పాల్గొన్నారు.

**-శ్రీఅమ్మవారిని దర్శించుకున్న విఐపిలు:** శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్. సవిత, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, గల్లా మాధవి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మెదక్ ఎంపి రఘునందనరావు మంగళవారం దర్శించుకున్నారు.

**కోరినన్ని లడ్డూ ప్రసాదం సిద్ధం:** దసరాఉత్సవాలు జరిగే 11 రోజులకు 36 లక్షల లడ్డూలు సిద్ధం చేశామని, మూలా నక్షత్రం, విజయదశమి రోజున ఉచిత లడ్డు ప్రసాదం పంపిణీ ఉచితంగా చేయడంతోపాటు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ్మశ వెల్లడించారు. లడ్డూలు ఎక్కువ కాలం నిలువ ఉండేలా అత్యంత నాణ్యత కలిగిన శనగపిండి, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వాడుతున్నట్లుగా గమనించారు. అత్యంత పరిశుభ్ర వాతావరణంలో ఈ లడ్డు ప్రసాదం తయారు అవుతోందని వివరించారు. లడ్డు తయారీ కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాల లడ్డు విక్రయ కేంద్రాలకు రవాణా చేసే సమయంలో రవాణా వాహనాలకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను చక్క దిద్దాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో దేవస్థానం ప్రసాదం కేంద్రం సహాయక అధికారి ఎం ఎస్ ఎల్ శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

**– రియల్ టైం ఫీడ్బ్యాక్ ఆధారంగా సేవలు:**

రియల్ టైం ఫీడ్ బ్యాక్ ఆధారంగా భక్తులకు సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లక్షీ ్మశ ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించామని తెలిపారు.

**దివ్యాంగులకు, వృద్ధులకు "సేవాదళ్" బృందం చేయూత :** శ్రీదుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ బృందాలు చక్కటి సేవలందిస్తున్నాయి. పదిమంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బృందాలు వేకువ జాము నుంచి రాత్రి దర్శనం పూర్తయ్యే వరకు దివ్యాంగులు, వృద్ధులు దర్శనం చేసుకోవడంలో సాయం చేస్తూ భక్తుల ప్రశంసలు పొందుతున్నాయి.నవరాత్రులలో రెండవ రోజైన మంగళవారం గాయత్రీ దేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారిని సేవించుకోవడానికి సత్తుపల్లి నుంచి ఎం. రజని అనే దివ్యాంగురాలు తన భర్త కృష్ణయ్యతో కలసి విజయవాడకు వచ్చారు. వృద్ధుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులో ఇంద్రకీలాద్రి పైకి చేరుకోగా, అక్కడి నుంచి చక్రాల కుర్చీలో సేవాదళ్ సభ్యులు ఆమెను దర్శనానికి తీసుకువెళ్లారు. పోలీస్ ఏఆర్ విభాగానికి చెందిన ముగ్గురు మహిళా సేవాదళ్ సభ్యులు తనకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకున్నారని, వారికి, పోలీస్ శాఖకు, దేవస్థానానికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని కృష్ణయ్యరజనీ దంపతులు చెప్పారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**వైభవంగా నగరోత్సవం:** సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల

# సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**కోవూరు, (నెల్లూరు), సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్ విషయాలను సీఎం దృష్టికి తెచ్చారు. నియో జకవర్గ అభివృద్ధికి సంబంధించి వివిధ అం శాలపై సీఎం చంద్రబాబుకి వినతి పత్రాలు అందజేశారు. అలాగే వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసు కువెళ్లారు. ప్రశాంతమ్మ వినతులపై



స్పందించిన సీఎం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


24-09pg10 12 GNT_24-09pg10.qxd 9/24/2025 12:17 AM Page 1




ఆట

## వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ నాల్గవ స్థానంలో హర్విందర్





**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా ఆర్చరీ ఛాంపియన్ షిప్-2025, పురుషుల రికర్వ్ ఓపెన్ క్వాలిఫికేషన్‌లో హర్విందర్ సింగ్ నాల్గవ స్థానంలో నిలిచాడు. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో మంగళవారం జరిగిన ఆర్చరీ ఛాంపియన్‌షిప్ అర్హత రౌండ్‌లో భారత్‌కు చెందిన హర్విందర్ సింగ్ నాల్గవ స్థానంలో నిలిచాడు. పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఓపెన్‌లో పోటీ పడుతున్న ప్రస్తుత పారాలింపిక్ ఛాంపియన్ మొత్తం 645 పాయింట్లు సాధించి నాల్గవ ఉత్తమ ఆర్చర్‌గా నిలిచాడు. అలాగే భారత్‌కే చెందిన సాహిల్ 633 స్కోరుతో 14వ స్థానంలో నిలిచాడు. పురుషుల రికర్వ్ టీమ్ ఓపెన్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో హర్విందర్ మరియు సాహిల్ కలిసి 1278 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచారు. పురుషుల వ్యక్తిగత రికర్వ్‌లో మరో భారతీయుడు ధన్నా రామ్ గొడారా 617 స్కోరుతో 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు, మహిళల డబ్ల్యూ1 రికర్వ్ కాంపిటేషన్‌లో, భారతదేశానికి చెందిన శ్రియ 15 మంది అథ్లెట్లలో 422 స్కోరుతో 15వ స్థానంలో నిలిచింది.



## బిల్లీ జీన్ కింగ్ కప్ ఛాంపియన్‌గా పావోలిని

### 2-0 తేడాతో పెగులా ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటలీ బిల్లీ జీన్ కింగ్ కప్-2025 ఛాంపియన్‌గా జాస్మిన్ పావోలిని నిలిచింది. జెస్సికా పెగులాను ఓడించడం ద్వారా టైటిల్‌ను నిలబెట్టుకుంది. షెన్‌జెన్‌లో జరిగిన ఫైనల్‌లో ఇటలీ 2-0 తేడాతో 18 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన యునైటెడ్ స్టేట్స్‌ను ఓడించి ఆరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ ఏడో ర్యాంకర్ పెగులాను 6-4 6-2 తేడాతో ఓడించడం ద్వారా పావోలిని విజయాన్ని కైవసంచేసుకుంది. తొలి సెట్‌లో బ్రేక్ పాయింట్లు ఇచ్చినప్పుడు పెగులా వృధాగా ఆడి నాలుగు ప్రయత్నాల తర్వాత గోల్‌ను మార్చలేకపోయింది. చివరికి పావోలిని ఆధిక్యంలోకి వెళ్లడంతో ఆమె ఓటమి పాలైంది, మరియు ఇటాలియన్ క్రీడాకారిణి రెండవ సెట్‌లో 5-1 ఆధిక్యంలోకి వెళ్లినప్పుడు దాన్ని అడ్డుకోవడంలో విఫలమైంది. పావోలిని తన మొదటి మూడు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైనందున కొంత తడబడింది. కానీ తరువాతి ఆటలో సర్వీస్ బ్రేక్ చేయడం వల్ల ఇటలీ విజయం సాధించింది. ఇక ఎలిసబెట్టా కోకియారెట్టో ఎమ్మా నవారోను 6-4 6-4 తేడాతో ఓడించిన తర్వాత ప్రపంచ ఎనిమిదో నంబర్ క్రీడాకారిణి విజయం సాధించింది.

## స్లో రన్ రేటుతో భారత్ మహిళా జట్టుకు ఫైన్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత మహిళల జట్టుకు ఫైన్ పడింది. ఈ నెల 20వ తేదీన ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో స్లో ఓవర్ రేట్‌ను కొనసాగించినందుకు భారత మహిళా క్రికెట్ జట్టుకు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. ఫిరోజ్ షా కోట్లాలో జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన 125 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియాకు 12 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్నప్పటికీ, ఆతిథ్య భారతదేశం 43 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత, లక్ష్యానికి రెండు ఓవర్లు తక్కువగా ఉన్న కారణంగా ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలకు చెందిన జిఎస్ లక్ష్మి ఈ ఆంక్షలు విధించారు. కనీస ఓవర్ రేట్ నిబంధనలకు సంబంధించిన ఐసీసీ ఆటగాళ్ళు మరియు సహాయ సిబ్బంది ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, నిర్ణీత సమయంలో బౌలింగ్ చేయని ప్రతి ఓవర్‌కు వారి మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధించబడుతుంది" అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. "భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అంగీకరించింది. మరియు ప్రతిపాదిత శిక్షను అంగీకరించింది. కాబట్టి అధికారిక విచారణ అవసరం లేదు" అని పేర్కొంది. కాగా ఆన్‌ఫీల్డ్ అంపైర్లు లారెన్ అగెన్‌బాగ్, జనని నారాయణన్, మూడవ అంపైర్ గాయత్రి వేణుగోపాలన్, నాల్గవ అంపైర్ బృందా రతి భారత్ జట్టుపై ఈ అభియోగాన్ని మోపారు.

## రెండో టెస్టులో 350 రన్స్‌తో ఆస్ట్రేలియా

### 5 వికెట్లతో చెలరేగిన భారత్ స్పిన్నర్ సుతార్

**న్యూఢిల్లీ:** భారత్‌తో జరిగిన రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 350 పరుగులు చేసింది. ఎకానా క్రికెట్ స్టేడియంలో ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తొలి రోజు మంగళవారం భారత్ యువ ఆటగాడు సుతార్ 5 వికెట్లతో చెలరేగాడు. భారత్‌తో రెండు అనధికారిక టెస్టులు, మూడు వన్డే మ్యాచ్‌ల కోసం ఆస్ట్రేలియా భారత్ పర్యటనలో ఉంది. తొలి టెస్టు డ్రా గా ముగియగా, రెండో మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యక్తిగత కారణాలతో ఈ మ్యాచ్‌కు దూరం కాగా, ధ్రువ్ జురెల్ సారథ్య బాధ్యతలు చూస్తున్నాడు. టాస్ బోడి బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక జట్టు తొమ్మిది వికెట్లకు 350 పరుగుల వద్ద నిలిచింది. ఏడో స్థానంలో వచ్చిన జాక్ ఎడ్వర్డ్స్ (78 బంతుల్లో 88 పరుగులు, 11 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా ఆడి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్ కాంప్‌బెల్ (9) ఆరంభంలోనే వెనుదిరిగాడు. అయితే మరో ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (91 బంతుల్లో 49 పరుగులు, 7 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ ( 162 బంతుల్లో 74 పరుగులు, 10 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఓలివర్ పీక్ (29), జోష్ ఫిలిప్ (39) పరుగులు చేశారు. తర్వాత ఎడ్వర్డ్స్ ఎడాపెడా బౌండరీలు బాదడంతో స్కోరు 300 దాటింది. ప్రస్తుతం టాడ్ మర్ఫీ (29 నాటౌట్), హెన్రీ థోర్న్టన్ (10 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇక భారత్ బౌర్లలో యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 28 ఓవర్లలో 93 పరులిగిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. సుతార్‌తో పాటు, గుర్నూల్ బ్రార్ (13-0-71-2), ప్రసిద్ధ్ కృష్ణ (13-3-63-1), మొహమ్మద్ సిరాజ్ (13-1-73-1) వికెట్లు తీశారు.









## ఆసియా కప్‌లో తుఫాన్

### పాక్ ఓపెనర్ ఫర్హాన్ ఫైరింగ్ స్టైల్

### జెంటిల్‌మన్ గేమ్‌లో కాంట్రవర్సీ సెలబ్రేషన్స్

**న్యూఢిల్లీ:** జెంటిల్ మేన్ గేమ్ అయిన క్రికెట్‌లో ఓడినా, గెలిచినా కూడా ఇరు జట్ల ఆటగాళ్లు ఎంతో హుందాగా ప్రవర్తిస్తూంటారు. అయితే కొందరు ఆటగాళ్ల ప్రవర్తన వల్ల చెడ్డపేరు వస్తుంటుంది. ఆసియా కప్, సూపర్4లో ఈ నెల 21న దుబాయ్‌లో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో

















భారత్ విజయం సాధించింది. అయితే మ్యాచ్ సమయంలో పాక్ ఓపెనర్ ఫర్హాన్ అర్ధశతకం కొట్టి తదుపరి చేసుకున్న సెలబ్రేషన్స్ వివాదాస్పదమైంది. సాహిబ్జాదా ఫర్హాన్ ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో రాణించాడు. 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లు బాది 58 రన్స్ చేశాడు. అయితే హాఫ్ సెంచరీ తరువాత అతడు డగౌట్ వైపు తిరిగి తన బ్యాట్‌తో గన్ పట్టుకుని ఫైరింగ్ చేసిన తరహాలో సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. ప్రస్తుతం భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అతడి చర్య రెచ్చగొట్టేలా ఉందనే బిసిసిఐ భావిస్తోంది. గతంలో ఇలాంటి చర్యలకు సీసీఐ జరిమానాలు, డీమెరిట్ పాయింట్లను విధించింది. వాటిల్లో భారత్ స్టార్ విరాట్ కోహ్లి 2012లో సిడ్నీ మ్యాచ్‌లో అనుచితంగా ప్రవర్తించాడు. ఆస్ట్రేలియా ఫ్యాన్స్ స్టేడియంలో దుర్భాషలాడటంతో కోహ్లి తన మిడిల్ ఫింగర్‌ను స్టాండ్స్ వైపు చూపించాడు. దీన్ని ఐసీసీ లెవెల్ 1 నేరంగా పరిగణించి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించింది. అలాగే దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ 2018లో ఆస్ట్రేలియా మ్యాచ్‌లో స్టీవ్ స్మిత్‌ను ఔట్ చేశాడు. ఆ ఆనందంలో భుజాలను ఎగరేస్తూ పెవిలియన్‌కు వెళుతున్న స్మిత్‌ను తాకుతూ దూకుడుగా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. దీనిని లెవెల్2 నేరం కింద 2 టెస్టు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధించింది. ఇక ఢాకీ ప్రీమియర్ లీగ్ 2021 మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ స్టంప్స్‌ను కాలితో తన్నాడు. దీన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్రంగా పరిగణించి 3 మ్యాచ్‌ల సస్పెన్షన్, భారీ జరిమానా వేసింది. 2015లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ప్లేయర్ రోహిత్ శర్మను డేవిడ్ వార్నర్ తిట్టడమే కాకుండా అనుచితంగా సెడాంప్ ఇచ్చాడు. దీంతో వార్నర్ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా, 2 డీమెరిట్ పాయింట్లు విధించింది. 2017లో లీడ్స్‌లో వెస్టిండీస్ మ్యాచ్‌లో ఔటైన తరువాత పెవిలియన్‌కు వెళుతూ బెన్‌స్టోక్స్ అభ్యంతరకరమైన చేతి సంజ్ఞ చేశాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఐసీసీ అతడిని మందలించి, మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. మరి ఇప్పుడు పాక్ ఓపెనర్ ఫర్హాన్ తీరుపై సీసీఐ ఏవిధంగా స్పందిస్తుందనేది చూడాలి.

వాణిజ్యం

## 45% వృద్ధిని నమోదు చేసిన బజాజ్ ఫైనాన్స్



**ముంబయి, సెప్టెంబరు 23:** ఎన్ఎస్ఇ నిఫ్టీసూచీలో ఈ ఏడాదిలో బజాజ్‌ఫైనాన్స్ ఇప్పటివరకూ 45శాతం లాభాలు ఆర్జించింది. నిఫ్టీ ఆర్థికసేవల సూచీ 13శాతంమాత్రమే పెరిగితే బజాజ్ మాత్రం 45శాతం లాభపడింది. ఇన్వెస్టర్లకు స్వల్పకాలిక రివార్డులుకూడా ఇచ్చింది. గతనెలలో 12శాతంమేర పెరిగిన ఈ స్టాక్ ఆరునెలల్లో 11శాతంపెరిగింది. దీర్ఘకాలిక షేర్ హోల్డర్లు ఈ స్టాక్‌తో సంపదసృష్టిని కూడా చేపట్టుకోగలిగారు ఐదేళ్ల కాలంలో 220శాతంమేర వృద్ధి ఉంటుందని అంచనా. 2015నుంచి 2025వరకూ బజాజ్ స్టాక్ 60 రూపాయలనుంచి 1006 రూపాయలకు పెరిగింది. 33శాతం వృద్ధిని నమోదుచేసింది. కంపెనీ లాభనష్టాల పట్టీకూడా శరవేగంగాపెరిగింది. నికరలాభాలు 898 కోట్లవరకూ 2015లో నమోదుచేస్తే 2025లో 16,661 కోట్లునమోదుచేసింది. సమిష్టివార్షిక వృద్ధిరేటులో 34శాతం వృద్ధిని నమోదుచేసింది. నిర్వహణ ఆస్తులు 32,410 కోట్లునుంచి 29శాతం వృద్ధిచెంది 4.17 లక్షలకోట్లుపెరిగింది. పది కేలండర్‌సంవత్సరాల్లో ఎనిమిది ఏళ్లు సానుకూల రిటర్నులే సాధించింది. స్టాక్స్ 2022, 2024లో క్షీణించినా తర్వాత శరవేగంగా రికవరీ అయ్యాయి. మార్కెట్ నిపుణుల అంచనాలనుపరిశీలిస్తే 21 బ్రోకింగ్ సంస్థలు కొనుగోలుచేయవచ్చని, 13 సంస్థలు అలాగే కొనసాగించాలని, ఐదుగురు విక్రయించవచ్చని సూచించాయి.

## రికార్డు కనిష్టానికి రూపాయి

### డాలర్ వర్సెస్ రూపాయి 88.73



**ముంబయి, సెప్టెంబరు 23:** భారత్‌రూపాయి డాలరు మారకం విలువల్లో మరింతగా క్షీణించింది. 41 పైసలు క్షీణించి మంగళవారం 88.73 రూపాయలుగా నమోదయింది. అంతకుముందురోజు 88.32 రూపాయలుగా చెలామణి అయిన రూపాయి 24 గంటల్లోనే మరింత క్షీణించింది. అంతర్జాతీయంగాను, దేశీయంగాను నెలకొన్న ఆర్థిక సంఘటనలే ఇందుకు కారణం అని తెలుస్తోంది. అంతకుముందు ట్రేడింగ్‌ప్రనారంభంలో దేశీయ కరెన్సీ 18 పైసలు క్షీణించి 88.50వద్ద రికార్డు అయింది. లండన్ ఎఫ్‌టిఎస్‌ఇనుంచి నిధుల విత్‌డ్రా, అంతకుముందు ఎఫ్‌పిఐల విత్‌డ్రాలతో డాలరు కొంత బలపడింది. దేశీయ కరెన్సీ ట్రేడింగ్ సెషన్ ఆరంభంలో 18 పైసలు క్షీణించి 88.50 వద్దప్రారంభం అయింది. ముందురోజు డాలరు బయర్లు 2900 కోట్ల విలువైన వాటాలను కొనుగోలుచేసారు. అమెరికా ట్యారిఫ్‌లు పెంచడం, యుఎస్ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచడం వంటివి రూపాయి అత్యంత కనిష్టానికి చేరడానికి దారితీసాయి. ఐపిఒలద్వారా కొంతమేర 7500 కోట్లవరకూ రాగలదని అంచనావేసినా ఆర్బీఐ డాలర్ కౌంటర్‌ను ప్రారంబిస్తే కొంతమేర క్షీణతను కట్టడిచేయవచ్చని అంచనా. ఇక వాణిజ్య విధానాల్లో అనిశ్చితికూడా రూపాయి క్షీణతకు తోడయింది. ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్లు తగ్గించినసంగతి తెలిసిందే. అంతకుముందు సెప్టెంబరు తొలినాళ్లలోనే రూపాయి రికార్డుస్థాయిలో క్షీణించింది. డాలరుతో పోలిస్తే 88.44 రూపాయలవదనద స్థిరపడింది. రూపాయితోపాటే ఇతర ఆసియా కరెన్సీలు కూడా క్షీణించడంవల్ల డాలరు పటిష్టం అయ్యేందుకు దోహదంచేసింది.



## దీపావళి గిఫ్ట్‌లేవీ కొనవద్దు

### ప్రభుత్వశాఖలకు ఆర్థికశాఖ సర్క్యులర్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రభుత్వ శాఖల్లో వృధా ఖర్చును తగ్గించేందుకుగాను తక్షణ చర్యలుచేపట్టింది. ప్రభుత్వం అన్ని మంత్రిత్వశాఖలు, ప్రభుత్వశాఖలు ఇతర చట్టబద్ధమైన కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా దీపావళికి బహుమతులు, అలంకరణలు వంటివాటిని నిషేధించినట్లు ఆర్థికశాఖ మార్గదర్శకాలుజారీచేసింది. కేంద్ర బ్యయనియంత్రణశాఖ ఆధ్వర్యంలో ఈ మార్గదర్శకాలను జారీచేసింది. ప్రభుత్వం వృధా ఖర్చును కట్టడిచేయడం అనేది ఈరోజుకొత్తగా వచ్చిందేమీ కాదు. కొవిడ్ 19 కాలంలోకూడా ప్రభుత్వం ఇదే విధమైన మార్గదర్శకాలు విడుదలచేసింది. ప్రభుత్వ వనరులను న్యాయవద్ధంగా వినియోగించాలన్న లక్ష్యంతో దీపావళి ఇతర పండుగల సందర్భంగా ఎలాంటి బహుమతులు ప్రభుత్వ నిధులతో కొనుగోలుచేయవద్దని సూచించింది. జాయింట్ సెక్రటరీ పికె సింగ్ సంతకంతో వెలువడిన ఈ ఉత్తర్వులు జిఎస్టీ 2.0 అమలుకు వచ్చినతర్వాతనే రావడం గమనార్హం. కొత్త జీఎస్టీ రేట్లుతో రోజువారి ఉత్పత్తులు, కార్లు, ఇతర ఉత్పత్తులపై ధరలు తగ్గనున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం అత్యవసరం కాని ఖర్చులన్నింటినీ కట్టడిచేసేందుకు ఈనిర్ణయం తీసుకున్నట్లు ఆర్థికశాఖ వెల్లడించింది. 2020 సెప్టెంబరులోకూడా కేంద్ర ప్రభుత్వరంగసంస్థలు, మంత్రిత్వశాఖలు అన్నీ కూడా క్యాలెండర్లు, డైయిరీలు ముద్రించడం, బహుమతులు కొనుగోలుచేయడం, గ్రీటింగ్‌కార్డులు పంపిణీ వంటివాటిని నిలిపివేయాలనికోరింది. ఇపుడు తాజాగా వచ్చిన ఉత్తర్వుల్లోకూడా ఈ పండగసీజన్‌లో ప్రభుత్వ అధికారులు అధిపతులు ఎలాంటి దుబారా వ్యయం చేయవద్దని సూచించింది.

## ఇపిఎఫ్ఒ పరిధిలోకి అదనంగా 21.04 లక్షల ఉద్యోగులు!





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్ ఆర్గనైజేషన్ జులై నెలలో 21.04 లక్షలమంది సభ్యులను అదనంగాచేర్చుకోగలిగింది. వార్షికపద్ధతిలో చూస్తే 5.55శాతం వృద్ధిఉన్నట్లు తెలుస్తోంది. రోజురోజుకూ ఉపాధి అవకాశాలు పెరుగుతుండటంతో ఉద్యోగుల ప్రయోజనాలపట్ల అవగామణ కూడాపెరుగుతోంది. ఇపిఎఫ్ఒ విజయవంతమైన చైతన్య కార్యక్రమాలునిర్వహిస్తుండటంతో కార్మికులకు కూడా తమకు లభించే బెనిఫిట్స్‌పై అవగాహనపెరిగింది. కొత్త చందాదారులే 9.79 లక్షలమంది ఉన్నట్లు ప్రకటించింది. 18-25 ఏళ్లమధ్య గ్రూపులో 61.06శాతంగా ఉన్నారు. అంటే 5.98 లక్షలమందివరకూ ఉన్నట్లు అంచనా. వీరిలో ఎక్కువమంది మొదటిసారి ఉదోనయగంలోకి వచ్చినవారే కావడం గమనార్హం. 18-25 ఏళ్లమధ్య వయసు ఉన్నవారు జూన్‌నెలలో 9.13 లక్షలమందివరకూ ఉన్నారు. అంటే గత ఏడాదితోపోలిస్తే 4.09శాతం మందిపెరిగారు. సంఘటిత రంగంలో వర్క్‌ఫోర్స్‌లో ఎక్కువమంది మొదటిసారి ఉద్యోగం పొందినవారు అందునా యుక్తవయస్కులే ఎక్కువమంది ఉన్నారు. గతంలో ఇపిఎఫ్ఒనుంచి వైదొలిగిన 16.43 లక్షలమంది సభ్యులు మళ్లీ రీజాయిన్ అయ్యారు. ఈ సంఖ్యకూడా ఈ ఏడాది 12.12శాతంపెరిగింది. ఇపిఎఫ్ఒ పరిధిలో ఉన్న సంస్థల్లోనే వీరు మళ్లీచేరినట్లు తెలుస్తోంది. మహిళా చందాదారులు కూడా 2.80 లక్షలమందివరకూ ఉన్నారు. ఇక సగటు మహిళా ఉద్యోగులు ఇపిఎఫ్ఒ పరిధిలోకి వచ్చినవారు 4.42లక్షలమందివరకూ ఉన్నారు. రాష్ట్రాలపరంగాచూస్తే మహారాష్ట్ర 20.47శాతంమందితో ఎక్కువగా ఉంది. తర్వాత కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అదనంగా ఐదుశాతంగా ఇపిఎఫ్ఒ చందాదారులు పెరిగినట్లు తెలుస్తోంది. ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో 60.85శాతంమందివరకూ పిఎఫ్ పొందేవారున్నారు.

## మూడో రోజూ ఈక్విటీల్లో నష్టాలే!



**ముంబయి, సెప్టెంబరు 23:** దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం స్వల్పనష్టాల్లోముగిసాయి. వరుసగా మూడోరోజు కూడా ప్రతికూలంగానే సెన్సెక్స్ నిఫ్టీలు ట్రేడింగ్‌ముగించాయి. హెచ్‌వన్‌బి వీసాఫీజు పెంపు భారత్ అమెరికా వాణిజ్య చర్చల్లో అనిశ్చితి నెలకొనడం వంటివాటితో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. నిఫ్టీ 25,200 మార్కు దిగువనే ముగిసింది. పిఎస్‌యు బ్యాంకులు, మెటల్స్, ఆటో స్టాక్స్ కొంతమేర పెరిగితే ఎఫ్ఎంసిజి, ఐటి షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలుకూడా వెనకబడ్డాయి. డాలరుతో రూపాయి మారకం కనిష్టానికి చేరింది. వాణిజ్యలోటు కలవరం కూడా పెరిగింది. భౌగోళిక ఉద్రిక్తతలు తోడుకావడంతో స్టాక్‌సూచీలపై ప్రభావం పడింది. ఫెడ్‌రేట్ కట్‌తో బంగారంధరలు పెంచింది. దేశీయంగా ఎనిమిది కీలక పరిశ్రమలు కొంత మద్దతునిచ్చాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 57.87 పాయింట్లు క్షీణించి 81,102.10 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 32.85 పాయింట్లు క్షీణించి 25,169.50 వద్ద ట్రేడింగ్ ముగించింది. మూడు సెషన్లలోసెన్సెక్స్ 1.09శాతం క్షీణిస్తే నిఫ్టీ 0.99శాతం తగ్గింది. స్టాక్స్‌లో హిందూస్థాన్ యూనిలీవర్ 1.94శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.49శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.65శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.35శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో మొత్తం 1798 కంపెనీలు పెరిగితే 2356 కంపెనీలషేర్లు క్షీణించాయి. 166 కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. వచ్చేనెల 3 నాటికి ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.60శాతంపెరిగి 1,14,023వద్ద ట్రేడ్ అయింది. బ్రెంట్‌ముడిచమురు నవంబరు నాటికి 30 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 66.87 డాలర్లుగా ట్రేడ్ అయింది.





## ఈ యేడాది భారత్ వృద్ధిరేటు 6.5%

### ఎస్అండ్‌పి గ్లోబల్ అంచనా..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ భారత్ జిడిపి వృద్ధి 6.5శాతంగా ఉంటుందని అంచనావేసింది. పటిష్టమైన డిమాండ్, పెట్టుబడుల వృద్ధి, పన్నులరంగంలో సంస్కరణలు వృద్ధిని 6.5శాతంగా కొనసాగిస్తాయని వెల్లడించింది. ఆసియా ఆర్థిక ముఖచిత్ర నివేదిక పసిఫిక్ నాలుగోత్రైమాసికం పేరిట విడుదలచేసిన నివేదికలో ఎస్అండ్‌పి గ్లోబల్ జిడిపి వృద్ధి 6.5శాతంవద్ద స్థిరంగా ఉంటుందని తేల్చింది. దేశీయంగా మంచి డిమాండ్ ఉందని, రుతుపవనాల సీజన్ సగటు కంటే ఎక్కువ వర్షపాతం జిఎస్టీలో మార్పులు, శ్లాబుల కుదింపుతో పాటు పెట్టుబడులు పెరుగుతుండటం కూడా శుభసూచిక అని తెలిపింది. భారత్ ద్రవ్యోల్బణం 2026 సంవత్సరంలో 3.2 శాతంగా ఉండవచ్చని అంచనావేసింది. ఆహారద్రవ్యోల్బణం కొంతమేర తగ్గుతుందని తెలిపింది. అలాగే ఆర్బీఐ మానిటరీ పాలసీలో కూడా 25 బేసిస్‌పాయింట్లు సర్దుబాటుచేయవచ్చని తెలిపింది. ఈనెల 29నుంచి అక్టోబరు ఒకటివరకూ మానిటరీ పాలసీ కమిటీ సమీక్షలు ఉంటాయి. రెపోరేటు 50 బేసిస్ పాయింట్లవరకూ ఉంటుందని రెపోరేటు5.5శాతంవరకూ ఉండవచ్చని అంచనా. జిడిపివృద్ధి 7.8శాతంగా జూన్‌త్రైమాసికంలో నమోదయింది. ఈ వృద్ధి మరింతగా పెరుగుతుందని, ఆదాయపు పన్నుకుదింపు, జిఎస్టీ సంస్కరణలతో వ1ద్ధిమరింతపెరిగే అవకాశం ఉందని అంచనావేసింది. భారత్ జిడిపి 330 లక్షలకోట్లవద్ద స్థిరపడుతుందని, అదే వినియోగం కూడా 202 లక్షలకోట్లరూపాయలవరకూ ఉంటుందని, గత ఏడాది 181 లక్షలకోట్ల నుంచి 12శాతంపెరుగుతుందని ఎస్అండ్‌పి గ్లోబల్ అంచనావేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14